పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 1 సంచిక : 80 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శనివారం 31 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 80 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : HYDERABAD SAT 31 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్
- కువైట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానం
- టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశం గుర్తింపు
- ప్రయాణికులంతా సురక్షితం, తనిఖీల్లో ఏమీ లభించలేదు
- ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు, విమాన ప్రయాణంపై అనిశ్చితి

- మిగతా 2లో...

మున్సి'పోల్స్'లో ముగిసిన నామినేషన్లు

చివరి రోజు అట్టహాసంగా దాఖలు

- సింహం గుర్తుపై బరిలో నిలిచిన జాగృతి
- పలుచోట్ల జనసేన అభ్యర్థుల పోటీ
- పోటీలో ఉన్న తీన్మార్ మల్లన్న టీఆర్పీ
- ఈ సారి కొత్తగా వచ్చిన మూడు పార్టీలు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు (జనవరి 30)ముగిసింది. సాయంత్రం 5గంటల వరకు క్యూ లైన్లలో ఉన్న అభ్యర్థులకు నామినేషన్లు వేయడానికి చాన్స్ ఇస్తారు. జనవరి 31న నామినేషన్లను పరిశీలిస్తారు. ఫిబ్రవరి 3 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.అదే రోజు ఫైనల్ అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తుంది ఈసీ. ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్ జరగనుండగా.. 13న కౌంటింగ్ జరుగుతుంది.

మున్సిపల్ ఎన్నికల్లో52 లక్షల ఓటర్లు

రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. మహిళలు 26.80 లక్షలు, పురుషులు 25.62 లక్షలు, ఇతరులు 640 మంది ఉన్నారు. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు .ఫిబ్రవరి 3 వరకు విత్ డ్రాలు నిర్వహించి అదే రోజు అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తారు. ఫిబ్రవరి 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో 48 గంటల ముందే ప్రచారం ముగుస్తుంది. అంటే వచ్చే ఫిబ్రవరి 9వ తేదీన ప్రచారం బంద్ అవుతుంది. ఈ లెక్కన అభ్యర్థులు కేవలం ఆరు రోజులు మాత్రమే ప్రచారం చేయాల్సి ఉంటుంది.

రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

తొలి సీఎంగా చరిత్ర

- హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో లీడర్ షిప్ కోర్సును పూర్తి చేసుకున్న రేవంత్
- సర్టిఫికెట్ అందించిన హార్వర్డ్ అధ్యాపకులు
- శిక్షణలో సాధారణ విద్యార్థిలా గడిపిన రేవంత్

హైదరాబాద్ పెన్ పవర్:రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో అనునిత్యం ఎంతో బిజీగా ఉండే తెలంగాణ ముఖ్యమంత్రి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ కెన్నెడీ స్కూల్ లో 'లీడర్ షిప్ ఇన్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కాన్ఫ్లిక్ట్ అండ్ కరేజ్' ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న రేవంత్ కు హార్వర్డ్ అధ్యాపకులు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. అధికారంలో ఉండగానే ఈ సర్టిఫికెట్ పొందిన తొలి భారతీయ ముఖ్యమంత్రిగా రేవంత్ చరిత్ర సృష్టించారు. ఈ ప్రోగ్రామ్ లో ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి 62 మంది

- మిగతా 2లో...

సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు అసహనం
- ప్రభుత్వం తీరుపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం
- పరిహారం ఎప్పుడు, ఎంత ఇస్తారో చెప్పాలంటూ ప్రశ్నలు
- కంపెనీతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ డైరెక్టర్లకు నోటీసులు

హైదరాబాద్ పెన్ పవర్:సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో జాప్యం, స్పష్టత లేకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.గతేడాది సంగారెడ్డి

- మిగతా 2లో...

మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం

- గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ
- వనదేవతల దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- వివిధ రాష్ట్రాల నుంచి పోటెత్తిన లక్షలాది భక్తులు
- వనదేవతలకు మొక్కులు చెల్లించిన బ్రిటిష్ అధికారి
- పటిష్ట ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా సాగుతున్న జాతర
- కరెంట్ కోతలతో ఉద్రిక్తత.. మంత్రి కారు ధ్వంసం
- వీఐపీలకే ప్రాధాన్యమంటూ పోలీసులపై విమర్శలు

హైదరాబాద్ పెన్ పవర్:ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర మూడో రోజైన శుక్రవారం పతాకస్థాయికి చేరింది. వనదేవత సమ్మక్క తల్లి గద్దెపై కొలువుదీరడంతో మేడారం ప్రాంగణం భక్తులతో జనసంద్రంగా మారింది. లక్షలాది మంది భక్తులు భక్తిపారవశ్యంతో అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో మేడారం కిక్కిరిసిపోయింది. ఆలయ పరిసరాలు,

- మిగతా 2లో...

కేసీఆర్‌కు సిట్ మరోసారి నోటీసులు...

ఫామ్‌హౌస్‌లో విచారణ జరపాలన్న విజ్ఞప్తి తిరస్కరణ

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌కు రెండోసారి సిట్ నోటీసు
- ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరుకావాలని ఆదేశం
- నందినగర్ నివాసంలోనే విచారిస్తామని స్పష్టం చేసిన సిట్

- మిగతా 2లో...

సీపీపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు..

భగ్గుమన్న ఐపీఎస్, ఐఏఎస్, పోలీస్ సంఘాలు

- కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన తెలంగాణ పోలీస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు
- విధులకు ఆటంకం కలిగించారంటూ కౌశిక్ రెడ్డిపై పోలీసుల కేసు నమోదు
- కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని అధికారుల సంఘాల డిమాండ్
- ఒత్తిడిలో మాట జారానంటూ క్షమాపణ చెప్పిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

- మిగతా 2లో...

ఏపీ- తెలంగాణ జల వివాదం..

ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

హైదరాబాద్ పెన్ పవర్::ఏపీ,తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారానికి సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఢిల్లీలో భేటీ అయ్యింది. ఈ సమావేశానికి కమిటీలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు కృష్ణా గోదావరి బోర్డుల చైర్మన్లు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ తరపున సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి , చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్, సూపర్డెంట్ ఇంజనీర్ గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామచంద్రరావు, కె, రమేష్ హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి

- మిగతా 2లో...

తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

హైదరాబాద్ పెన్ పవర్:తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై విచారణ చేసిన సీబీఐ.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.. తన నివేదికను వెల్లడించింది. సుదీర్ఘ విచారణ తర్వాత.. తిరుమల

- మిగతా 2లో...

కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

- ఎలాన్ మస్క్‌పై మరోసారి విరుచుకుపడ్డ వినోద్ ఖోస్లా
- జాతివివక్ష వ్యాఖ్యలు చేసి కుటుంబాన్ని అడ్డుపెట్టుకోవద్దని హితవు
- 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతిస్తున్నారని ఖోస్లా ఆరోపణ
- భారత సంతతి భాగస్వామి గురించి ప్రస్తావిస్తూ మస్క్ కౌంటర్
- ఇద్దరు టెక్ బిలియనీర్ల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం

- మిగతా 2లో...



కోచింగ్ భ్రమలో నిరుద్యోగ యువత

ప్రభుత్వ ఉద్యోగం అంటే ఒక వ్యక్తికి మాత్రమే కాదు.. ఒక కుటుంబానికి భరోసా, ఒక తరం భవిష్యత్తుకు ఆశ. ఆ ఒక్క నోటిఫికేషన్ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసే నిరుద్యోగ యువత మన సమాజంలో కోట్లల్లో ఉన్నారు.కానీ వారిలో ఆ ఆశతో పాటు నేడు మరో భయమూ వెంటాడుతోంది.. అది 'కోచింగ్ లేకపోతే ఉద్యోగం రాదు' అన్న భ్రమ. ఈ భ్రమే ఇప్పుడు కోట్ల రూపాయల వ్యాపారంగా మారింది. ఈ దందా ప్రభావం ఒక్కో అభ్యర్థి జీవితానికే పరిమితం కాదు.. రేపటి పాలన, పరిపాలన, విధానాల దిశపైనా దీని నీడ పడుతోంది.. యువత అసురక్షిత భావాలను పెట్టుబడిగా, తల్లిదండ్రుల కన్నీళ్లను లాభంగా మార్చుకుంటూ 'కోచింగ్ వ్యాపారం' నిశ్శబ్దంగా విస్తరిస్తోంది. ఇది విద్యా విస్తరణ కాదు.. ఇది నిరుద్యోగంపై నిర్మితమైన ఒక వ్యవస్థీకృత దందా. ప్రభుత్వాలు కోచింగ్ రంగాన్ని 'మార్కెట్ సమస్య'గా కాకుండా విద్యా విధాన సమస్యగా చూడాలి.. ఉద్యోగ ఆశలో పుట్టే కలలు కన్నీళ్లుగా మారకుండా ఉండాలంటే నిరుద్యోగులు, తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వం అందరూ బాధ్యతగా ఆలోచించాల్సిన క్షణం ఇదే. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వార్త వినగానే నిరుద్యోగుల్లో ఆశ చిగురిస్తుంది. కానీ ఎన్నాళ్లుగా ఎదురుచూస్తున్న అవకాశం దొరుకుతుందన్న భావన, జీవితానికి దిశ లభిస్తుందన్న ఆశ వారి కళ్లలో మెరుస్తుంది. కానీ ఆ ఆశ త్వరలోనే భయంగా మారుతోంది. స్వయంగా చదివితే విజయం సాధించలేమన్న భావన పెరిగి, తమ ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను మరిచిపోయేలా చేస్తోంది. చివరికి కోచింగ్‌పైనే ఆధారపడాల్సిందేనన్న భ్రమ నెలకొంటోంది. ఈ బలహీనతను అవకాశంగా చేసుకుని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు విస్తరిస్తూ, 'మా దగ్గర చదివితేనే ఉద్యోగం' అన్న నమ్మకాన్ని యువతలో నాటుతున్నాయి. దీనివల్ల అత్యంత నష్టపోతున్నవారు నిరుపేద అభ్యర్థులు, వారి కుటుంబాలే.. వారే అప్పులు చేసి పట్టణాలకు వెళ్లి ఖరీదైన కోచింగ్ ఫీజులు, జీవన ఖర్చులు భరిస్తూ తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోచింగ్ సెంటర్ల చేతుల్లో ఉండేది కాదు, అది అభ్యర్థి ఆలోచనా శక్తి, క్రమశిక్షణ, నిరంతర సాధనంపై ఆధారపడుతుంది. ఉద్యోగ నోటిఫికే షన్లకు ముందే మొదలయ్యే కోచింగ్ హడావుడి, అవి వెలువడగానే మరింత విస్తరిస్తోంది. ఇది విద్యా విస్తరణ కాదు.. నిరుద్యోగుల అమాయకత్వాన్ని సొమ్ముగా మలిచే వ్యవస్థీకృత వ్యాపారం.. కోట్ల టర్నోవర్‌తో నిర్వాహకులు ఆకర్షణీయమైన ప్రకటనలతో వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ కాలయాపన చేస్తున్నారు. ఇంకొందరేమో పాత, పనికిరాని మెటీరియల్‌ను కొత్త పేర్లతో 'ఇంపార్టంట్ మెటీరియల్'గా విక్రయిస్తున్నారు. దీంతో ఏది నాణ్యమైనదో తెలియని అభ్యర్థులు గుడ్డిగా నమ్ముతున్నారు. కొద్దిమంది ప్రతిభతో సాధించిన విజయాలను తమ కోచింగ్ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇందులో లాభపడేది కోచింగ్ సెంటర్లే.. అభ్యర్థులకు, ముఖ్యంగా నిరుపేద యువతకు దక్కేది శూన్యమే. అయితే, బోధకుల పాత్రను పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు.. కానీ దానికి స్పష్టమైన పరిమితులు, బాధ్యతలు ఉండాలి. మంచి బోధకుడు భయాన్ని పెంచడు, ఆ దిశను చూపుతాడు.. నోట్స్‌పై ఆధారపడేలా కాకుండా విద్యార్థిని స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తిగా తీర్చిదిద్దుతాడు. కానీ నేడు అనేక కోచింగ్ సెంటర్లలో బోధకులుగా ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగ ఎంపికల అనుభవం, విషయంపై లోతైన అవగాహన లేకపోయినా 'ఏళ్ల అనుభవజ్ఞులు', 'నిష్ణాతులు' అంటూ మోసపూరిత ప్రచారంతో నమ్మకం కల్పిస్తున్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ వంటి విస్తారమైన అవగాహన రంగాలను నోట్స్‌గా కుదించి, 'ఇవే వస్తాయి' అనే భ్రమను నాటడం వల్ల అభ్యర్థి ఆలోచనశక్తి క్షీణిస్తోంది. వాస్తవానికి వీటికి హద్దులుండవు, పూర్తిగా కవర్ చేయడం అసాధ్యం. ఇక ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ సైతం వివిధ కారణాలతో పదే పదే వాయిదా పడుతున్నాయి. ఈ జాప్యంలో అభ్యర్థుల నష్టం అపారం. కొందరి వయోపరిమితి దాటిపోతుండగా, మరికొందరు నిరాశలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.. ఈ ఆలస్యంతో లాభపడుతున్న కోచింగ్ సెంటర్ల మోసాల వ్యాపారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లపై బోధకుల అర్హతలు, ఫీజుల పరిమితులు, మోసపూరిత ప్రచారాల నిషేధంతో స్పష్టమైన విధానాలు రూపొందించి కఠినంగా అమలు చేయాలి.. ఇందుకోసం 'రాష్ట్రస్థాయి కోచింగ్ నియంత్రణ అథారిటీ'ని ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఉద్యోగ నోటిఫికేషన్లను సమయానికి విడుదల చేయడం, పారదర్శక నియామక ప్రక్రియను అమలు చేయడం అనివార్యం. లేకపోతే కోచింగ్ దందా యువత ఆశలపై మరింత బల పడుతూ, వ్యక్తిగత నష్టమే కాక తెలంగాణ సమాజ భవిష్యత్తుకే గాయంగా మారుతుంది.

కేసీఆర్‌కు సిట్ మరోసారి నోటీసులు...

అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని 160 సీఆర్‌పీసీ కింద ఈ నోటీసులు ఇచ్చారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కాకుండా, హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలోనే విచారణ జరపనున్నట్లు సిట్ స్పష్టం చేసింది.

ఇటీవల గురువారం సిట్ తొలిసారి నోటీసులు జారీ చేయగా, మున్సిపల్ ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల ఖరారు అంశంలో బిజీగా ఉన్నందున మరో తేదీ కేటాయించాలని కేసీఆర్ కోరారు. ఇందుకు సిట్ అంగీకరించింది. అయితే, తనను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లోనే విచారించాలని ఆయన చేసిన విజ్ఞప్తిని మాత్రం సిట్ అధికారులు తిరస్కరించారు. న్యాయ నిపుణుల సలహా మేరకు, నందినగర్‌లోని అధికారిక నివాసంలోనే విచారణ జరపాలని నిర్ణయించి, శుక్రవారం రెండోసారి నోటీసులు అందజేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, న్యాయమూర్తులు, ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్న ఆరోపణలపై 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులతో పాటు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావులను సిట్ విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేసింది.ఇప్పటివరకు సేకరించిన ఆధారాలు, నమోదు చేసిన వాంగ్మూలాల ఆధారంగా ఈ కేసులో కేసీఆర్‌ను విచారించడం కీలకమని సిట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరగనున్న విచారణ తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

మేడారం జనసంద్రం.. పోటెత్తిన భక్తజనం

- మొదటి పేజీ తరువాయి

జంపన్న వాగు భక్తులతో నిండిపోయాయి. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు కిలోమీటర్ల పొడవునా బారులు తీరారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వ యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. జాతర ప్రశాంతంగా సాగుతోందని అధికారులు తెలిపారు.ఈ జాతరకు ప్రముఖుల తాకిడి కూడా కొనసాగుతోంది. హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ శుక్రవారం మేడారం సందర్శించి, సంప్రదాయ వస్త్రధారణలో తులాభారం మొక్కు చెల్లించుకున్నారు. మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ ఆయనకు జాతర ప్రాశస్త్యాన్ని వివరించారు. వీరితో పాటు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు కొండా సురేఖ, భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జువల్ ఓరం అమ్మవార్లను దర్శించుకున్నారు.

జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం గురువారం రాత్రి జరిగింది. చిలకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని గిరిజన సంప్రదాయాల నడుమ మేడారంలోని గద్దెపైకి తీసుకొచ్చారు. సమ్మక్క తల్లి ప్రయాణం ప్రారంభమవగానే, జిల్లా ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. అర్ధరాత్రి దాటాక సమ్మక్క తల్లి గద్దెపైకి చేరారు. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపై కొలువుదీరగా, సమ్మక్క తల్లి కూడా చేరడంతో భక్తులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు.

సీపీపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు.. భగ్గుమన్న ఐపీఎస్, ఐఏఎస్, పోలీస్ సంఘాలు

కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌస్ ఆలంను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలను తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఐపీఎస్ అధికారుల సంఘం, ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించాయి. ఎమ్మెల్యే తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, కమిషనర్‌కు, ఇతర పోలీస్ అధికారులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.

అసలేం జరిగింది?

గురువారం హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తన స్వగ్రామమైన వీణవంకలో జరిగే సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. అయితే, జాతర వద్ద రద్దీని నియంత్రించేందుకు, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పెద్ద కాన్వాయ్‌లకు అనుమతి లేదని పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు హుజూరాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యే వర్గీయులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు వారిని రోడ్డుపై నుంచి పక్కకు పంపించారు.ఆ తర్వాత వీణవంకలోని జాతర ప్రాంగణంలో సమ్మక్క గద్దె వద్ద కూడా కౌశిక్ రెడ్డి పోలీసులతో మరోసారి వాగ్వాదానికి దిగారు. గ్రామ సర్పంచ్‌ను కొబ్బరికాయ కొట్టనీయలేదని ఆయన ఆరోపించగా, పోలీసులు ఆ ఆరోపణలను ఖండించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని సైదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, తర్వాత విడుదల చేశారు. ఈ ఘటనపై హుజూరాబాద్ పోలీసులు శుక్రవారం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులను దూషించి, ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ భారతీయ న్యా య సంహితలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

అధికారుల సంఘాల తీవ్ర ఖండన

హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తున్న పోలీసు అధికారులపై ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తెలంగాణ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి ఎదుల తీవ్రంగా ఖండించారు. "ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా గుంపుగా వెళ్లడమే కాకుండా, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించే ప్రయత్నం చేయడం దారుణం. అక్కడ లేని సీపీ మతాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం అత్యంత హేయమైన చర్య" అని ఆయన మండిపడ్డారు. పాడి కౌశిక్‌రెడ్డిపై తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్‌పై ఆయన చేసిన మతపరమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, అధికారి మతాన్ని ప్రస్తావించడం హేయమైన చర్య అని ఐపీఎస్ సంఘం పేర్కొంది. నిబద్ధతతో పనిచేసే అధికారులపై ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం పౌర సేవల గౌరవానికి భంగం కలిగించడమేనని, ఎమ్మెల్యేపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఐఏఎస్ అధికారుల సంఘం కూడా కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలను "పరువు నష్టం కలిగించేవి, మతపరమైనవి"గా అభివర్ణించింది. "అధికారులు చట్టాన్ని అమలు చేస్తుంటే, శాసనసభ్యుడు మతపరమైన గుర్తింపు ఆధారంగా వ్యక్తిగత దాడికి దిగడం విచారకరం. ఇది లౌకిక స్ఫూర్తిపై, పోలీసు వ్యవస్థ స్వయంప్రతిపత్తిపై జరిగిన దాడి. ఎమ్మెల్యే తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి. శాసనసభాపతి కూడా ఈ ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి" అని ఐఏఎస్ సంఘం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది.

క్షమాపణ చెప్పిన ఎమ్మెల్యే

వివాదం ముదరడంతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్పందించారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ మాటలు అనలేదని స్పష్టం చేశారు. "పోలీసులు, అధికారులంటే నాకు అపారమైన గౌరవం ఉంది. కానీ, జాతరకు వెళుతున్నప్పుడు మమ్మల్ని అడ్డుకుని తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. ఆ ఫ్రస్ట్రేషన్, ఒత్తిడిలో తెలియకుండానే మాటలు జారాయి. ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరుతున్నాను" అని ఆయన వివరణ ఇచ్చారు.

ఏపీ- తెలంగాణ జల వివాదం.. ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

- మొదటి పేజీ తరువాయి

జనవరి 2 న ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. గోదావరి, కృష్ణాలో అందుబాటులో ఉన్న జలాలు నికర జలాలు, మిగులు జలాలు, ప్రాజెక్టులు సహా పల అంశాలపై వివాదాలను పరిష్కరించుకుని ఎలా ముందుకు వెళ్లాలని దానిపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు.

గతేడాది కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు వాటిని చర్చించి సాంకేతికంగా పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకే ఇవాళ భేటీ అయిన ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు అయ్యింది.

తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

- మొదటి పేజీ తరువాయి

వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు లేదని.. జంతువుల నుంచి తీసిన కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని వెల్లడించింది సీబీఐ. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు ఉందని స్వయంగా సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటల తర్వాత.. కేసులు నమోదయ్యాయి. సీబీఐ విచారణకు జగన్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సీబీఐ విచారణ చేసింది. విచారణ తర్వాత.. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమలలో తయారు చేసిన లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని.. కల్తీ జరగలేదని.. స్పష్టం చేస్తూ సీబీఐ రిపోర్ట్ ఇచ్చింది.

శుక్రవారం (జనవరి 23) ఫైనల్ చార్జిషీట్ సమర్పించింది సీబీఐ సిట్. తిరుమల లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యిలో కూరగాయల నూనెలు, కృత్రిమ పాల ఉత్పత్తులలో వాడే ఈస్టర్‌లు కలిపి కల్తీ చేశారని చార్జిషీట్ లో పేర్కొంది సిట్. నెయ్యిలో జంతువుల కొవ్వు జాడ లేదని స్పష్టం చేసింది సిట్. సిట్ సమర్పించిన ఫైనల్ చార్జిషీట్ పై స్పందించిన టీటీడీ మాజీ చైర్మెన్ భూమన కరుణాకర్ రెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఉద్దేశపూర్వకంగా హిందూ మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు.జగన్ ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఏకైక ఉద్దేశంతోనే తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతు కొవ్వు వాడారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో జగన్ ను కించపరచడమే కాకుండా.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రత, ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు.గత ఏడాదిన్నర కాలంగా.. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్లకు పైగా హిందువులు ఈ తప్పుడు ప్రచారంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని అన్నారు.ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో ఉన్న ప్రధాన సరఫరాదారు భోలే బాబా ఆర్గానిక్ డెయిరీ "వర్చువల్" తయారీ యూనిట్‌గా పనిచేస్తుందని ఛార్జిషీట్ లో వెల్లడించింది సిట్. 2019 నుండి 2024 వరకు భోలేబాబా డెయిరీ నెయ్యి తయారీ కోసం పాలు, వెన్నను తీసుకోలేదని, అయినప్పటికీ టీటీడీకి కనీసం 68వేల కిలోల నెయ్యిని సరఫరా చేసిందని పేర్కొంది సిట్.ఫైనల్ ఛార్జిషీట్‌లో 36 మందిని నిందితులుగా పేర్కొంది సిట్, ఇందులో తొమ్మిది మంది టిటిడి అధికారులు, ఐదుగురు డైరీకి సంబంధించిన వ్యక్తులు, తదితరులు ఉన్నారు.

రేవంత్ రెడ్డి హార్వర్డ్ కోర్సు పూర్తి..

తొలి సీఎంగా చరిత్ర

- మొదటి పేజీ తరువాయి

విద్యార్థులు పాల్గొన్నారు. జనవరి 25న ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమయింది. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుదీర్ఘంగా క్లాసులు జరిగాయి. ఈ శిక్షణలో రేవంత్ సాధారణ విద్యార్థిలా గడిపారు. 21వ శతాబ్దంలో ప్రపంచానికి ఎదురయ్యే సవాళ్లు, నాయకత్వ మెళకువలు, సంక్షోభ పరిస్థితులను ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై కేస్ స్టడీలు, గ్రూప్ ప్రాజెక్టుల ద్వారా వీరికి శిక్షణ కొనసాగింది. మంచు తుపాను కారణంగా అక్కడి ఉష్ణోగ్రతలు -24 డిగ్రీలకు పడిపోయినప్పటికీ... విరామం తీసుకోకుండా రేవంత్ క్లాసులకు హాజరయ్యారు.

సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది దుర్మరణం చెందగా, 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులకు పరిహారం అందించాలని, ఘటనపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. "పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎంత ఇస్తున్నారు? అసలు ఎప్పుడు ఇస్తారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.పరిహారం పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కంపెనీని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసులో ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాల వివరాలను సమర్పించాలని వారికి నోటీసులు జారీ చేసింది.

కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

భారత సంతతికి చెందిన బిలియనీర్ ఇన్వెస్టర్ వినోద్ ఖోస్లా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. జాతి వివక్షాపూరిత వ్యాఖ్యలు చేస్తూ, తనను తాను సమర్థించుకోవడానికి కుటుంబాన్ని మధ్యలోకి లాగడంపై ఖోస్లా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మస్క్‌కు చురకలు అంటించారు.

"ప్రపంచ జనాభాలో శ్వేతజాతీయులు వేగంగా అంతరించిపోతున్న మైనారిటీ" అంటూ మస్క్ గతంలో చేసిన ఓ పోస్ట్‌తో ఈ వివాదం మొదలైంది. దీనిపై స్పందించిన ఖోస్లా.. మస్క్ జాతి వివక్షను ప్రోత్సహిస్తున్నారని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్' (ఔూ+ఱూ)కు మద్దతిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ఖోస్లాను 'గర్విష్టి', 'రిటార్డ్' అంటూ దూషించారు. తన భాగస్వామి శివాన్ జిలిస్ సగం భారతీయురాలని, వారి కుమారుడికి భారత సంతతికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత చంద్రశేఖర్ పేరు పెట్టానని చెబుతూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఖోస్లా మరోసారి స్పందించారు. "మీ కుటుంబాన్ని ఇందులో కలపడానికి బదులు, మరోసారి జాతి వివక్షగా అనిపించే పోస్టులు పెట్టకుండా ప్రయత్నించండి. మీరు అమెరికాలో శ్వేతజాతి సమాజాన్ని స్థాపించడానికి ప్రయత్నించడం లేదని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతుదారు కాదని అంగీకరిస్తే చాలామంది అభినందిస్తారు" అని ఖోస్లా పేర్కొన్నారు.మస్క్ ప్రస్తావించిన బీచ్ వివాదంపై కూడా ఖోస్లా స్పందించారు. తన కాలిఫోర్నియా ఆస్తి సమీపంలోని బీచ్‌కు వెళ్లేందుకు ప్రైవేట్ ప్రాపర్టీ గుండా ప్రవేశించాలంటే రుసుము చెల్లించాల్సిందేనని అన్ని కోర్టులు తీర్పు ఇచ్చాయని గుర్తుచేశారు. "ప్రైవేట్ ఆస్తి హక్కు అనే సూత్రాన్ని కాపాడటానికి నేను నిలబడటాన్ని మీరు అభినందించాలి. ఇది కాకపోతే మిగతాదంతా కమ్యూనిజమే" అని వ్యాఖ్యానించారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణికులతో సహా మొత్తం 186 మంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానం గాల్లో ఉండగా, ఓ టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. విమానాన్ని హైజాక్ చేస్తామని, బాంబు ఉందని ఆ నోట్‌లో ఉండటంతో పైలట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ భద్రతా నిబంధనల ప్రకారం, పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే, భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులందరినీ కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.డి. నకుమ్ మాట్లాడుతూ, "తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. విమానం తనిఖీ పూర్తయింది, తదుపరి విచారణ కొనసాగుతోంది" అని వివరించారు.అధికారులు ఈ చేతిరాత నోట్ ఎక్కడి నుంచి వచ్చింది, విమానంలోకి ఎలా చేరింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విమానం తిరిగి ఢిల్లీకి ఎప్పుడు బయలుదేరుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల అహ్మదాబాద్‌లో పలు చోట్ల బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ వట్టిదేనని తేలింది. అయినప్పటికీ, ప్రతి బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నామని పోలీసులు తెలిపారు.

దోచుకోవడంలో భారాస, కాంగ్రెస్ పోటాపోటీ

భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్ పెన్ పవర్: భారాస, కాంగ్రెస్‌లు రాష్ట్రాన్ని దోచుకోవడంలో పోటీ పడుతున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన భాజపా పురపాలక ఎన్నికల సభలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారాస పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకొని అప్పుల పాలు చేస్తే.. రెండేళ్లుగా కాంగ్రెస్ అదే పనిలో ఉందన్నారు. ఉద్యోగుల జీతాలకు డబ్బులు లేవని సీఎం రేవంత్‌రెడ్డి చెబుతుంటే సరదాలకు, మంత్రుల నివాసాలకు రూ.కోట్లు వెచ్చిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి విచారణలతో చేతులు దులుపుకొంటున్నారని ధ్వజమెత్తారు. బొగ్గు కుంభకోణం భారాస చేసిందేనని, కాంగ్రెస్ అదే దారిలో నడుస్తోందన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి ఇచ్చిన రూ.12 లక్షల కోట్లతోనే రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. యువకులు, మహిళలు, మేధావులు భాజపావైపే ఉన్నారని, రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్లు, పురపాలికల్లో పార్టీ జెండా ఎగురవేస్తామని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కమీషన్లు తప్ప పనుల్లేవని ఎద్దేవా చేశారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసులో భారాస నాయకులను జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. సభలో పలువురు భాజపా నాయకులు పాల్గొన్నారు.

సాధువు ముసుగులో మత్తు దందా...

పూలతోటలో గంజాయి సాగు..భక్తులకు కిక్కెక్కిస్తున్న గుడి పూజారి

హైదరాబాద్ పెన్ పవర్:పూల వనంలో గంజాయి సాగు.. పూజారి ముసుగులో మత్తు దందా..గుడికి వచ్చే భక్తులను నాలుగు మంచి మాటలు చెప్పి మంచిమార్గంలో పెట్టాల్సిపోయి..మత్తు పదార్థాలతో కిక్కెక్కిస్తున్నాడు ఓ సాధువు. చుట్టూ నాలుగు ఊర్ల ప్రజలను నమ్మించి అక్రమంగా ఈ మత్తు దందా చేస్తున్న గురు మహారాజ్ కటకటాలు లెక్కపెడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ మండలం పంచాగామ్ లో అక్రమంగా గంజాయి సాగు చేస్తూ మత్తు పదార్థాల దందా చేస్తున్న గుడి పూజారిని డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గత కొద్దికాలంగా పంచాగామ్ లో గంజాయి సాగు అవుతోందని సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిబ్బంది గ్రామంలో తనిఖీలు చేపట్టారు. గుడి పూజారిగా పనిచేస్తున్న అవుంటి నర్సయ్య అనే సాధువు, దేవుడికోసం సాగుచేస్తున్న పూలవనంలో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించారు. అవుంటి నర్సయ్య పూలవనంలో సాగు చేసిన 17.741కేజీల 685 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.70లక్షల ఉంటుందని అంచనా వేశారు.చాల కాలంగా గంజాయి సాగు చేస్తూ ప్యాకెట్లుగా తయారు చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయ్యింది.
పంచాగామ్ తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలకు సాధువుగా మంచి గుర్తింపు ఉన్న ఈ పూజారి, గంజాయి దందా చేస్తున్నాడనితెలియడంతో అంతా షాక్ అయ్యారు. గుడిలోపూజారిగా ఉండి ఇవేం పనులంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పోలీసులకు "సారీ" చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి...

- వీణవంక జాతరలో పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు
- విమర్శల నేపథ్యంలో క్షమాపణలు చెప్పిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి
- ఆవేశంలో నోరు జారానని, ఉద్దేశపూర్వకం కాదని వివరణ
- సీఎం ప్రోద్బలంతో తనపై కక్ష సాధిస్తున్నారని ఆరోపణ
- కౌశిక్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు

-4 లో

ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

- ఎర్రవెల్లి ఫాంహౌస్ లో కొనసాగుతున్న భేటీ
- మున్సిపల్ ఎన్నికలు, సిట్ నోటీసులపై చర్చ

-4 లో

రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదు

- తెలంగాణ జలాలను ఏపీకి దోచిపెడుతున్నారని హరీశ్ మండిపాటు
- కత్తి చంద్రబాబుది, పొడిచేది రేవంత్ రెడ్డి అని విమర్శ
- చంద్రబాబుకి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని మండిపాటు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ జలాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రకు దోచిపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఈ ప్రాంతంవాడే తెలంగాణకు ద్రోహం చేస్తున్నాడని కాళోజీ ముందే చెప్పినట్టే... సీఎం హోదాలో రేవంత్ రెడ్డి తెలంగాణ నీటిని ఏపీకి దోచిపెడుతున్నారని అన్నారు. పక్కా పథకం ప్రకారం పోలవరం-నల్లమలసాగర్ కు ఏపీ ప్రభుత్వానికి రేవంత్ సర్కార్ సహకరిస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే సుప్రీంకోర్టులో చెల్లని రిట్ పిటిషన్ వేసి, వాపస్ తెచ్చుకున్నారని విమర్శించారు. తొలి నుంచి కూడా గోదావరి నదీ జలాల అక్రమ తరలింపుపై బీఆర్ఎస్ అప్రమత్తం చేస్తూనే ఉందని... అయినా కాంగ్రెస్ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని హరీశ్ అన్నారు. ముల్లు కర్రతో పొడుస్తూ మొద్దు నిద్ర లేపుతున్నా... కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తప్పులు చేస్తూనే ఉందని దుయ్యబట్టారు. జలద్రోహం విషయంలో కత్తి చంద్రబాబుదని, పొడిచేది రేవంత్ రెడ్డి అని అన్నారు. చంద్రబాబుకు

-4 లో

భారాస హయాంలోనే జలద్రోహానికి పునాది

నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

నదీజలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షిస్తాం

హైదరాబాద్ పెన్ పవర్: కృష్ణా, గోదావరి నదీజలాల్లో చుక్కనీటిని కూడా వదులుకునేది లేదని, రాష్ట్ర వాటాను పరిరక్షిస్తామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు. నదుల నీటి అంశంపై పదేపదే అబద్ధాలు చెబితే తెలంగాణ సమాజం నమ్ముతుందన్న భ్రమలో భారాస నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. శుక్రవారం జూమ్ ద్వారా విలేకరుల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే నీటిహక్కుల కోసం సర్వశక్తులూ ఒడ్డుతున్నాం. భారాస చేసిన పొరపాట్లు సరిదిద్దుతున్నాం. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన 811 టీఎంసీలలో.. ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకాలు చేయలేదా? సీఎంగా కేసీఆర్.. నీటిపారుదలశాఖ మంత్రిగా హరీశ్‌రావు ఉన్నప్పుడే ఈ ఒప్పందం జరిగిన మాట వాస్తవం కాదా? ఇప్పుడు మేం కృష్ణా జలాల్లో 70 శాతం వాటా కోసం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నాం.

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

ఫాంహౌస్ లో కేసీఆర్ తో సమావేశమైన కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ లో వీరి భేటీ కొనసాగుతోంది. మున్సిపల్ ఎన్నికలు, ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు తదితర అంశాలపై వీరు చర్చిస్తున్నట్టు సమాచారం. కేసీఆర్ తో నిన్న హరీశ్ రావు భేటీ అయిన సంగతి తెలిసిందే. సిట్ అడిగే ప్రశ్నలు, సమాధాలు ఇచ్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై వీరు చర్చించినట్టు తెలుస్తోంది.కేసీఆర్ కు అందిన నోటీసులను ఎలా ఎదుర్కోవాలి, ఈ విషయాన్ని పార్టీకి నష్టం కలగకుండా ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి అనే అంశంపై నిన్న హరీశ్ తో, ఈరోజు కేటీఆర్ తో చర్చిస్తున్నట్టు సమాచారం. రాబోయే రోజుల్లో రాజకీయ పరంగా ఎలాంటి అడుగులు వేయాలి, ఎలాంటి ప్రజా ఉద్యమాలను నిర్మించాలి, మీడియా ముందుకు ఎలాంటి అంశాలను తీసుకెళ్లాలనే అంశాలపై చర్చ జరుగుతోంది. మున్సిపల్ ఎన్నికలను బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ దూకుడు తగ్గించాలనే పట్టుదలతో ఉంది.

పోలీసులకు “సారీ“ చెప్పిన పాడి కౌశిక్ రెడ్డి...

హైదరాబాద్ పెన్ పవర్:కరీంనగర్ జిల్లా వీణవంక సమ్మక్క-సారలమ్మ మినీ జాతర సందర్భంగా పోలీసులపై తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్షమాపణలు చెప్పారు. ఆవేశంలో నోరు జారానని, ఉద్దేశపూర్వకంగా అనలేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల మనోభావాలు దెబ్బతిని ఉంటే క్షమించాలని కోరుతూ, ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని విజ్ఞప్తి చేశారు.గురువారం రాత్రి వీణవంక జాతరలో దళిత మహిళా సర్పంచ్‌ను కొబ్బరికాయ కొట్టనివ్వలేదని ఆరోపిస్తూ కౌశిక్ రెడ్డి కుటుంబంతో కలిసి నిరసనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగి తోపులాట చోటుచేసుకుంది. ఆ సమయంలో కౌశిక్ రెడ్డి పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి మాట్లాడుతూ, తమ ప్రభుత్వం వచ్చినప్పుడు అంతు చూస్తామని హెచ్చరించారు. ఈ ఘటన తర్వాత పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఐపీఎస్ అధికారుల సంఘం కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది.ఈ నేపథ్యంలో కౌశిక్ రెడ్డి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. “సీఎం ప్రోద్బలంతో నాపై, నా కుటుంబంపై రాజకీయ కక్ష సాధిస్తున్నారు. పోలీసులు, అధికారులంటే నాకు ఎంతో గౌరవం. జాతరకు వెళుతుండగా అడ్డుకుని తీవ్ర ఒత్తిడికి గురిచేశారు. ఆ ఫ్రస్టేషన్‌లో నోరు జారింది. నా వ్యాఖ్యల వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమించాలి“ అని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదు

-3 పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కోసం రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న రేవంత్ ను తెలంగాణ సమాజం క్షమించదని హరీశ్ అన్నారు. రేవంత్ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, రాష్ట్ర నీటి హక్కుల కోసం మరో పోరాటం చేస్తామని ప్రకటించారు. తెలంగాణకు జరుగుతున్న దోపిడీపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఇప్పటికైనా నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

ధర్వల్లిలో ఫిజియోథెరపీపై అవగాహన సదస్సు

హైదరాబాద్ పెన్ పవర్: : ధర్వల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిమ్స్ ఫిజియోథెరపీ వైద్యులు ఉద్యోగులకు, ఉపాధి హామీ కూలీలకు, గ్రామ ప్రజలకు ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు. మైగ్రేన్, పిల్లలకు ఫిజియోథెరపీ అవసరం, పుట్టిన పిల్లలకు చేసే ఫిజియోథెరపీ, హెడ్, నెక్, పెరాసిస్ వంటి అంశాలపై వైద్యులు వివరించారు.
ఈ కార్యక్రమంలో తాసిల్దార్ టి శాంత, ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీఓ రాజేష్, సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, నిమ్స్ ఫిజియోథెరపీ డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

నదీజలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షిస్తాం

-3 పేజీ తరువాయి

పోలవరం– నల్లమలసాగర్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నాం. పలు సంస్థలకు దీనిపై లేఖలు రాశాం. దీనిపై వేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనలతో వెనక్కి తీసుకున్నాం. ఒరిజినల్ సూట్ వేస్తున్నాం. ఈ ప్రాజెక్టు పీఎఫ్ఆర్‌పైనా, ఇతర ప్రాజెక్టులపైనా రెండురోజుల క్రితం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్‌పాటిల్‌కు లేఖ రాశాం. పీఎఫ్ఆర్‌కు సంబంధించి ఎలాంటి అనుమతి ఇవ్వలేదని.. ఆయన లేఖ ద్వారా సమాధానమిచ్చారు. అయినప్పటికీ భారాస నాయకులు అబద్ధాలు చెప్పి సమాజాన్ని మోసం చేసేందుకు యత్నిస్తున్నారు.

నాడు విందు రాజకీయాలు చేయలేదా?

నాడు జగన్‌మోహన్‌రెడ్డికి విందు ఇచ్చి గోదావరి జలాలను రాయలసీమకు తీసుకెళ్లి రతనాల సీమ చేస్తామని కేసీఆర్ అనలేదా..? రోజా ఇంటికి వెళ్లి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఎవరూ మర్చిపోరు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్లపాటు భారాస రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసింది. జల ద్రోహానికి పునాది వారి హయాంలోనే పడింది. పదేళ్లలో రూ.17 లక్షల కోట్లు బడ్జెట్ కింద ఖర్చు చేస్తే దానిలో నీటిపారుదలకు రూ.1.80 లక్షల కోట్లు వ్యయం చేసింది. రూ.లక్ష కోట్లు కాళేశ్వరానికే ఖర్చు చేయగా.. అది వారి హయాంలోనే కుప్పకూలింది. ఆ ప్రాజెక్టు నిర్మించిన ఐదేళ్లలో ఎత్తిపోసింది 160 టీఎంసీలే. దానిలో సముద్రంలోకి వదిలేయగా వినియోగించింది 70 టీఎంసీలే. ఆ నీటితో 17 లక్షల ఎకరాలకు సాగునీరు ఎలా ఇచ్చారో హరీశ్‌రావు లెక్కలు చెప్పాలి. సీడబ్ల్యూసీ ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంపై ఆయన తెలుసుకుని మాట్లాడాలి. పోలవరం–నల్లమల సాగర్ ప్రాజెక్టును ఎజెండాలో చేర్చొద్దని ఈ సమావేశంలో అధికారులు వాదించారు. తెలంగాణ ప్రాజెక్టులపై అపగాహన ఉన్న ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించుకున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులకు ఆదిత్యనాథ్ దాస్, ఏపీ ప్రాజెక్టులకు ఎస్కే జోషి ఇన్‌ఛార్జులుగా పనిచేశారు. మేం దాస్‌ను సలహాదారుగా నియమించుకుంటే, నాడు భారాస హయాంలో జోషిని నియమించుకున్నారు' అని ఉత్తమ్ పేర్కొన్నారు.

మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 వార్షికోత్సవాల వేడుకల్లో

హైదరాబాద్ పెన్ పవర్:

మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150 వ వార్షికోత్సవ వేడుకలు జరుపుకోవడం పట్ల మీ అందరికీ అభినందనలు అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.. .
సగటు మనిషి 75 సంవత్సరాలు జీవిస్తాడు అనుకుంటే150 సంవత్సరాల వేడుకలు అంటే రెండు తరాల వరకు చూసి ఉంటారు.
హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి ఎంతో గొప్ప గొప్ప వారు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు.
తురేబాజ్ ఖాన్ ఈ ప్రాంతం నుండి యుద్ధం చేశారు. బ్రిటిష్ వాళ్ళకి, నిజాం లకు స్థావరంగా ఉండేది..అప్పుడు ఈ పాఠశాల స్థాపించారు
150 ఏళ్ల కిందనే ఇక్కడ పాఠశాల ఏర్పడింది అంటేనే..ఇక్కడ ఇంత పెద్ద మేధావులు ఏర్పడ్డారు
విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు
నెహ్రూ ఆలోచన.నెహ్రూ పంచవర్ష ప్రణాళికల ద్వారా వ్యవసాయక విప్లవం, పారిశ్రామిక విప్లవం, విద్యాలయాలు ఐఐటీ లు ఏర్పాటు చేశారు.. బహుళార్థక సాధక ప్రాజెక్టులు నిర్మించారు.
ఆనాడు పాఠశాల ప్రారంభానికి చొరవ తీసుకున్న వారందరికీ ధన్యవాదాలు.ప్రవేశ పరీక్షలు రాసి అధ్యాపకులు అయి వచ్చిన మన దగ్గర పిల్లల్లు తగ్గుతున్నారు. మళ్ళీ ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం రావాలని విద్యార్థి నాయకుడిగా కోరుకుంటున్న.గతంలో పేదలకు పంచడానికి భూములు, డబ్బులు ఉండే ఇప్పుడు విద్య మాత్రమే ప్రభుత్వం ఇవ్వగలుగుతుంది.ఇటీవల జరిగిన సర్వే లో కులం, డబ్బు ఏది పని చేయలేదు ఏ కుటుంబం అయితే ఉన్నత స్థాయిలో ఉందో పరిశీలిస్తే విద్యావంతులుగా ఉన్న కుటుంబాలు మాత్రమే ఉన్నత స్థాయిలో ఉన్నాయిమీరంతా మంచి చదువులు చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు

తెలంగాణలో వ్యవసాయం భేష్...

హైదరాబాద్, జనవరి 30, పెన్ పవర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో తెలంగాణ వ్యవసాయ రంగం సాధించిన ప్రగతి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2014 నుంచి 2023 మధ్యలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు భూమి విస్తీర్ణం.. ప్రస్తుతం 2.21 కోట్ల ఎకరాలకు చేరుకోవడం గమనార్హం. కేవలం తొమ్మిదేళ్లలోనే దాదాపు కోటి ఎకరాల అదనపు భూమి సాగులోకి రావడం వెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారీ నీటి పారుదల ప్రాజెక్టులు ప్రధాన కారణంగానిలిచాయి. ముఖ్యంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం మరియు మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలు భూగర్భ జలమట్టాన్ని పెంచి, బీడు భూములను సైతం పచ్చని పొలాలుగామార్చాయి.పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా ఆర్థిక సర్వే నివేదికలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలోసాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం ఊహించని రీతిలో పెరగడం విశేషం. సాగు విస్తీర్ణం పెరగడమే కాకుండా.. రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్నట్లు సర్వే స్పష్టం చేసింది.తెలంగాణ రాష్ట్రం ఏర్పడినకొత్తలో అంటే.. 2014 నుంచి 2023 మధ్య వరకు రాష్ట్రంలో సాగు యోగ్యమైన భూమి విస్తీర్ణం కేవలం 1.31 కోట్ల ఎకరాలుగా ఉండేది. ప్రస్తుతం ఏకంగా 2.21 కోట్ల ఎకరాలకు చేరుకుందని సర్వేలో పేర్కొన్నారు.అంటే దాదాపు ఒక కోటి ఎకరాల అదనపు భూమి కొత్తగా సాగులోకి వచ్చింది. ఇది దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేని విధంగా నమోదైన అతిపెద్ద వృద్ధిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సాగు విస్తీర్ణం ఇంతలా పెరగడంవెనుక రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బహుళార్థసాధక ప్రాజెక్టులు, జలవనరుల నిర్వహణ ప్రధాన కారణాలుగా ఆర్థిక సర్వే పేర్కొంది.అందులో ఒకటి మిషన్ కాకతీయ.. గ్రామాల్లోని చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భజలమట్టం భారీగా పెరిగింది. దీనివల్ల బావులు, బోర్ల కింద సాగు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు .. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ద్వారా గతంలో ఎడారిగా ఉన్న ప్రాంతాలకు కూడాసాగునీరు అందింది. వీటితో పాటు.. చెక్ డ్యామ్‌ల నిర్మాణం , కాలువల ఆధునీకరణ ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు చేరుతోంది. వీటి ఫలితమే.. సాగు భూమి విస్తీర్ణం అధికంగా పెరిగింది. ఇటీవల ప్రవేశపెట్టినభూ భారతి ద్వారా.. భూ రికార్డుల ప్రక్షాళన, రెవెన్యూ , రిజిస్ట్రేషన్ విభాగాల ఏకీకరణ వల్ల భూ యజమానులకు స్పష్టత వచ్చింది. ఇది రైతులు తమ భూములను మరింత సమర్థవంతంగా సాగు చేసుకునేలాప్రోత్సహించింది.వ్యవసాయంతో పాటు తయారీ రంగంలో తెలంగాణ 5 శాతం వాటాను నమోదు చేసింది. ఇక ఐటీ, ఫైనాన్స్ సర్వీసులలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడులతో కలిసి తెలంగాణ దేశంలో 40 శాతంవాటాను కలిగి ఉంది. ఏఐ స్టార్టప్‌లలో తెలంగాణ 7 శాతం వాటాతో దూసుకుపోతోంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. 2035 నాటికి హైదరాబాద్ జీడీపీ201.1 బిలియన్ డాలర్లకు చేరుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. మున్సిపల్ బాండ్ల జారీలో కూడా హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. సాగు విస్తీర్ణం పెరుగుదల కేవలం ఆహార భద్రతనే కాకుండా,గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కూడా బలోపేతం చేస్తోందని నివేదిక పేర్కొంది.

దేవరకద్రలో కదం తొక్కిన కాంగ్రెస్ శ్రేణులు

దేవరకద్ర, జనవరి 30పెన్ పవర్: దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ చివరి రోజున, శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఎన్నికలు: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

మహబూబ్‌నగర్, జనవరి 30పెన్ పవర్: మహబూబ్‌నగర్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో, రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ నెలకొనే అవకాశం ఉంది. ఇరు పార్టీలు అభ్యర్థుల ఎంపిక కోసం వివిధ రకాల సర్వేలు నిర్వహించి, వాటి ఆధారంగా తుది నిర్ణయం తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంకా పూర్తి కానందున, 'బీ' ఫారాలను ఇంకా అందజేయలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గద్వాల, జనవరి 30పెన్ పవర్:జోగులాంబ గద్వాల జిల్లా అనంతపురం గ్రామం నుండి పూడూర్ వెళ్లే మార్గంలో మూడు రోజుల క్రితం వడ్డే పర్శ (34) అనుమానాస్పదంగా మృతి చెందాడు. రూరల్ పోలీసులు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఎర్రవల్లి మండలం దువ్వాసిపల్లి గ్రామానికి చెందినవాడు, అతనికి ఇద్దరు కుమారులున్నారు. ఏడాది క్రితం భార్య వదిలి వెళ్లింది. సంఘటనా స్థలంలో ఎలాంటి పెనుగులాట లేకపోవడం, పక్కన మద్యం బాటిల్ ఉండటంతో, గుర్తుతెలియని వ్యక్తులు వడ్డే పర్శను హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

టికెట్ దక్కలేదని కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

మునుగోడు, జనవరి 30పెన్ పవర్: నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీలో అంతా సవ్యంగా ఉందని ప్రకటించిన 24 గంటల్లోనే చండూరు మున్సిపాలిటీలో వర్గ విభేదాలు రచ్చకెక్కాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ టికెట్ (బీ-ఫామ్) దక్కలేదన్న మనస్థాపంతో వేణు అనే కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వేణు చండూరు మున్సిపాలిటీలోని 9వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాలని అనుకున్నాడు, కానీ బీ-ఫామ్ దక్కకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

డివిజన్‌లో బీజేపీ నుంచి నామినేషన్

నల్లగొండ, జనవరి 30పెన్ పవర్:: నల్గొండలోని 39వ డివిజన్‌లో బీజేపీ అభ్యర్థి దాసరి సాయి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, మద్దతుదారులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. వార్డు సమగ్ర అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నట్లు ఆయన వెల్లడించారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.

గాంధీజీ ఆశయాలు సాధించాలి: ఎంజియూ వీసీ

మిర్యాలగూడ, జనవరి 30పెన్ పవర్: నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంజియూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, గాంధీజీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, ఆకుల రవి అంజిరెడ్డి, శ్రీదేవి, శంకర్, రమేష్ నాయక్, షరీఫ్, కిరణ్మయి పాల్గొన్నారు.

కొత్తపల్లిలో దోమల బెడద: గ్రామస్తుల ఆందోళన

దేవరకొండ, జనవరి 30 పెన్ పవర్:నల్గొండ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామపంచాయతీలో దోమల బెడద తీవ్రంగా ఉందని, దీనివల్ల గ్రామస్తులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సంఘటన జనవరి 30, 2026న నల్గొండ జిల్లా, నల్గొండ నియోజకవర్గంలో చోటుచేసుకుంది.

బీఆర్ఎస్‌లో చేరిక

నకిరేకల్, జనవరి 30పెన్ పవర్: నల్లగొండలో మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, ఆయన సతీమణి మమత మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నాగేశ్వర్‌రావు దంపతులకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ చేరిక కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

రామాలయన్ని సందర్శించిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

ఆర్మూర్, జనవరి 30 పెన్ పవర్:పెళ్లి రోజు సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి దంపతులు డిచ్పల్లి ఖిల్లా రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్రీస్తు పూర్వం 14వ శతాబ్దం నాటి ఈ రామాలయం, దాని పక్కనే ఉన్న ఓంకారం ఆకారంలో ఉన్న చెరువు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే ఎంతో ఆకట్టుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. చెరువు మరమ్మతులు, బోటింగ్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని సూచించారు. ఈ చెరువు అభివృద్ధి కోసం, రామాలయం పురోగతి కోసం ప్రభుత్వం నుండి కోటి రూపాయలు మంజూరు చేయాలని ఆయన కోరారు.

సీపీ ఆర్ తో ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్

నిజామాబాద్ అర్బన్, జనవరి 30 హైదరాబాద్ పెన్ పవర్:నిజామాబాద్ జిల్లా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ గొండ దస్తయ్య, మేడారం జాతర బందోబస్తులో భాగంగా తాడ్వాయి మండలం కాటాపూర్ క్రాస్ రోడ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా, మేడారం నుండి సిద్ధిపేట వెళుతున్న బస్సులో అపస్మారక స్థితికి వెళ్లిన శైలేంద్ర సురేష్ యాదవ్ అనే వ్యక్తికి వెంటనే సీపీఆర్ చేశారు. దీంతో ఆ వ్యక్తికి స్పృహ రావడంతో, అక్కడికి చేరుకున్న డీఎస్పీ సురేందర్, అదనపు ఎస్పీ భీమ్ రావ్ అంబులెన్స్ ను పిలిపించి, అతన్ని వరంగల్ ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ సకాలంలో స్పందించి ప్రాణాలు కాపాడారు.

గాంధీ వర్ధంతి: బీఆర్ఎస్ నాయకుల ఘన నివాళి

చాంద్రాయణగుట్ట, జనవరి 30 పెన్ పవర్: కార్పొరేషన్ మాజీ డిప్యూటీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మేయర్ ధనరాజు యాదవ్, సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, బీఆర్ఎస్ పార్టీ నిజాంపేట్ సింహపురి కాలనీలలో శుక్రవారం మహాత్మ సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ గాంధీ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు సాంబశివరెడ్డితో పాటు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ పలువురు నాయకులు కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్ కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు'
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

మున్సిపల్ ఎన్నికలు: నామినేషన్ల గడువు నేటితో ముగింపు

వరంగల్ వెస్ట్, జనవరి 30 పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు నేటి సాయంత్రం 5 గంటలతో గడువు ముగియనుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటికే 70 శాతం అభ్యర్థులను ప్రకటించగా, మిగిలిన స్థానాల కోసం తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఒక్కో వార్డులో ఇద్దరు ముగ్గురు పోటీ పడుతుండటంతో బీఫామ్ దక్కించుకునేందుకు అభ్యర్థులు పైస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 312 నామినేషన్లు దాఖలయ్యాయి. గడువు ముగుస్తుండటంతో కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

నామినేషన్ల ప్రక్రియ పరిశీలన

మెదక్, జనవరి 30 పెన్ పవర్: మెదక్ మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ రవి కిరణ్ శుక్రవారం పరిశీలించారు.

అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తున్న తీరు, కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. గడువు సమీపిస్తున్నందున, అధికారులు ఏర్పాట్లను వేగవంతం చేశారు.

పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభము

సిద్దిపేట, జనవరి 30 పెన్ పవర్: సిద్దిపేట పట్టణంలోని 8, 18, 29వ మున్సిపల్ వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, స్థానిక వార్డు కౌన్సిలర్లు వరాల కవిత సురేష్, అడ్డగట్ల కావేరి అంజి, మహ్మద్ అబ్దుల్ నజీర్ (అర్షద్)తో పాటు బీఆర్ఎస్ నాయకులు బందారం రాజు, అడ్డగట్ల శేఖర్, మహిపాల్ గౌడ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు. ఈ పనులు పట్టణ అభివృద్ధిలో భాగంగా చేపట్టారు.

బెజ్జంకిలో గాంధీ వర్ధంతి: కాంగ్రెస్ ఘన నివాళి

హుస్నాబాద్, జనవరి 30 పెన్ పవర్: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ, గాంధీజీ అహింస మార్గంలో ఎన్నో ఉద్యమాలు చేసి స్వాతంత్ర్యం సాధించారని, యువత ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రవుల సందీప్, మాజీ సర్పంచ్ రావుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు మెడికల్ కళాశాల సందర్శన

గజ్వేల్, జనవరి 30 పెన్ పవర్: వొకేషనల్ హెల్త్ కేర్ ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మద్దూరు మోడల్ స్కూల్ విద్యార్థులు సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ విమల థామస్ ఆధ్వర్యంలో, విద్యార్థులు కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించి, వైద్య విద్య విధానం, భవిష్యత్తు అవకాశాలపై అవగాహన పెంచుకున్నారు. ఈ పర్యటన వారికి వైద్య సేవలను ప్రత్యక్షంగా చూసే గొప్ప అవకాశాన్ని కల్పించింది.

ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకే పార్టీలో గుర్తింపు

దుబ్బాక, జనవరి 30 పెన్ పవర్: తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులకే పార్టీలో గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై తెలంగాణ జాగృతి అన్ని మున్సిపాలిటీల్లో పోటీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో సిద్దిపేట నుంచి కల్వకుంట్ల కవిత ఎన్నికల సమర శంఖం పూరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి నాయకులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

మక్తల్, జనవరి 30 పెన్ పవర్: నారాయణపేట జిల్లా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి 63వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. మాగనూరు మండలం కోల్పూర్ లిఫ్ట్ మాజీ ప్రెసిడెంట్ స్వామి గౌడ్, తన సహచరులతో కలిసి మాజీ ఎమ్మెల్యేకు పూలమాల వేసి సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

రోడ్ మ్యాప్ రెడీ చేస్తున్న కవిత

హైదరాబాద్ జనవరి 30, పెన్ పవర్:

తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూతురు కవిత కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. శాసనమండలిలోప్రసంగించిన కవిత..ఒక వ్యక్తిగా బయటకు వెళు ్తన్నా..శక్తిగా తిరిగి చట్టసభల్లో అడుగు పెడతానంటూ శపథం చేసి వెళ్లారు. అసెంబ్లీ ముందున్న గన్ పార్క్‌లో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి.. కొత్త రాజకీయ పార్టీఏర్పాటు చేస్తానని ఆమె ప్రకటించారు.మరోవైపు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన పార్టీ ద్వారానే పోటీ చేస్తామని కవిత చెబుతూ వస్తున్నారు. తాను పెట్టబోయే పార్టీలో యువతకు, మహిళలకు పెద్దపీట వేస్తానని కవిత ప్రకటించారు. రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలస్యం అవుతుండటంతో..ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నారు కవిత.బీఆర్ఎస్‌ను వీడిన తర్వాత తెలంగాణ జాగృతి జనం బాటకార్యక్రమం పేరుతో జిల్లాల పర్యటన చేస్తున్నారమె. మాజీ సీఎం జయలలితను గుర్తు చేసేలా..ఏకంగా కట్టు, బొట్టు అంతా లుక్‌నే మార్చేసి..జిల్లాల టూర్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ టార్గెట్ చేస్తూ కవిత ముందుకెళ్తున్నారు.ఇక ఇప్పుడు సొంత రాజకీయ పార్టీపై కవిత కసరత్తును వేగవంతం చేశారు. మెజార్టీ నేతలు తెలంగాణ జాగృతి సంస్థను రాజకీయ పార్టీగా మార్చాలని అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.మరికొందరు కొత్తగా ఏర్పాటు చేయబోయే పార్టీలో టీఆర్ఎస్ వచ్చేలా చూడాలని కవితను కోరినట్లు సమాచారం. కేసీఆర్ స్థాపించిన టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారిన నేపథ్యంలో..పాత టీఆర్ఎస్‌ను కొత్త పార్టీలో ఉండేలాచూడాలని సూచించారట. అందరి అభిప్రాయాలు తీసుకున్న కవిత..మార్చిలోనే

కొత్త రాజకీయపార్టీని ప్రకటించనున్నట్లు జాగృతి వర్గాల టాక్.ఇప్పటికే జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో మెజార్టీజిల్లాలను చుట్టేసిన కవిత.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని భావిస్తున్నారట. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెలాఖరులో మంచిర్యాలలో పెద్దఎత్తున జనం బాట ముగింపు సభను నిర్వహించాలని కవితనిర్ణయించారు.మంచిర్యాల సభలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించాలా, లేదంటే హైదరాబాద్‌లోని అమరవీరుల స్థూపం దగ్గర ప్రకటించాలా అన్నదానిపై ఇంకా ఓ డెసిషన్‌కు రాలేదంటున్నారు. మార్చిలో రాజకీయ పార్టీప్రకటించిన వెంటనే తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని కవిత భావిస్తున్నారట. పాదయాత్రపై ఇప్పటికే కుటుంబ సభ్యులు, జాగృతి ముఖ్యనేతలతో చర్చించారట .పాదయాత్ర రూట్ మ్యాప్‌ను కూడా సిద్ధంచేసుకుంటున్నారని టాక్ వినిపిస్తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాలు కవర్ అయ్యేలా మెజార్టీ అసెంబ్లీ స్థానాలను చుట్టివచ్చేలా పాదయాత్ర రోడ్ మ్యాప్‌ను రెడీ చేస్తున్నారట కవిత. దీంతో కవిత రాజకీయ పార్టీపై పొలిటికల్‌సర్కిల్స్‌లోనే కాదు సామాన్య జనంలోనూ సర్వత్రా ఆసక్తి నెలకొంది

బీసీలకు మొండి చేయి...?

హైదరాబాద్, జనవరి 30, పెన్ పవర్:

సుదీర్ఘ కాలంగా బీసీలు తమ జనాభా ప్రకారం వారికి రిజర్వేషన్ అమలు కావాలని ఎదురుచూస్తున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి రంగాల్లో బీసీల హక్కు సాకారం చేసుకునేందుకు ఎన్నో ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీతో బీసీ వర్గాల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర జనాభాలో పెద్ద వాటా ఉన్న బీసీ వర్గాలకు రాజకీయంగా, పరి పాలనాపరంగా తగినప్రాతినిధ్యం కల్పిస్తామని అధికార పక్షం హామీ ఇచ్చింది.కానీ ఆ హామీ చట్టబద్ధ హక్కుగా మారకుండానే స్థానిక ఎన్నికల నిర్వహణ కొనసాగుతుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసి,ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు జరుగనుండగా.. రిజర్వేషన్ల విషయంలో అదే వైఖరి కనిపిం చడంతో బీసీల హృదయాలను కలచివేస్తున్నది. ఎన్నికల వేళ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటూ ఆశలు రేపిన ప్రభుత్వంఈ డిమాండ్‌ను అమలుచేసే దశలో స్పష్టత చూపించలేకపోతోందని బీసీలు ఆగ్రహిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ విషయంలో ప్రతిపక్షాలు సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో బాధ్యతాయుతంగావ్యవహరించడం లేదని బీసీ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ హామీ కేవలం గాలిమాటేనా అని బీసీలు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికల ముందు బీసీలకు 42 శాతంరిజర్వేషన్లు అమలుచేస్తామని ఘనంగా ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు..అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని చట్టబద్ధంగా అమలు చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు బీసీల నుంచి వెల్లువెత్తుతున్నాయి.రాజ్యాంగ సవరణలు, జనాభా లెక్కలు, న్యాయపరమైన అడ్డంకుల పేరుతో నిర్ణయాలు వాయిదా పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేదిసాధారణమైన హామీ కాదు. బీసీల సామాజిక న్యాయానికి అది నిదర్శనం. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిన పాలక పక్షం, ఆ హామీని చట్టంగా మార్చకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. కోర్టు ఆదేశాలు, జనగణన పేరుతో కాలయాపన జరిగింది. చివరకు పార్టీపరంగా టికెట్లు ఇచ్చి బీసీలకు న్యాయం చేసినట్టుగా ప్రచారం చేసింది. కానీ ఈ పరిస్థితి బీసీ వర్గాల్లో అనేక ప్రశ్నలకు దారితీసింది. నిజంగా బీసీలకురిజర్వేషన్ ఇవ్వాలన్న రాజకీయ సంకల్పం ఉందా?, లేక ఎన్నికల ఒత్తిడిలో తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టుకున్నారా? అని అనుమానాలు వ్యక్తమయ్యాయి.పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు కొన్ని స్థానాలుదక్కినప్పటికీ అవి రిజర్వేషన్ వల్ల వచ్చిన హక్కులా?, లేక పార్టీ టికెట్ల పంపిణీలో భాగమా? అన్నది ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ అమలు కాకుండానే పంచాయతీ ఎన్నికలుజరగడం రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. పార్టీల అంతర్గత కేటాయింపుల పేరుతో కొంతమంది బీసీలకు అవకాశాలు ఇచ్చినా.. అది భరోసా కల్పించే రిజర్వేషన్ కాదని బీసీ నేతలు అంటున్నారు.పంచాయతీ ఎన్నికలతో బీసీ రిజర్వేషన్ అంశంపై ఆయా వర్గాల్లో పాలక, ప్రతిపక్షాల వైఖరిపై స్పష్టత వచ్చింది. రాజ్యాంగం, జనాభా లెక్కలు, న్యాయపరమైన చిక్కులు అంటూ కారణాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారన్న విమర్శలుబీసీ వర్గాల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తున్నాయి. బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్ ఇవ్వకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శకులు అంటున్నారు.రిజర్వేషన్ అవసరమనినినాదాలు చేసి.. అమలు చేయాల్సిన సమయంలో మాత్రం చేతులెత్తేస్తారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు లభించిన సీట్లు పార్టీ దయతో వచ్చిన అవకాశాలుగానే మిగిలాయని, దీంతో సరైనరాజకీయ ప్రాతినిధ్యం లభించలేదన్న అభిప్రాయం బలపడుతోంది. చట్టం ఉంటేనే ప్రతి బీసీకి సమాన అవకాశం లభిస్తుందని, లేకపోతే ఇది కేవలం ఎన్నికల హామీగా మిగిలిపోతుందని బీసీలు విమర్శిస్తున్నారు.42శాతం రిజర్వేషన్ హామీ అమలవుతుందా? లేక మళ్లీ ఎన్నికల దాకా నినాదాలకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్న బీసీ సమాజాన్ని వేధిస్తోంది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీసీలకు రిజర్వేషన్ అమలుచేయడంలో అన్యాయం జరిగిందని స్పష్టమవు తుంది. ఇప్పటివరకు ఓర్పుతో ఎదురుచూసిన బీసీ సంఘాలు, మేధావులు, యువత ఇప్పుడు చట్టబద్ధ రిజర్వేషన్ తప్ప మరే ప్రత్యామ్నాయం లేదనిఅభిప్రాయపడుతున్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలయ్యే వరకు బీసీల రాజకీయ పోరాటం ముగియదన్న సంకేతాలు ఇస్తున్నారు.హామీలతో కాదు, చట్టంతోనే న్యాయం కావాలన్న డిమాండ్ మరింత బలపడుతోంది.పాలక, ప్రతిపక్షాలపై బీసీ వర్గాల్లో నెలకొన్న అసంతృప్తి ఉద్యమంగా మారుతుందా.. లేక ఎన్నికల్లో రాజకీయ తీర్పుగా బయటపడుతుందా అని ప్రభుత్వంలోనూ ఆందోళన కలిగిస్తున్నది. 42 శాతం రిజర్వేషన్ కేవలంనినాదం కాదని, బీసీల రాజకీయ భవిష్యత్‌కు కీలక మలుపు అని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ అమలుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఈ అంశంలో ఇంకాజాప్యం జరిగితే భవిష్యత్ ఎన్నికల్లో బీసీల తీర్పు రాజకీయ చరిత్రను మార్చే అవకాశముందని విశ్లేషకులు అంటున్నారు.తాజాగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలటీలకు ఎన్నిలక నోటిఫికేషన్ విడుదల అయింది.నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. కానీ ఇప్పటికీ బీసీల 42 శాతం రిజర్వేషన్‌పై చట్టపరమైన స్పష్టత లేదు. పంచాయతీ ఎన్నికల్లో చేసినట్లే మళ్లీ పార్టీపరమైన సర్దుబాట్లతో బీసీలకు న్యాయం చేసినట్టుచూపించాలని ప్రభుత్వం ప్రయత్ని స్తున్నదని బీసీలు ఆరోపిస్తున్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో పాలక, ప్రతిపక్షాలు ద్వంద్వ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శిస్తున్నారు.ఒకవైపు బీసీలే సామాజిక వెన్నెముకఅంటూనే మరోవైపు వారి రాజకీయ హక్కులను చట్టంగా మార్చడంలో వెనుకడుగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా బీసీల మద్దతు పొందుతూనే వారికి హక్కులు కల్పించేందుకు భయపడుతున్నారని విమర్శిస్తున్నారు. ఈ వైఖరే పాలక, ప్రతిపక్షాలపై ఉన్న నమ్మకాన్ని చెరిపేస్తోందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. బీసీ రిజర్వేషన్ అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే చట్టపరమైనమార్గాలు కనుగొనడం అసాధ్యం కాదని వాదిస్తున్నాయి.ఇతర రాష్ట్రాల్లో బీసీ రిజర్వేషన్ అమలు సాధ్యమైనప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కావడం లేదన్న ప్రశ్న బలంగా వినిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలమాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లోనూ బీసీలకు తీవ్ర నిరాశే ఎదురైందని ఆ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న వైఖరి మరోసారి బీసీలకు చేస్తున్న ద్రోహమేనని మండిపడుతున్నాయి. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తూ, అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెడుతున్నారన్న విమర్శలు రాజకీయంగా వేడెక్కుతున్నాయి.

కమలం గేర్ మార్పు..

హైదరాబాద్, జనవరి 30, పెన్ పవర్:
తెలంగాణ రాజకీయ యవనికపై ప్రత్యామ్నాయం మేమే అని విర్రవీగిన భారతీయ జనతా పార్టీకి, గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ఒక గట్టి హెచ్చరికను పంపాయి. ఒకప్పుడు రాష్ట్రంలో నెంబర్ 2 స్థానానికిఎదిగామని, ఇక అధికారమే తరువాయి అని సంబరపడ్డ కమలదళానికి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఇంకా అట్టడుగునే ఉందన్న చేదు నిజం బోధపడింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు జరగబోతున్న మున్సిపల్ఎన్నికలను బీజేపీ తన ఉనికి చాటుకునేందుకు, పోగొట్టుకున్న ప్రతిష్టను తిరిగి పొందేందుకు ఒక అగ్నిపరీక్షగా భావిస్తోంది.ఫిబ్రవరి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలఓకోసం బీజేపీ అధిష్టానం ఈసారి వ్యూహాన్నిమార్చింది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర నాయకత్వానికి వదిలేసే కేంద్ర పెద్దలు, ఈసారి నేరుగా రంగంలోకి దిగుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన కొత్త టీమ్‌తో ఇప్పటికే కసరత్తుప్రారంభించగా, చాణక్యుడిగా పేరుగాంచిన అమిత్ షా స్వయంగా ప్రచార పర్వంలో పాల్గొంటుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.ఫిబ్రవరి 2, 3 తేదీల్లో మహబూబ్ నగర్ లేదా ఫిబ్రవరి 8, 9తేదీల్లో నిర్మల్ పట్టణాల్లో వీళ్ల భారీ బహిరంగ సభలకు ఏర్పాట్లు జరుగుతుండటం.. బీజేపీ ఈ ఎన్నికలను ఎంత సీరియస్‌గా తీసుకుందో అర్థం చేస్తోంది. మున్సిపాలిటీలపై జెండా ఎగురవేస్తే తప్ప, వచ్చే సాధారణఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదని ఢిల్లీ పెద్దలు డిసైడ్ అయ్యారు.బీజేపీ వెనుకబాటుకు ప్రధాన కారణం బయటి శత్రువుల కంటే ఇంట్లోని విభేదాలే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలో పాత
నాయకులకు, కొత్తగా చేరిన వలస నాయకులకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా స్థాయిలో గ్రూపు రాజకీయాలు



పార్టీ కేడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. ఉమ్మడి నల్గొండ వంటి జిల్లాల్లోఇటీవల జరిగిన దాడులు, గొడవలే ఇందుకు నిదర్శనం. అధిష్టానం ఎన్ని ఆదేశాలిచ్చినా, రాష్ట్ర నేతల మధ్య సఖ్యత లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు నిరాశలో ఉన్నారు. ఈ చలనం లేని కేడర్‌లో జోష్ నింపేందుకేఅమిత్ షా వంటి అగ్రనేతలను బరిలోకి దించుతున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రాకపోవడం, పార్లమెంటు ఎన్నికల్లో ఓట్ల శాతం పెరిగినా అది విజయతీరాలకు చేర్చకపోవడంతో పార్టీ మేధోమథనంలో పడింది.మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఈసారి 'అర్బన్ ఓటర్ల'పైనే ఆశలు పెట్టుకుంది. కేంద్ర పథకాల లబ్ధిదారులు, మధ్యతరగతి ప్రజలే తమను గట్టెక్కిస్తారని నమ్ముతోంది. నితిన్ నబీన్ నాయకత్వంలోమహారాష్ట్ర మంత్రి ఆశిష్ షెలార్ వంటి నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించడం ద్వారా ఇతర రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలను ఇక్కడ అమలు చేయబోతున్నారు.అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు,బీఆర్ఎస్ తిరిగి పుంజుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల మధ్య బీజేపీ తన స్థానాన్ని ఎలా కాపాడుకుంటుందనేది ప్రశ్నార్థకం. కేవలం అగ్రనేతల పర్యటనలతోనే ఓట్లు రాలతాయా? లేక గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికినాయకత్వం ఐక్యంగా ముందుకు సాగుతుందా? అనేది వేచి చూడాలి.బీజేపీకి ఈ మున్సిపల్ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కాదు.. తెలంగాణలో ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తునునిర్ణయించే కీలక మలుపు. అమిత్ షా రాకతో పార్టీలో జోష్ రావచ్చు కానీ, ఆ జోష్ ఓట్ల రూపంలోకి మారాలంటే స్థానిక నేతలు అహంభావాన్ని వీడి ఐక్యంగా పనిచేయాల్సి ఉంటుంది. లేదంటే నెంబర్ 2 కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

కాంగ్రెస్ సెల్ఫ్ గోల్...

హైదరాబాద్, జనవరి 30, పెన్ పవర్:
మున్సిపల్ ఎన్నికల వేళ సిట్ అధికారులు బీఆర్ఎస్ కు సానుభూతి తెచ్చేందుకు నడుంకట్టుకున్నట్లు కనిపిస్తుంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కు నోటీసులు ఇచ్చివిచారణకు పిలవడం మున్సిపల్ ఎన్నికలపై ప్రభావం చూపుతుందనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. కాంగ్రెస్ శ్రేణులు ఇదే భయపడుతున్నాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు చోటు చేసుకున్న కీలక పరిణామం మున్సిపల్ ఎన్నికల్లో కారు పార్టీకి కలసి వచ్చేటట్లు కనిపిస్తుంది. అరవై ఐదేళ్ల వయసులో పెద్దాయనను విచారణ పేరుతో నోటీసులు ఇవ్వడం పై కాంగ్రెస్ నేతలే లోలోపల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో చేయాల్సిన పని ఇదా? అంటూ కొందరయితే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు.ఎంత లేదన్నా కేసీఆర్ తెలంగాణ సాధించిన వ్యక్తిగా నేటికీ ప్రజల్లో చెరగని ముద్ర ఉంది. ఆయన అవినీతి, ఆరోపణలు గత రెండేళ్ల నుంచి ఏ మాత్రం నిరూపించలేక కాంగ్రెస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఏంటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురవుతుందంటున్నారు. కాళేశ్వరంలో కోట్ల రూపాయలు అవినీతిజరిగిందని ఆరోపణలు చేసి.. కొన్ని నెలల పాటు కమిషన్ తో కాలం గడిపి, తర్వాత నింపాదిగా సీబీఐకి ఇస్తున్నట్లు చెప్పేయడంతోనే అందులో డొల్లతనం బయటపడిందన్న కామెంట్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. కాళేశ్వరం అవినీతిని తేల్చలేని వాళ్లు ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో సాధించిందేమటన్న ప్రశ్నను బీజేపీ నేతలు కూడా ప్రశ్నిస్తున్నారు.ఒకరకంగా పెద్దాయనను ఇలా విచారణ పేరిట వేధించడం వల్ల కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టమే కాని, ఎటువంటి ప్రయోజనాలు ఉండవన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. రేపు ఆయన ఇంట్లో విచారణ చేసినా బీఆర్ఎస్ నేతలు చేసే హడావిడితో కొంత సానుభూతి ఆ పార్టీకి వస్తుందని, మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇది అవసరమా? అన్న ప్రశ్న కూడా కాంగ్రెస్ పార్టీ ద్వితీయ శ్రేణి నేతల నుంచి వినిపిస్తుంది. బీజేపీ నేతలు చెబుతున్నట్లు ఇందులో సిట్ అధికారుల కానీ, ప్రభుత్వం కానీ సాధించిందేమీ ఉండదని, కాలయాపన కోసమే ఇటువంటి నోటీసులు ఇవ్వడం, పార్టీకి

నష్టంకొని తెచ్చుకోవడం ఎందుకని ప్రశనిస్తున్నారు. మొత్తం మీద కేసీఆర్ ను రేపు విచారించినా తేలేది ఏముంటుందో తెలియదు కానీ.. మున్సిపల్ ఎన్నికల్లో దెబ్బ తగలడం ఖాయమన్న వ్యాఖ్యలు గాంధీ భవన్ నుంచే వినిపిస్తుండటం విశేషం.

మున్సిపల్స్.. ఎవరి లెక్కలు వారివి

కరీంనగర్, జనవరి 30, పెన్ పవర్:
తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు ప్రభుత్వ పాలనకు రిఫరెండంగానే చూడాలి. ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాల్లో మున్సిపాలిటీలు, నగరాల్లో కార్పొరేషన్లకు ఎన్నికలు జరుగుతుండటంతో అసెంబ్లీ ఎన్నికలను తలపిస్తున్నాయి. నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమ యింది. అయితే ఎవరికి వారే గెలుపు పై ధీమాగా ఉన్నారు. పంచాయతీ ఎన్నికల తరహా మాత్రం కాదు. ఎందుకంటే పార్టీ సింబల్ మీద జరిగే ఎన్నికలు కావడంతో ఖచ్చితంగా పరిపాలన పై ప్రజా తీర్పు ఎలా ఉందన్నది స్పష్టంగా తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో గుర్తులుండవు కాబట్టి..ఎవరు గెలిచినా తమ వారిగా వారు చెప్పుకుంటారు.అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం ఈ మున్సిపల్ ఎన్నికలపై భారీ ఆశలు పెట్టుకుంది. పట్టణాల్లో పేదలతో పాటు తాము గత రెండేళ్ల నుంచి చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి తమను గట్టెక్కిస్తాయని నమ్ముతుంది. మరొకవైపు మరో మూడేళ్లు అధికారంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే ఉండటంతో తమ నగరాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ కే ఓటేయడమని ప్రజల ఆలోచన ఉంటుందని హస్తం పార్టీ నేతలు భావిస్తున్నారు. దీంతో పాటు క్యాడర్ కూడా గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తుందని, అలాగే పట్టణ ఓటర్లు విజ్ఞతతో ఓటేస్తారని, అందుకే కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు పై ధీమాగా ఉంది. తమ నాయకత్వాన్ని కూడా పకడ్బందీగా రంగంలోకి దించింది.ఇక బీఆర్ఎస్ నాయకత్వం కూడా మున్సిపల్ ఎన్నికల్లో తమను ప్రజలు ఆదరిస్తారని భావిస్తుంది.

పట్టణ ఓటర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారని, గత రెండేళ్లుగా ప్రభుత్వం వ్యవరిస్తున్న తీరుతో పాటు అవినీతి ఆరోపణలు, కుంభకోణాలు ప్రజల్లో పనిచేస్తాయని అంచనా వేస్తుంది. విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఎక్కువగా ఉండే పట్టణ ప్రాంతాల్లో తమకు తిరుగులేని ఆధిపత్యం దొరుకుతుందని భావిస్తుంది. మరొకవైపు పట్టణాల్లో తమకు తొలి నుంచి ఉన్న పట్టు ఖచ్చితంగా విజయావకాశాలను మెరుగు పరుస్తుందని చెబుతున్నారు. అయితే ఎలక్షనీరింగ్ చేయడమే ప్రధానమని, ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే అతి పెద్ద టాస్క్ అని కారు పార్టీ నేతలు ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు.బీజేపీ కూడా ఈ మున్సిపల్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకుంది. బీజేపీకి తొలి నుంచి పల్లెలకంటే పట్టణ ఓటర్ల మద్దతు ఎక్కువగా ఉంది.
గత పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది పార్లమెంటు నియోజకవర్గాల్లో గెలుపునకు కూడా ప్రధాన కారణం పట్టణ ఓటర్లేనని అంటున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ వెయ్యికి పైగా సర్పంచ్ పదవులను కైవసం చేసుకున్నామని, ఇక పట్టణాల్లో కమలం జోరును ఆపడం ఎవరి తరమూ కాదని ఆ పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు. కేంద్ర నాయకత్వం కూడా మున్సిపోల్స్ పై
దృష్టి పెట్టి రాష్ట్ర నాయకులను అప్రమత్తం చేసింది.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి

ఖమ్మం, జనవరి 30 పెన్ పవర్: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఖమ్మం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నవభారత నిర్మాణానికి గాంధీ మహాత్ముడి బోధనలే మార్గదర్శనీయమని, ఆయన చూపిన బాటలో నేటి యువత పయనించాలని డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణగౌడ్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి తెలిపారు.

వైరా మున్సిపాలిటీ ఎన్నికలు:
కాంగ్రెస్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు

వైరా, జనవరి 30పెన్ పవర్: ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ 13వ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థిగా వీరంశెట్టి సీతారాములు సతీమణి దుర్గాభవాని, 20వ వార్డు అభ్యర్థిగా పమ్మి పుష్పమ్మ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం, వార్డు అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని అభ్యర్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

సత్తుపల్లి, జనవరి 30పెన్ పవర్: సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, బీఆర్ఎస్ పార్టీ తరపున పలువురు అభ్యర్థులు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. 2వ వార్డు నుండి వీరపనేని రాధికా, 8వ వార్డు నుండి షేక్ చంద్ పాషా, 10వ వార్డు నుండి ఏర్పుల అనంద్, 14వ వార్డు నుండి గుండ్ర రాఘవేంద్ర, మరియు 15వ వార్డు నుండి అక్షింతల వెంకటరామయ్య (చంటి) తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి స్థానిక పార్టీ శ్రేణుల సమక్షంలో అందజేశారు.

ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో

మధిర, జనవరి 30పెన్ పవర్: భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. ఈ నిరసన కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. మండల అధ్యక్షుడు దొడ్డ రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ రెడ్డి ఇలాంటి కుతంత్రాలకు తెరలేపారని, రాజకీయ కక్షలో భాగంగానే కేసీఆర్ ను వేధించేందుకు సిట్ నోటీసులు ఇచ్చారని ధ్వజమెత్తారు. తెలంగాణ జాతిపితను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

బీజేపీ అభ్యర్థుల నామినేషన్ దాఖలు

పాలేరు, జనవరి 30పెన్ పవర్: ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం 6వ డివిజన్ నుంచి హలవాత్ లక్ష్మీ, 14వ డివిజన్ నుంచి మాదారపు వెంకటేశ్వర్లు, 15వ డివిజన్ నుంచి జి. రజిత, 16వ వార్డు నుంచి కోతమర్తి వినయ్ తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, డివిజన్ ఇంచార్జీలు చావా కిరణ్, పగర్తి సుధాకర్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహా జాతర లో సింగరేణి రెస్క్యూ సేవలు

ములుగు, జనవరి 30పెన్ పవర్: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, సింగరేణి రెస్క్యూ సిబ్బంది అద్భుతమైన సేవలు అందిస్తున్నారు. 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది గద్దెల ప్రాంగణంలో భక్తులు విసిరిన కొబ్బరి చిప్పలు, బెల్లం ఉండలు తగిలి గాయాలపాలైన వారికి, అలాగే అనారోగ్యంతో అస్వస్థతకు గురైన భక్తులకు సహాయక చర్యలు అందించి, వారిని ఆసుపత్రికి, అంబులెన్స్‌కు తరలిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సిబ్బంది నిరంతరం సేవలు అందిస్తున్నారు.

ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నివాళులు

వర్ధన్నపేట, జనవరి 30పెన్ పవర్: ఉమ్మడి వరంగల్ జిల్లా, వర్ధన్నపేటలో శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మున్సిపల్ ఎన్నికల కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు మరియు పార్టీ శ్రేణులతో కలిసి గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతిపిత గాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే నాగరాజు ఈ సందర్భంగా కోరారు.

గాంధీ 78వ వర్ధంతి: కాంగ్రెస్ ఘన నివాళులు

వరంగల్ ఈస్ట్, జనవరి 30పెన్ పవర్: జాతిపిత మహాత్మా గాంధీ గారి 78వ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు అయ్యూబ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయని రాజేందర్ రెడ్డితోపాటు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, అహింసతో దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చిన ఘనత గాంధీజీకే దక్కిందని అన్నారు.

చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన దామెర పోలీసులు

పరకాల, జనవరి 30పెన్ పవర్: పరకాల దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని కంఠాత్మకూర్ సమ్మక్క ? సారలమ్మ జాతరలో హసన్ పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన బండారి కిరణ్ కుమార్తె రష్మిక (2) తప్పిపోయింది. దామెర పోలీసులు బాలికను గుర్తించి, తల్లిదండ్రులకు సమాచారం అందించి క్షేమంగా అప్పగించారు. తమ పాపను సురక్షితంగా అప్పగించినందుకు తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

డోర్నకల్ పురపాలిక ఎన్నికల బరిలో
అనిల్ కాంగ్రెస్ నామినేషన్

డోర్నకల్, జనవరి 30పెన్ పవర్: డోర్నకల్ పురపాలిక ఎన్నికల వేడి రాజుకుంది. రాజకీయ పార్టీలు గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి. పదవ వార్డు అభ్యర్థిగా మల్లం అనిల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఎంపీటీసీగా ప్రజలకు సేవ చేసిన అనుభవం ఉందని, ఈసారి 10వ వార్డు అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు

షాపింగ్ మాల్‌లో చోరీకి యత్నం

ఆదిలాబాద్, జనవరి 30 పెన్ పవర్: ఆదిలాబాద్ నడిబొడ్డున ఉన్న వసుంధర షాపింగ్ మాల్‌లో రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. చెట్టుపైకి ఎక్కి పైకప్పు రేకులు తొలగించి లోపలికి చొరబడ్డారు. సీసీ కెమెరాల తీగలను తొలగించి క్యాష్ కౌంటర్లను వెతికారు. అయితే, ఎలాంటి నగదు చోరీకి గురికాలేదని మాల్ యాజమాన్యం తెలిపింది. వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి.సునీల్ కుమార్, ఎస్సై అశోక్, క్లూస్ టీం ఘటనాస్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. సమీపంలోని సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు.

జగదీష్ అగర్వాల్ 47వ డివిజన్ నుండి నామినేషన్ దాఖలు

బోథ్, జనవరి 30 పెన్ పవర్: తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫౌండర్, బిజెపి పార్టీ మాజీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, హిందూ ధర్మ వేదిక కర్తా జగదీష్ అగర్వాల్ ఆదిలాబాద్ లోని 47వ వార్డు నుండి నామినేషన్ దాఖలు చేశారు. గతంలో రిజర్వేషన్ల కారణంగా పోటీ చేయలేకపోయిన ఆయన, ఈసారి జనరల్ స్థానం ఉండటంతో పోటీకి సిద్ధమయ్యారు. హిందూ ధర్మ వేదిక మద్దతుతో గెలుపొందాలని ఆయన కోరారు.

బీజేపీలో చేరిన హిందూ వాహిని నాయకుడు హరీష్

నిర్మల్, జనవరి 30 పెన్ పవర్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడకు చెందిన హిందూ వాహిని నాయకుడు కందుల హరీష్, తన అనుచరులతో కలిసి శుక్రవారం బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. వీరితో పాటు సుమారు 200 మంది యువకులు, మహిళలు కూడా కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వపురం లక్ష్మీ నర్సయ్య, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికల జోష్

ముధోల్, జనవరి 30 పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. నిర్మల్ పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మొహమ్మద్ నిజాం, మొహమ్మద్ అజారుద్దీన్, షేక్ ఫిరోజ్, రాథోడ్ అంబాజీ, అబ్దుల్ షైజ్ లు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, మాజీ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చేరికలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ముక్తా సాల్వే 185వ జయంతి:

యువత ఆదర్శంగా తీసుకోవాలి

ఖానాపూర్, జనవరి 30 పెన్ పవర్: నార్నూర్ మండలం తాడిహత్నూర్ గ్రామంలో ముక్తా సాల్వే 185వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా, గ్రామ సర్పంచ్ రాథోడ్ దిలీప్ హరినాయక్ మాట్లాడుతూ, ముక్తా సాల్వేను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాథోడ్ జనా బాయి, వాఘమరే వామన్, సూర్యావంశీ వైజనాథ్, ఫడ్ రవీందర్, మనే సంతోషం, ఫడ్ విష్ణు, ఈరలే గోపాల్, జాధవ్ బాలరాజ్, శేషంక్, అరవింద్ కల్వలే, యూత్ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై కేసు నమోదు

హుజూరాబాద్, జనవరి 30 పెన్ పవర్: వీణవంక సమ్మక్క-సారలక్క జాతర నిర్వహణపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి, ఆయన ప్రత్యర్థి వర్గానికి మధ్య వివాదం తీవ్రమైంది. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలపై హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై హుజురాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయనను హైదరాబాద్‌లో అరెస్టు చేసి హుజూరాబాద్‌కు తరలించి రిమాండ్‌కు తరలించే అవకాశాలున్నట్లు సమాచారం. గతంలో కౌశిక్ రెడ్డి ప్రభుత్వ పరంగా జాతర నిర్వహణకు ఉత్తర్వులు తెచ్చినప్పటికీ, స్థలం తమదని వాదించిన ఉదయానంద రెడ్డి కుటుంబం హైకోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పుతో ఉదయానంద రెడ్డి ఆధ్వర్యంలోనే జాతర కొనసాగుతోంది.

అలుగునూర్ అభివృద్ధి బీఆర్ఎస్ తోనే:

మాజీ ఎంపీ వినోద్ కుమార్

కరీంనగర్, జనవరి 30(పెన్ పవర్: కరీంనగర్ జిల్లాలోని అలుగునూర్ 8వ డివిజన్ అభివృద్ధి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని, గత రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎటువంటి అభివృద్ధి చేయలేదని మాజీ ఎంపీ వినోద్ కుమార్ అన్నారు. అలుగునూర్ బీఆర్ఎస్ అభ్యర్థి కాల్వ మల్లేశం నామినేషన్ సందర్భంగా జరిగిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నది సీఎం కేసీఆర్ అని, అలుగునూర్ అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

మున్సిపల్ ఎన్నికల వేళ రూ.20 లక్షల నగదు స్వాధీనం

సిరిసిల్ల, జనవరి 30 పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికల వేళ రూ. 20 లక్షల నగదు పట్టుబడింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఎస్‌టీ బృందం వాహనాల తనిఖీలు చేసింది. ఈ తనిఖీల్లో ఓ కారులో రూ. 20 లక్షల నగదు పట్టుబడింది. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అధికారులు సీజ్ చేశారు. నగదు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనేది తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మానకొండూరు, జనవరి 30 పెన్ పవర్: జమ్మికుంట పట్టణ శివారులోని కాకతీయ డిజి స్కూల్ వెనుక వాగు ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం మేకలను మేపుకుంటూ వెళ్లిన ఎండీ సల్మాన్ ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మృతిచెంది కొన్ని రోజులు అయి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, మృతుడి వివరాలను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సానిటరీ ఇన్స్పెక్టర్ పర్ల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

సమ్మకను దర్శించుకున్న ఎమ్మెల్యే

చొప్పదండి, జనవరి 30 పెన్ పవర్: శుక్రవారం, మానకొండూరు శాసనసభ్యులు మరియు టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్పర్సన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో జరుగుతున్న సమ్మక్క-సారలమ్మ జాతరలకు హాజరై దైవ దర్శనం చేసుకోనున్నారు. ఆయన గన్నేరువరం మండలంలో, తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి, నల్లగొండ గ్రామాల్లో జరిగే జాతరల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం మానకొండూరు మండలంలోని కొండపలకల గ్రామం, శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతరల్లో కూడా ఆయన పాల్గొంటారని సమాచారం.

లెప్రసీపై అవగాహన: అపోహలు తొలగించి, సమాజంలో భాగస్వామ్యం

రాజేంద్రనగర్, జనవరి 30 పెన్ పవర్: రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ లోని మన్సూరాబాద్ యూపీఎస్సీ పరిధిలో లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఒక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లెప్రసీపై అవగాహన ర్యాలీ నిర్వహించి, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు ముఖ్య అతిథిగా హాజరై, లెప్రసీ అంటువ్యాధి కాదని, ప్రారంభ దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. లెప్రసీ బాధితుల పట్ల వివక్ష చూపకుండా, వారిని గౌరవంగా సమాజంలో భాగంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

జంపింగ్ జంపాంగ్ లు

కరీంనగర్, జనవరి 30, పెన్ పవర్: ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు. తెలంగాణ పురపాలక ఎన్నికల సమయంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

ఈటెల కేసీఆర్ కు దగ్గరవుతున్నారా

హైదరాబాద్, జనవరి 30, పెన్ పవర్: తెలంగాణ రాజకీయాల్లో ఈటల రాజేందర్ ఒక ప్రత్యేకమైన శైలి కలిగిన నేత. ఉద్యమ కాలం నుండి కేసీఆర్ వెన్నంటి ఉండి, ఆ తర్వాత అత్యంత నాటకీయ పరిణామాల మధ్య బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) నుండి బయటకు వచ్చి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన తర్వాత కూడా ఆయన ప్రతి అడుగు ఆసక్తికరంగానే ఉంటోంది. తాజాగా నేరేడ్‌మెట్ అభివృద్ధి పనుల వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.ఈటల రాజేందర్ దాదాపు రెండు దశాబ్దాల పాటు కేసీఆర్ నాయకత్వంలో పనిచేశారు. రాజకీయాల్లో 'బాస్' అనే పదం ఒక నేత పట్ల ఉండే విధేయతకు గుర్తు. బీజేపీలో చేరిన తర్వాత కూడా కేసీఆర్‌ను 'బాస్' అని సంబోధించడం అనేది ఈటల మనసులో ఇంకా ఆ పాత జ్ఞాపకాలు ఉన్నాయని సూచిస్తోందా? లేదా బహిరంగ సభల్లో ప్రసంగించేటప్పుడు యాదృచ్ఛికంగా వచ్చిన మాటనా అనేది చర్చనీయం. అయితే, ఆయన మాట విన్న వెంటనే సభలో 'జై కేసీఆర్' నినాదాలు రావడం గమనార్హం. ఆయన మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళ్తారా అనే ప్రచారమూ సాగుతోంది.మల్కాజిగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గ పరిధిలోని మెజారిటీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంది. ఎంపీగా గెలిచిన ఈటల, ఇప్పుడు కేసీఆర్ పట్ల సానుకూల వ్యాఖ్యలు చేయడం ద్వారా బీఆర్ఎస్ క్యాడర్‌ను, ఓటర్లను తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారా? అనే అనుమానాలు రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటంలో విపక్షాలన్నీ ఏకం కావాలనే సంకేతం కూడా ఇందులో ఉండవచ్చు.నాకు కులం, మతం లేదు.. ప్రజలే నా బలం" అని ఈటల

పేర్కొనడం ద్వారా తాను ఏ పార్టీలో ఉన్నా తనకంటూ ఒక సొంత ఇమేజ్ ఉందని ఆయన చాటిచెప్పారు. తన తల్లిదండ్రుల వారసత్వంతో కాకుండా సొంతంగా ఎదిగానని చెప్పడం ద్వారా అటు కేసీఆర్ కుటుంబ పాలనను, ఇటు వారసత్వ రాజకీయాలను ఆయన పరోక్షంగా విమర్శిస్తూనే, మరోవైపు కేసీఆర్ మార్కు రాజకీయాలను గౌరవిస్తున్నట్లు కనిపిస్తోంది.రాజకీయ వ్యాఖ్యలు పక్కన పెడితే, నేరేడ్‌మెట్ ఆర్‌యూబీ పనుల కోసం రూ. 80 కోట్లు మంజూరు చేయించడం ఈటల పనితీరుకు నిదర్శనం. ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్న మల్కాజిగిరి ప్రజలకు ఇది పెద్ద ఉపశమనం. కేంద్రం నుండి నిధులు రాబట్టడంలో తాను సఫలమయ్యానని నిరూపించుకోవడం ద్వారా తన పదవికి న్యాయం చేస్తున్నానని ఆయన చాటుకున్నారు.ఈటల రాజేందర్ వ్యాఖ్యలు బీజేపీలో కలకలం రేపవచ్చు, కానీ క్షేత్రస్థాయిలో ఆయన తన పట్టును నిలుపుకోవడానికి అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. "బాస్" వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

పొత్తుల లెక్కలు తేలెదెలా...

ఖమ్మం, జనవరి 30, పెన్ పవర్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగిపోగా, ముఖ్యంగా అధికార కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితులకు, ఇప్పటికి సమీకరణాల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీ, తన మిత్రపక్షాలైన వామపక్షాలను కలుపుకుపోవడంలో ఎదుర్కొంటున్న సవాళ్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ప్రస్తుతం పొత్తుల చర్చల్లో కొత్తగూడెం మున్సిపాలిటీ అత్యంత కీలకంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గట్టి పట్టున్న సిపిఐ కొత్తగూడెంలో తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం 60 డివిజన్లలో తమకు కనీసం 30 స్థానాలు కేటాయించాలని ఆ పార్టీ పట్టుబడుతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి 17 స్థానాలకు మించి ఇవ్వలేమని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. ఈ 13 స్థానాల తేడా ఇప్పుడు రెండు పార్టీల మధ్య చిచ్చు పెట్టింది. ఒకవేళ కాంగ్రెస్ తన పట్టు సడలించకపోతే, ఒంటరిగా బరిలోకి దిగడమే కాకుండా, తెలుగుదేశం వంటి ఇతర పార్టీలతో కలిసి వెళ్లేందుకు కూడా సిపిఐ సిద్ధమవుతోంది. ఇదే గనుక జరిగితే ఖమ్మం, నల్గొండ, వరంగల్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ ఓట్లకు గండి పడే ప్రమాదం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం.మరోవైపు సిపిఎం తీరు ఆసక్తికరంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్న ఈ పార్టీ, మున్సిపల్ ఎన్నికల్లో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో ఉంది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల సమయంలో కొన్ని చోట్ల బిఆర్ఎస్, సిపిఎం నేతల మధ్య అవగాహన కుదిరినట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఇదే ఫార్ములానుఅమలు చేసే యోచనలో రెండు పార్టీలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉండాలంటే కాంగ్రెసేతర పార్టీలన్నీ ఏకం కావాలనేది సిపిఎం అంతర్గత వ్యూహంగా కనిపిస్తోంది.ఈ ఎన్నికల ప్రత్యేకతఏమిటంటే, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రకమైన పొత్తు ఉండకపోవచ్చు. స్థానిక బలాబలాలు, నాయకుల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఆధారంగా పొత్తులు మారే అవకాశం ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల కాంగ్రెస్‌ను కాదని, రెండు కమ్యూనిస్టు పార్టీలు జతకట్టవచ్చు. నల్గొండ, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొన్ని పట్టణాల్లో బిఆర్ఎస్, సిపిఎం మధ్య లోపాయికారీ ఒప్పందాలుజరిగే సూచనలు కనిపిస్తున్నాయి.వామపక్షాలు విడివిడిగా పోటీ చేస్తే అది పరోక్షంగా అధికార కాంగ్రెస్‌కు చేటు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో కమ్యూనిస్టులకు కేడర్ ఓటు బ్యాంక్ బలంగా ఉంది.పొత్తులు కుదరకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు, మిత్రపక్షాల ఓట్లు కూడా చీలిపోయి ప్రతిపక్ష బిఆర్ఎస్ లేదా బిజెపికి లాభం చేకూరే అవకాశం ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి ఇది కేవలం మున్సిపల్ ఎన్నిక మాత్రమే

కాదు, ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా మారుతుంది. అందుకే చిన్న పార్టీలను కూడా కలుపుకుపోవాల్సిన అవసరం ఆ పార్టీకి ఉంది. కానీ, సీట్ల సర్దుబాటులో ఇచ్చిపుచ్చుకునే ధోరణి లేకపోతే పొత్తులు పొడవటంకష్టమే.మొత్తానికి తెలంగాణ మున్సిపల్ ఎన్నికలు పొత్తుల గందరగోళం మధ్యే మొదలయ్యాయి. కొత్తగూడెం పీటముడి వీడితేనే కాంగ్రెస్-సిపిఐ బంధంపై స్పష్టత వస్తుంది. సిపిఎం ఏ అడుగు వేస్తుందనేది బిఆర్ఎస్‌వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. రానున్న రెండు మూడు రోజుల్లో అభ్యర్థుల ఖరారు, బి-ఫామ్ ల పంపిణీ నాటికి ఈ రాజకీయ గందరగోళానికి ఒక తెర పడే అవకాశం ఉంది.

విబి జి రామ్ జితో భారత్ వికసించేనా?

హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వాలు మారినప్పుడల్లా నాటి పాలకుల విధానాలను, సంక్షేమ పథకాలను, వాటి పేర్లను మార్చడం పాలకుల రాజకీయ ఎత్తుగడలో భాగం, సహజం కూడా. అయితే మార్పు అనేది పాలకుల సర్వతోముఖాభివృద్ధికి కాకుండా ప్రజలకు కనీస జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా ఉండాలి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత పాలకులు రూపొందించిన అభివృద్ధి విధానాలను, సంక్షేమ పథకాలను లోప భూయిష్టమైనవిగా పేర్కొంటూ వాటిని ఆపివేయడం సర్వసాధారణమైన ప్రక్రియగా మారింది. గత ప్రభుత్వాలు ప్రారంభించి, పూర్తి కాని అభివృద్ధి పథకాల (నీటిపారుదల ప్రాజెక్టులు, విద్య, వైద్య తదితర రంగాల పనుల)ను యథాతథంగా కొనసాగిస్తే ఆ పేరుప్రతిష్ఠలు గత ప్రభుత్వానికి దక్కుతాయేమోననే అక్కసుతోనే నిలుపుదల చేయడం మూలంగా లక్షలాది కోట్ల ప్రజాధనం వృథా అవుతుంది. 2005 లో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం గ్రామాల నుండి పట్టణాలకి వలసలని నివారించడం, పేదరికాన్ని తగ్గించడం, మహిళా సాధికారతను సాధించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని పరిరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (కరువు పని, 100 రోజుల పని) చట్టం 2005ను ప్రముఖ ఆర్థికవేత్తలు, మేధావులు, పార్లమెంటు సభ్యులు, వివిధ కమిటీలతో అనేక మార్లు సమావేశాలు నిర్వహించి వారి సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతనే ఎంజిఎన్ఎఆర్ఇజిఎ చట్టరూపం దాల్చి రెండు దశాబ్దాలుగా (కొన్ని లోపాలు ఉన్నప్పటికీ) నిర్దేశించుకున్న లక్ష్యాల వైపు అడుగులు ముందుకు వేస్తున్నది. ఈ పథకం చట్ట రూపంలో ఉన్న కారణంగా ఉపాధి కూలీలకు అన్యాయం జరిగితే చట్టపరంగా న్యాయాన్ని పొందే అవకాశం, ఉపాధి (పని)ని హక్కుగా డిమాండ్ చేసే అవకాశం ఉండడం ఉపాధి కూలీలకు ప్రధాన బలాలైతే ప్రభుత్వం ఈ పథకాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి చట్టం రూపంలో హామీ పడి ఉంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డిఎ కూటమి ప్రభుత్వం 2025 లో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి జి రామ్ జి) మిషన్‌ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలలో భాగంగా తీసుకొచ్చామని చెబుతూనే గత ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలున్న కారణంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎంజిఎన్ఎఆర్ఇజిఎ 2005 చట్టం తూచా తప్పకుండా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉపాధి హామీని నిరాటంకంగా కొనసాగించాలి అని చెబుతోంది. కానీ విబి జి రామ్ జి 2025 మిషన్ అనేది ప్రభుత్వ ఇచ్ఛ ఉన్నంత వరకే కొనసాగుతుంది. వీటి మధ్యనున్న ఈ వ్యత్యాసాన్ని గమనించకపోతే రాబోయే రోజుల్లో ఉపాధి హామీ అనేది 'హక్కు'గా ఉండకుండా పోయే ప్రమాదముంది. నూతన పథకంలో '25 రోజుల పని దినాలను అదనంగా పెంచడం' జియో టాగింగ్ ఆధారంగా వేతనాల చెల్లింపులు తప్ప విబి జి రామ్ జి 2025 లక్ష్యాల్లో చెప్పుకోదగ్గ మార్పులేవీ లేవు. నూతన ఉపాధి పథకానికి కేటాయించే బడ్జెట్‌లో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 10% వాటాను భరించాల్సి ఉంటుంది. గత ఉపాధి హామీ పథకానికి కేంద్రం కేటాయించిన బడ్జెట్‌లో కూలీలు, సిబ్బంది వేతనాలకు 100%, సామాగ్రి కొనుగోళ్లకు వాటా 90%, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా 10శాతం వాటాలు మాత్రమే భరించాయి. ప్రస్తుతం దేశంలోని చాలా రాష్ట్రాలు ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్న సంక్షేమ పథకాలు కొనసాగించలేని పరిస్థితి ఉన్నది. దానికి తోడు నూతన ఉపాధి పథకంలో రాష్ట్రాల నెత్తిన మోపిన భారం కారణంగా ఒకవేళ ఆయా రాష్ట్రాలు ఆసక్తి చూపకపోయినా, రాష్ట్రాల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వాలు లేకపోయినా సదరు రాష్ట్రాలు వాటా ఇవ్వలేదనే నెపంతో ఆయా రాష్ట్రాలపై వ్యతిరేకతను కూడగట్టి తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి వచ్చే విధంగా కుట్రలు చేయడం వలన పథకం లక్ష్యాలు నెరవేరకుండా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే అవకాశం ఉంది. నూతన పథకంలో రెండవ ప్రధానమైన అంశం వర్షాకాలంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ఏర్పడుతుందనే కారణంతో 60 రోజుల పాటు ఉపాధి పథకాన్ని నిలిపివేయడం. దీని కారణంగా వ్యవసాయ కూలీల డిమాండ్ తగ్గి తక్కువ వేతనానికే పనికి వెళ్లాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు పోలేనటువంటి వారి జీవనోపాధి దెబ్బ తింటుంది. ఎనభై శాతం యాంత్రీకరణ జరిగిన వ్యవసాయ రంగంలో రెండు నెలల పాటు ఉపాధి పనులు నిలిపివేయడం ఉపాధి నిరోధక చర్యే అవుతుంది. నూతన ఉపాధి పథకంలో కేంద్ర నిర్ణయమే శిరోధార్యంగా ఉండే అవకాశం ఉంది. ఒకవేళ అదే జరిగితే నూతన ఉపాధి పథకం ఏ రాష్ట్రంలో జరగాలి, ఎటువంటి పనులు చేయాలనేది కేంద్రం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అప్పుడు రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గడమే కాక వికేంద్రీకరణ ఆదర్శం దెబ్బతిని రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించే ప్రమాదముంది. బాధ్యత, జవాబుదారీతనం పేరుతో రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపడం వలన ఉపాధి హామీ అసలు లక్ష్యం నెరవేరకుండా క్రమంగా పథకం ఉనికిని కోల్పోయే ప్రమాదముంది. ఏ పథకమైనా విజయవంతం కావాలంటే పాలకుల్లో దృఢ సంకల్పం, నిరంతర పర్యవేక్షణ, అధికారుల్లో చిత్తశుద్ధి ఉండాలి. అప్పుడే ఉపాధి పథక లక్ష్యాలైన స్థానిక సంస్థలు బలపడడం, ఉత్పాదక ఆస్తుల సృష్టి, ఆర్థిక అసమానతల తగ్గుదల, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ కొంత మేరకైనా సఫలీకృతమై సామాజిక, ఆర్థిక అంతరాల గోడల్ని బద్దలు కొట్టగలం. పాలకులు కూడా దేశాన్ని పట్టిపీడిస్తున్న పేదరికం, నిరుద్యోగం, డ్రగ్స్, ఉగ్రవాదం, అవినీతిలను ప్రధాన శత్రువులుగా భావించినప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుంది.

ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

విశాఖపట్టణం, జనవరి 30, పెన్ పవర్:

విశాఖలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమయింది. భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లు వాడలో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసి త్వరలో గూగుల్ సంస్థకు అప్పగించనున్నారు. దాదాపు రైతుల భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. సింహాచలం భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. బెంగళూరుకు చెందిన ఆర్ఎం జెడ్ కార్పొరేషన్ విశాఖలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఆ సంస్థ శంకుస్థాపనకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరిలోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు..ఆసియాలోని అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. కొద్ది నెలల కిందట ఏపీ ప్రభుత్వంతో గూగుల్ ఒప్పందం చేసుకుంది. అప్పటినుంచి రంగంలోకి దిగింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా భూముల సేకరణకు సంబంధించి వేగవంతం చేసింది. ఆనందపురం మండలం తర్లువాడ పరిసరాల్లో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసింది. త్వరలో ఏపీఐఐసీ ద్వారా గూగుల్ కు ఆ భూములను అప్పగించనుంది. 51 మంది రైతుల నుంచి సేకరించిన భూములకు గాను 49 మంది రైతుల ఖాతాల్లో పరిహారానికి గాను డబ్బులు జమ చేశారు. మిగతా ఇద్దరు రైతులకు కూడా జమ చేస్తామని విశాఖ జిల్లా కలెక్టర్ తెలిపారు.అయితే ఈ గూగుల్ డేటా సెంటర్కు నీరు చాలా అవసరం. జీవీఎంసీద్వారా నీటిని అందించే పనులపై అధికారులు దృష్టి సారించారు. మరోవైపు సింహాచలం భూముల కేటాయింపులకు సంబంధించి ఫైల్స్ ను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రక్రియ పూర్తయితే డేటా సెంటర్ ఏర్పాటుకు కీలక అడుగు పడినట్టే. మరోవైపు ఫిబ్రవరిలోనే డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా ఐటీ సంస్థలు పెద్ద ఎత్తున విశాఖకు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల దావోస్ పెట్టుబడుల సదస్సులో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ =వ్గీ సంస్థతో ఒప్పందాలు చేసుకున్న సంగతి తెలిసిందే. దాదాపు లక్ష కోట్ల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టనుంది సదరు సంస్థ. ఈ నేపథ్యంలో =వ్గీ ప్రతినిధులు విశాఖ తో పాటు విజయనగరంలో పర్యటించారు. ఐటీ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములను పరిశీలించారు.

అమరావతిలో మొదటి క్యాష్‌లెస్ టోల్ ప్లాజా

విజయవాడ, జనవరి 30, పెన్ పవర్:

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో తొలి టోల్‌గేట్ రెడీ అయింది. ఏపీ సచివాలయంకు వెళ్లే దారిలో వెంకటపాలెం గ్రామం వద్ద కొత్తగా నిర్మించిన విజయవాడ వెస్ట్ బైపాస్‌పై టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఇది దేశంలోనే మొట్టమొదటి క్యాష్ లెస్ టోల్ ప్లాజా అని ప్రచారంలో ఉంది. కేవలం డిజిటల్ పేమెంట్స్ లేదా ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే ఇక్కడ టోల్ ఫీజ్ వసూలు చేస్తారు. త్వరలోనే ఈ పద్ధతిని దేశంలోని అన్ని టోల్ ప్లాజాలలోనూ అమలు చేయబోతున్నారు. ప్రస్తుతానికి ఈ వెస్ట్ బైపాస్‌లో ఒకవైపు ట్రాఫిక్ పూర్తి స్థాయిలో మరోవైపు ట్రాఫిక్‌ను పాక్షికంగానూ వదులుతున్నారు. రెండు వైపులా బైపాస్ పూర్తిగా అందుబాటులోకి వచ్చాక అంటే మార్చి నెల టైమ్‌కి ఈ టోల్ ప్లాజాను మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర విభజన, అమరావతిలో రాజధాని ప్రకటన తరువాత విజయవాడ నగరం పైనుంచి వెళ్లే ట్రాఫిక్ విపరీతంగా పెగిరి పోయింది. దీన్ని డైవర్ట్ చేయడం కోసం చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాల కోసం కాజా టోల్ ప్లాజా దగ్గర నుంచి రాజధాని గ్రామాల మీదుగా గొల్లపూడి వరకూ 17.8 కిలోమీటర్లు కొత్త బైపాస్ వేశారు.

అక్కడి నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు వేరే మార్గంలో వెళ్ళిపోతాయి. అలాకాకుండా వైజాగ్ వైపు వెళ్లే వాహనాల కోసం అదే బైపాస్ మరో 30కిమీ వెళ్ళి చిన్న అవుట్ పల్లి (గన్నవరం ఎయిర్ పోర్ట్) వద్ద హౌరా హైవేతో కలుస్తాయి. సో విజయవాడ సిటీలోకి వెళ్లే అవసరం లేకుండా మొత్తం 47.8 కిమీ బైపాస్ నిర్మించారు. దీన్నే విజయవాడ వెస్ట్ బైపాస్ అని పిలుస్తున్నారు. ఇది నేషనల్ హైవే 16 (చీన 16)లో భాగం. దీని వల్ల అనవసర ట్రాఫిక్ ఎదుర్కోవాల్సిన అవసరం లేకుండా గమ్యస్థానాలకు వెళ్లేందుకు దూర ప్రాంత వాహన దారులకు ప్రయాణం ఈజీ అవుతోంది. ఈ హైవే మధ్యలో కృష్ణా నదిపై నిర్మించిన 3.1కిమీ ల బాహుబలి బ్రిడ్జ్ ఒక స్పెషల్ ఎట్రాక్షన్.విజయవాడ వెస్ట్ బైపాస్ మొత్తాన్ని అధునాతన టెక్నాలజీతో నిర్మించినట్టు హైవే అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ త్వరలోనే అసలు టోల్ ప్లాజాలే అవసరం లేకుండా ప్రయాణించిన దూరాన్ని బట్టి అమౌంట్ కట్ అయ్యేలా కొత్త విధానం తెస్తామని ప్రకటించారు. దీనవల్ల టోల్ గేట్‌ల వద్ద ఏర్పడే ట్రాఫిక్ కష్టాలు అస్సలుండవు అనేది వారి ఆలోచన. ఒకవేళ ఆ పద్ధతే అమల్లోకి తెస్తే అప్పుడు ఈ వెంకటపాలెం టోల్ ప్లాజా ఏమౌతుందని మరో చర్చ అది మొదలవక ముందే జనాల్లో నడుస్తోంది. ఏదేమైనా అమరావతి రాజధాని ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీ విపరీతంగా పెంచే ప్రయత్నం చేస్తున్న కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వాల పనిలో భాగంగా అమరావతి లో ఏర్పాటైన తొలి టోల్ ప్లాజా గా వెంకటపాలెం టోల్ గేట్ వార్తలకెక్కింది.

పార్టీకి భారంగా మారుతున్న వ్యక్తిగత తప్పులు

కడప, జనవరి 30, పెన్ పవర్:

ప్రజా జీవితంలో ఉన్నవారు ప్రతి అడుగూ ఎంతో జాగ్రత్తగా వేయాల్సిన అవసరం ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తన కూడా ప్రజల పరిశీలనలోనే ఉంటుందన్న సత్యాన్ని గుర్తించాలి. ఒక చిన్న తప్పు కూడా పెద్ద దుమారంగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ వాస్తవాన్ని విస్మరిస్తే రాజకీయ జీవితం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం ఇదే విషయాన్ని స్పష్టంగా చూపిస్తోంది.సర్పంచ్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం చిన్న విషయం కాదు. అలాంటి ఎదుగుదలతో పాటు హుందాతనం, బాధ్యత కూడా పెరగాలి. కానీ ఆ స్థాయికి తగిన ప్రవర్తన లేకపోతే అవకాశాలే శాపంగా మారుతాయి. అరవ శ్రీధర్ విషయంలో రాజకీయంగా వచ్చిన అవకాశాన్ని ఆయన సరిగా వినియోగించుకోలేకపోయారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన చర్యల వల్ల ఆయనకు అవకాశం ఇచ్చిన పార్టీ కూడా ఇప్పుడు వివాదంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఆయనపై వచ్చిన వేధింపుల ఆరోపణలు, వాటికి సంబంధించిన వీడియోలు రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్య ప్రజల్లోనూ చర్చకు దారితీశాయి. ప్రజాప్రతినిధిగా ఎన్నికైన వ్యక్తి మరింత సంయమనం పాటించాల్సి ఉంటుందన్న విషయం ఇలాంటి ఘటనలతో మరోసారి గుర్తుకు వస్తోంది. సమాజం మొత్తం తన వైపే చూస్తుందన్న భావన ఉంటేనే వ్యక్తి తన ప్రవర్తనను అదుపులో ఉంచుకుంటాడు.ఇలాంటి ఘటనలు కేవలం వ్యక్తిగత స్థాయిలోనే కాదు, రాజకీయ పార్టీల ప్రతిష్ఠను కూడా ప్రభావితం చేస్తాయి. జనసేన విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, నైతికత గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుతుంటారు. అలాంటి పార్టీకి చెందిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికరమే. ఇదే సమయంలో ప్రతిపక్షాలు దీనిని రాజకీయంగా ఉపయోగించుకోవడం సహజమే.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలోనూ గతంలో పలువురు నేతలపై ఆరోపణలు వచ్చాయి. అయితే వాటిపై పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పెద్దగా స్పందించలేదన్న విమర్శలు ఉన్నాయి. అప్పట్లో పట్టించుకోని అంశాలే ఆ పార్టీకి నష్టం చేశాయన్న అభిప్రాయం కూడా ఉంది. ఇప్పుడు అదే విషయాలను ప్రస్తావిస్తూ ప్రత్యర్థులపై విమర్శలు చేయడం రాజకీయాల్లో సాధారణమే అయినా, ప్రజలు అన్నింటినీ గమనిస్తూనే ఉంటారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన వంటి పార్టీలు నైతికత గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాయి. అందుకే చిన్న తప్పు జరిగినా పెద్ద ప్రభావం పడుతోంది. అధికారంలో ఉన్నవారికి ప్రతి చర్య భూతద్దంలో కనిపిస్తుంది. అందువల్ల నాయకులు అడుగు తీసే ముందు అడుగు అత్యంత ఆలోచనతో వేయాల్సి ఉంటుంది. ఆరోపణలు వచ్చిన వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఆలస్యం చేస్తే పార్టీ క్రెడిబిలిటీ దెబ్బతింటుంది. అరవ శ్రీధర్ విషయంలో జనసేన నాయకత్వం అంతర్గత కమిటీ వేయడం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచడం సరైన దిశలో వేస్తున్న అడుగుగా భావిస్తున్నారు. అయితే ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అమిత్ షాతో పవన్ చర్చలు

విజయవాడ, జనవరి 30, పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చాలా రోజుల తర్వాత ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సారి ఆయన హస్తిన పర్యటనలో ప్రత్యేకత ఉంది. చాలా రోజుల తర్వాత ఢిల్లీ వెళ్లిన పవన్ కల్యాణ్ పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలసి పిఠాపురం రైల్వే స్టేషన్ వంటి అభివృద్ధి పనులపై చర్చించినప్పటికీ, ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు పవన్ కల్యాణ్ ఎప్పుడు ఢిల్లీ వెళ్లినప్పటికీ ఆయన వెంట మంత్రి నాదెండ్ల మనోహర్ ఉండేవారు. కానీ ఈసారి మాత్రం ఒంటరిగానే పవన్ హస్తిన పర్యటన రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారి తీసింది.2019 ఎన్నికల్లో జనసేన ఓటమి తర్వాత పవన్ కల్యాణ్ అనేక సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. పొత్తుల విషయంలోనూ, మరొక సమయంలోనూ ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యేవారు. ఆయన వెంట ఖచ్చితంగా నాదెండ్ల మనోహర్ ఉండేవారు. ఈసారి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ సమయంలో నాదెండ్ల మనోహర్ లేకపోవడం ఒక రకంగా చర్చించాల్సిన అంశమేనంటున్నారు. అయితే అదే రోజు మంత్రి వర్గ సమావేశం ఉండటంతో నాదెండ్ల మనోహర్ ను తీసుకోకుండా ఆయన ఢిల్లీ పర్యటనకు వెళ్లారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అక్కడ జనసేన కు చెందిన ఇద్దరు ఎంపీలు ఉండటం వల్లనే ఆయన పర్యటనలోనాదెండ్ల లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.మరొకవైపు పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. అయితే రాజకీయ పరమైన అంశాలు ఎక్కువగానే వీరి మధ్య చర్చకు వచ్చినట్లు కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై కూడా వారి మధ్య చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. ప్రధానంగా కూటమి బలోపేతంపై చర్చించడంతో పాటు నియోజకవర్గాల పెంపుదలపై కూడా వీరి మధ్య చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతుంది. ఈసారి పొత్తుల విషయంలో ఎక్కువ స్థానాలు తీసుకునేలా బీజేపీ, జనసేనలు వ్యవహరించనున్నాయన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో పవన్ కల్యాణ్, అమిత్ షాల భేటీ ఏపీ రాజకీయాల్లో మరొకసారి వేడెక్కింది.

రెండు జిరాఫీల దత్తత

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన మాతృమూర్తి అంజనా దేవి జన్మదినం సందర్భంగా ఒక గొప్ప సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును గురువారం సందర్శించిన ఆయన, అక్కడి రెండు జిరాఫీలను ఏడాది పాటు దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు.జిరాఫీల దత్తత: జూలో ఉన్న రెండు జిరాఫీల సంరక్షణ బాధ్యతలను స్వీకరించిన పవన్ కల్యాణ్, వాటికి సంబంధించి ఏడాది పొడవునా అయ్యే ఆహార, ఇతర నిర్వహణ ఖర్చులను తానే స్వయంగా భరిస్తానని వెల్లడించారు. ఈ మేరకు దత్తత పత్రాలను జూ అధికారులకు అందజేశారు.జంతువులతో సందడి: జూ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ అక్కడి ఏనుగులు, జిరాఫీలకు స్వయంగా ఆహారాన్ని తినిపించారు. వన్యప్రాణుల పట్ల ఆయనకున్న మక్కువను చూసి జూ సిబ్బంది, పర్యాటకులు సంతోషం వ్యక్తం చేశారు.కొత్త ఎన్‌క్లోజర్ ప్రారంభం: వన్యప్రాణుల సౌకర్యార్థం జూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలుగుబంట్ల ఎన్‌క్లోజర్‌ను ఆయన ప్రారంభించారుజంతువుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సామాజిక బాధ్యతగా కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్న వారు వన్యప్రాణులను దత్తత తీసుకుంటే జూ పార్కుల అభివృద్ధి సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.
అమ్మ పుట్టినరోజున ఆడంబరాలకు వెళ్లకుండా ఇలా మూగజీవాల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పవన్ కల్యాణ్ సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు.

పవన్ ఎందుకు మౌనం

కడప, జనవరి 30, పెన్ పవర్: ఇటీవల జరిగిన విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడం రాజకీయ వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. వివిధ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా మీడియా ముందుకు వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం చాలా బాధాకరమని, ఇది దేశానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ముఖంలో ఆ సమయంలో స్పష్టమైన విషాదం కనిపించిందిఅయితే అదే సమయంలో మీడియా ప్రతినిధులు జనసేనకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించారు. కానీ పవన్ కళ్యాణ్ ఆ అంశంపై స్పందించకుండా అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా హైలైట్ చేస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు జనసేన కార్యకర్తలు మాత్రం తమ నాయకుడు నిజంగా బాధలో ఉన్నారని, ఆ పరిస్థితిలో ఇతర అంశాలపై మాట్లాడకపోవడం సహజమేనని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీసింది.రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంశంలో జనసేన నాయకత్వం తీసుకున్న వైఖరిపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కోనేటి ఆదిమూలంపై ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్నారు. మరికొందరి విషయంలో విచారణ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే జనసేన ఎమ్మెల్యే విషయంలో మాత్రం వివాదం చాలా రోజులుగా కొనసాగుతున్నా, పార్టీ స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమస్యను మౌనంగా ఎదుర్కోవడం, దిద్దుబాటు చర్యలు ఆలస్యం కావడం వల్ల పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ విలువలు, నైతికత, మంచి పాలన గురించి మాట్లాడుతుంటారు. కానీ అదే సమయంలో జనసేన నేతలపై కూడా లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు రావడం ఆయన లక్ష్యాలకు విరుద్ధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మంచి పాలన అందించాలన్న పవన్ కళ్యాణ్ ఆశయాన్ని కిందిస్థాయిలో కొందరు నేతల వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయనే భావన ఉంది. ఈ పరిస్థితి ఆయనను వ్యక్తిగతంగా కూడా కలచివేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీ స్థాయిలో స్పష్టమైన విధానం, వేగవంతమైన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే జనసేన ప్రజల్లో పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోగలదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

ఐసీఐసీఐ క్రెడిట్ కార్డ్ యూజర్లకు ఫిబ్రవరి 1 నుంచి ఆ సేవలు బంద్

హైదరాబాద్ పెన్ పవర్: ఈ కొత్త సంవత్సరం 2026లో అప్పుడే జనవరి నెల చివరికి వచ్చేశాం. కొత్త నెల ఫిబ్రవరి మొదలవనుంది. కొత్త నెల అంటే పలు కొత్త రూల్స్ సైతం అమలులోకి వస్తుంటాయి. ఫిబ్రవరి 1, 2026 నుంచి ఐసీఐసీఐ బ్యాంక్ సైతం తమ క్రెడిట్ కార్డులకు సంబంధించిన పలు నిబంధనలను మార్చుతున్నట్లు తెలిపింది. క్రెడిట్ కార్డు బెనిఫిట్స్‌లో పలు ప్రయోజనాలను ఇకపై ఆపేస్తున్నట్లు తెలిపింది. తమ బ్యాంక్ కార్డుల్లోని వివిధ కేటగిరీ కార్డులపై ఈ కొత్త రూల్స్ ప్రభావం చూపనున్నాయని తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం. ఈ కొత్త నిబంధనల్లో భాగంగా ఇప్పటి వరకు ఎంపిక చేసిన కార్డుల ద్వారా అందిస్తున్న బుక్ మై షో కాంప్లిమెంటరీ మూవీ బెనిఫిట్స్ తొలగిస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే, వివిధ కార్డుల ద్వారా ట్రాన్స్‌పోర్ట్, ఇన్సూరెన్స్ చెల్లింపులపై అందించే రివార్డ్ పాయింట్లు కొనసాగుతాయని తెలిపింది. మీ క్రెడిట్ కార్డును సినిమాలు, రోజు వారీ రవాణా లేదా ఇన్సూరెన్స్ పేమెంట్ల కోసం ఉపయోగిస్తే మీకు వచ్చే రివార్డ్ పాయింట్లలో కనిపించనున్నాయని తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ హెచ్‌పీసీఎల్ సూపర్ సేవర్ క్రెడిట్ కార్డు కస్టమర్లకు రూ.40 వేల వరకు ఇన్సూరెన్స్ పేమెంట్లు చేస్తే రివార్డ్ పాయింట్లు వస్తాయని తెలిపింది. అలాగే రూ.10 వేల నుంచి రూ.40 వేల వరకు ట్రాన్స్‌పోర్ట్ మెర్చంట్ కేటగిరీ ద్వారా ఖర్చు చేస్తే కస్టమర్లకు రివార్డ్ పాయింట్లు లభిస్తాయని తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్ పలు కార్డులపై బుక్ మై షో కాంప్లిమెంటరీ మూవీ బెనిఫిట్స్ తొలగిస్తోంది. ఈ కొత్త రూల్స్ ఫిబ్రవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్‌స్టాంట్ ప్లాటినం చిప్ క్రెడిట్ కార్డు, ఐసీఐసీఐ బ్యాంక్ ఇన్‌స్టాంట్ ప్లాటినం క్రెడిట్ కార్డులపై ఈ బెనిఫిట్ ఆపేస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. మరోవైపు.. జనవరి 15, 2026 నుంచే కొన్ని నిబంధనలను ఐసీఐసీఐ బ్యాంక్ మార్చింది. అన్ని రకాల రిటైల్ ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఛార్జీలను మార్చింది. ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ ఖర్చులపై ఈ ఛార్జీలను సవరించింది. డ్రీమ్ 11, రమ్మీ కల్చర్, జంగ్లీ గేమ్స్, ఎంపీఎల్ వంటి వాటిపై ఖర్చు చేస్తే 2 శాతం ఛార్జ్ చెల్లించాలని కొత్త రూల్ తెచ్చింది.

ఆర్‌బిఐ నియామకాలు..

హైదరాబాద్ పెన్ పవర్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాన్పూర్ శాఖలో ఖాళీగా ఉన్న మెడికల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి తాజాగా ప్రకటన విడుదల చేసింది. మొత్తం మూడు పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయాలని నిర్ణయించింది. వైద్య రంగంలో అనుభవం ఉండి, కేంద్ర బ్యాంక్‌లో పనిచేయాలనుకునే అభ్యర్థులకు ఇది ఒక మంచి అవకాశమని చెప్పవచ్చు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది.ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఓఃూ లేదా జనరల్ మెడిసిన్‌లో పీజీ పూర్తి చేసి ఉండాలి. విద్యా?ర్హతలతో పాటు సంబంధిత విభాగంలో కనీసం కొంత పని అనుభవం ఉండటం తప్పనిసరి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొఫైల్స్ పరిశీలించి, వారి అర్హతల ఆధారంగా షార్ట్ లిస్ట్ చేస్తారు. ఎంపికైన వారికి తదుపరి దశలో వ్యక్తిగత ఇంటర్వ్యూ నిర్వహించి తుది జాబితాను ప్రకటిస్తారు. ఆర్థికంగా ఈ ఉద్యోగం ఆకర్షణీయమైన వేతనాన్ని అందిస్తోంది. ఎంపికైన మెడికల్ కన్సల్టెంట్లకు గంటకు రూ.1,000 చొప్పున గౌరవ వేతనం చెల్లించనున్నారు. పని వేళలు మరియు ఇతర నిబంధనలు బ్యాంక్ నియమావళి ప్రకారం ఉంటాయి. వైద్య సేవలు అందించడమే కాకుండా, బ్యాంక్ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలను వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. కార్పొరేట్ తరహా వాతావరణంలో పనిచేయాలనుకునే డాక్టర్లకు ఇది సరైన వేదిక. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఫిబ్రవరి 12వ తేదీ లోపు సమర్పించాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోరు.

క్యూబాకు చమురు విక్రయించే దేశాలపై యూఎస్ సుంకాలు

హైదరాబాద్ పెన్ పవర్: క్యూబాపై అమెరికా పరోక్షంగా బెదిరింపులకు దిగింది. క్యూబాకు చమురు విక్రయించే దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు దిగారు. క్యూబాకు చమురును విక్రయించే లేదా అందించే దేశాల నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు విధించబడుతుందన్న కార్యనిర్వాహక ఉత్తర్వుపై గురువారం ట్రంప్ సంతకం చేశారు. క్యూబాకు చమురు అందిస్తూ, నిరంతరం సంఘీభావం ప్రకటిస్తున్న మెక్సికోపై ఈ ఉత్తర్వులు ఒత్తిడి తీసుకురానుంది. ట్రంప్ ఉత్తర్వును క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఖండించారు. ఇది క్యూబా మరియు ఆ దేశ ప్రజలపై క్రూరమైన దురాక్రమణ చర్యగా పేర్కొన్నారు. ప్రాథమిక అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై మరింత ప్రభావం చూపనుందని అన్నారు. క్యూబాకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా ఖండించబడిన దిగ్బంధన పాలసీలోకి ఇతర దేశాలను చేరేలా ఒత్తిడి తీసుకువచ్చేందుకు అమెరికా బ్లాక్ మెయిల్ మరియు బెదిరింపులను ఆశ్రయించిందని అన్నారు. దశాబ్దాలుగా తీవ్రమైన ఆర్థిక యుద్ధం వైఫల్యం చెందడంతో అమెరికా క్యూబాపై దిగ్బంధనానిన కఠినతరం చేస్తోందని మరియు సార్వభౌమాధికారం గల రాష్ట్రాలను ఆంక్షలలో చేరమని బెదిరింపులకు యత్నిస్తోందని క్యూబా విదేశాంగశాఖ ఉప మంత్రి కార్లోస్ ఎఫ్.డి.కోసియో ఎక్స్‌లో పేర్కొన్నారు. సుంకం బెదిరింపుల ముప్పుతో క్యూబాకు తమ సొంత చమురును ఎగుమతి చేసుకునే హక్కును వదులుకోవాలా వద్దా అని ఆయా దేశాలు నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు.

కొలంబియాలో విమాన ప్రమాదం

హైదరాబాద్ పెన్ పవర్: కొలంబియా ఈశాన్య ప్రాంతంలో వెనిజులా సరిహద్దుకు సమీపంలో విమాన ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ఘటనలో స్థానిక శాసన సభ్యుడు సహా మొత్తం 15 మంది చనిపోయారు. విమానం గమ్య స్థానానికి చేరుకునే కొద్ది నిమిషాల ముందే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఎయిర్‌లైన్ సటెనాకు చెందిన బీచ్‌క్రాఫ్ట్ 1900 విమానం కుకుటా నుంచి బయలుదేరి ఒకానా వైపు వెళ్తుండగా రాడార్ నుంచి అదృశ్యమైంది. ఉదయం 11.54 గంటలకు చివరకు కమ్యూనికేషన్ జరిగినట్టు అధికారులు వెల్లడించారు. విమానం కనబడకపోవడంతో కటాటుంబో

ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతం పర్వతాలు, అడవులతో కూడిన క్లిష్ట భూభాగం. దీంతో ఇది గాలింపు చర్యలకు తీవ్ర అడ్డంకిగా మారింది. వాయు దళం, సైన్యం కలిసి ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టాయి. గురువారం రోజున విమానం శకలాలు లభ్యమయ్యాయి. స్థానిక మీడియా విడుదల చేసిన చిత్రాల్లో విమానం పూర్తిగా ధ్వంసమై కనిపించింది. ఎవరూ బతికిలేరన్న ప్రాథమిక సమాచారం వెల్లడైంది. ఈ విమానంలో 13 మంది ప్రయాణికులు, ఇద్దరు సిబ్బంది కలుపుకొని మొత్తం 15 మంది ఉన్నారు. వారంతా ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో స్థానిక శాసనసభ్యుడు డియోజెన్స్ క్వింటెరో, రాబోయే ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కార్లోస్ సాల్సెడో కూడా ఉన్నారు. ఇప్పటి వరకూ ప్రమాదానికి గల కారణాలను వెల్లడించలేదు. కొలంబియా పౌర విమానయాన సంస్థ అధికారులు విమాన శకలాలను పరిశీలించారు. దర్యాప్తు చేపట్టనున్నారు. నార్టే డి సాంటాండర్ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించింది. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

అంతరించే అంచున విలక్షణ జీబ్రాలు

హైదరాబాద్ పెన్ పవర్: జీవజాతుల్లో ప్రతి జీవికి ఒక ప్రాధాన్యం ఉంటుంది. జీవ వైవిధ్య పరిరక్షణలో అన్ని జీవులు తమ తమ పాత్రను నిర్వహిస్తాయి. భూగోళంపై 8 మిలియన్లకు పైగా వృక్ష జంతు జీవరాసులు ఉండవచ్చని, వాటిలో దాదాపు 2 మిలియన్ల జీవరాశులను శాస్త్రజ్ఞులు గుర్తించారని తెలుస్తున్నది. జంతుశాస్త్ర జాబితాలో ఉన్న అత్యల్ప సూక్ష్మజీవుల నుంచి అతి పెద్ద బ్లూ వేల్ వరకు అన్ని జంతువులకు ఒక్కో ప్రత్యేకత ఉన్నది. మానవ తప్పిదాలతో ఈ జీవుల మనుగడకు వందల ఏండ్లు నుంచి విఘాతం కలిగినట్లు అయితే వాటి సంఖ్య క్రమంగా తగ్గుతూ చివరకు అంతరించిపోయిన జంతువుల జాబితాలోకి చేరుతాయి. ఇలా ఇప్పటి వరకు అంతరించి పోయిన జీవుల సంఖ్య వేలల్లో ఉండవచ్చని, నేటికీ దాదాపు 905 జీవులు అంతరించి పోవడం జరిగిందని రుజువు చేయబడింది. మరి కొన్ని అరుదైన జీవజాతులు అంతరించడానికి ఎంతో సమయం పట్టదని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీవజాతులు అంతరిస్తూ పోతే, జీవ వైవిధ్యం దెబ్బతిని చివరికి మనిషి మనుగడ కూడా ప్రశ్నార్థకంగా కావడంతో పాటు, మనిషి జాతి కూడా అంతరించే అవకాశాలు లేకపోలేదు. ఆఫ్రికా దేశాల్లో కనిపించే ఒక ప్రత్యేక జంతువు జీబ్రా అని పిలుస్తున్నాం. నేటి ఆధునిక మానవుడి అతి తెలివి వల్ల జీబ్రాల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతున్నట్లు, ఒక రకమైన జీబ్రాలు అంతరించే దుస్థితికి చేరాయని జంతు ప్రేమికులు, శాస్త్రవేత్తలు హెచ్చరికలు చేస్తున్నారు. రోడ్ల వెంట జీబ్రా క్రాసింగ్స్ ఉండడం మనం చూస్తున్నాం. జీబ్రా జాతులను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రతి ఏట 31 జనవరి రోజున "అంతర్జాతీయ జీబ్రాల దినం" పాటించుట జరుగుతున్నది. అంతర్జాతీయ జీబ్రాల దినం-2026 ఇతివృత్తంగా "స్ట్రైప్స్ దట్ యునైట్" (ఏకం చేసే చారలు) అనబడే అంశాన్ని తీసుకున్నారు. భూగోళంపై ఉన్న విలక్షణ జంతువులుగా జీబ్రాలను గుర్తించారు. నలుపు, తెలుపు చారతో ప్రత్యేకంగా కనిపించే జీబ్రాలు గడ్డిని మేస్తూ అటవీ పర్వత ప్రాంతాల్లో నివసిస్తుంటాయి. కెన్యా, నమీబియా, అంగోలా, దక్షిణ ఆఫ్రికా దేశాల్లో కనిపించే జీబ్రాల సంఖ్య మానవ తప్పిదాలతో క్రమంగా తగ్గుతున్నట్లు గమనించారు. మానవ ప్రమేయంతో జీబ్రాల నివాస ప్రాంతాలను అక్రమించడం, మాంసం/చర్మం కోసం వాటిని వేటాడడం, జంతువుల మధ్య మనుగడ పోటీ పెరగడం, జీబ్రాల సంచరించే దారులను మూసి వేయడం, కొన్ని ప్రాంతాల్లో యుద్ధ వాతావరణాలు నెలకొనడం, అవగాహన లోపం లాంటి కారణాలతో వాటి సంఖ్య క్రమంగా తగ్గుతోంది. ఇప్పటికే 'ఖ్వగ్గా' అనబడే జీబ్రా జాతి 19వ శతాబ్దంలోనే అంతరించి పోయింది. నేడు మైదాన ప్రాంత, పర్వత ప్రాంత, గ్రేవీ అనే మూడు రకాల జీబ్రా జాతులు కనిపిస్తున్నాయి. వీటిలో పెద్దగా కనిపించే గ్రేవీ జాతి జీబ్రాలు అంతరించే అంచున ఉన్నట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. నలుపు, తెలుపు చారలు కలిగిన జీబ్రాలు విలక్షణంగా కనిపిస్తూ తమ ప్రత్యేకతలను ప్రదర్శిస్తాయి. ఒక్కో జీబ్రా చారలు ఒక్కో రకంగా మానవ హస్త రేఖల వలె ఉండడం విశేషం. ఈ చారల సహాయంతోనే అడవిల్లో తమ వెంటపడే సింహాలు, హైనాలు లాంటి మాంసాహార జంతువులకు కనబడకుండా తప్పించుకోగలుగుతున్నాయి. జీబ్రాలు గంటకు 65 కిమీ దూరం ప్రయాణించగలవు. ఇవి అటవీ ప్రాంతాల్లో గుంపులుగా జీవిస్తూ, గడ్డిని తింటూ విత్తనాలను ఇతర ప్రాంతాలకు వెదజల్లుతూ జీవ వ్యవస్థ ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి. అంతర్జాతీయ జీబ్రాల దినం వేదికగా జీబ్రాల సంరక్షణ చర్యలు, వాటి ప్రాధాన్యం, జీవ వైవిధ్య అవసరాన్ని వివరించడం, జీబ్రా చారలు కలిగిన వస్త్రాలు ధరించడం, వేటల నిషేధ చట్టాలను పటిష్టంగా అమలు పరచడం, విద్యాలయాల్లో పోటీల నిర్వహణ, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటి కార్యక్రమాలు నిర్వహించడం సముచితంగా ఉంటుంది. జీబ్రా జాతుల మనుగడ కొనసాగే విధంగా ప్రపంచ మానవాళి కృషి చేయాలని కోరుకుందాం

అమెరికా చర్యలతో మధ్యప్రాచ్యంలో అస్థిరత

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా నుంచి పెరుగుతున్న సైనిక బెదిరింపుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో అస్థిరత తలెత్తే ప్రమాదం ఉన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ హెచ్చరించారు. ఈ క్రమంలో ఆయన సౌదీ అరేబియన్ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడి.. ప్రాంతీయ శాంతి, భద్రతలపై చర్చించారు. ఇరాన్‌పై దాడి చేసే అంశాన్ని అమెరికా పరిశీలిస్తున్నట్టు సంకేతాలు ఇస్తున్న సమయంలో.. యూఎస్ యుద్ధ నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను పంపింది. ఈ పరిణామాల నడుమ పెజెష్కియాన్ మాట్లాడుతూ? అమెరికా బెదిరింపులు ప్రాంత భద్రతను భంగపెట్టడానికే తప్ప మరేది సాధించవన్నారు. అవి అస్థిరతకే దారి తీస్తాయని చెప్పారు.ఆర్థిక ఆంక్షలు, బాహ్య జోక్యాలు ఇరాన్ ప్రజల ధైర్యాన్ని దెబ్బతీయలేకపోయాయని ఆయన స్పష్టం చేశారు. వీరిద్దరి మధ్య సాగిన సంభాషణలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ కూడా ప్రాంతీయ శాంతి, స్థిరత్వానికి మద్దతుగా తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై ఎలాంటి సైనిక దాడులకూ తమ గగనతలం, భూభాగాన్ని ఉపయోగించనివ్వబోమని సౌదీ స్పష్టం చేసింది. ఇస్లామిక్ దేశాల మధ్య ఐక్యత అవసరమనీ, వివాదాలు చర్చల ద్వారానే పరిష్కరించాలన్నదే తమ వైఖరని వివరించింది. కాగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై దాడి హెచ్చరికలు చేశారు. ''ఇంకో భారీ నౌకాదళం ఇరాన్ వైపు వెళ్తోంది'' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఇరాన్ తన అణుకార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేస్తుండగా.. ఒత్తిడిలో లొంగిపోవడం మరిన్ని ఒత్తిళ్లకే దారి తీస్తుందని ఇరాన్ నేతలు భావిస్తున్నట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

నటుడు జయరామ్‌ను విచారించిన సిట్

హైదరాబాద్ పెన్ పవర్: నటుడు జయరామ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రశ్నించినట్లు అధికారిక వర్గాలు శుక్రవారం తెలిపాయి. శబరిమల బంగారం దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేపడుతున్న సిట్ ఇటీవల చెన్నైలోని నివాసంలో ఆయనను ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టితో కలిసి ఎన్నిసార్లు పూజల్లో పాల్గొన్నారు, వారి మధ్య ఆర్థిక లావాదేవీలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. శబరిమలలోని ద్వారపాలక (సంరక్షక దేవత) విగ్రహాలు, ఆలయంలోని శ్రీకోవిల్ (గర్భగృహం) తలుపు ఫ్రేమ్‌ల నుండి బంగారం మాయమైన రెండు కేసులను సిట్ దర్యాప్తు చేస్తోంది. 2019లో చెన్నైలో నిర్వహించిన పూజలో పొట్టి, జయరాంలు పాల్గొన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారడంతో నటుడిని సిట్ విచారిస్తోంది. ఈ కేసులకు సంబంధించి అరెస్టయిన ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టిబిడి) మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.మురారిబాబు, ఎస్. శ్రీకుమార్‌లు ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు.

నిందితులను అరెస్ట్ చేసిన 90 రోజుల వ్యవధిలో సిట్ చార్జిషీట్ దాఖలు చేయకపోవడంతో కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసైఇంది. గర్భగుడి డోర్‌ఫ్రేమ్‌ల నుండి బంగారం మాయమైన రెండవ కేసులో శ్రీకుమార్‌ను నిందితుడిగా చేర్చలేదు. ఒక కేసులో బెయిల్ పొందినప్పటికీ పొట్టి ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. ఈ కేసులకు సంబంధించి ఇద్దరు టిబిడి అధ్యక్షులు సహా 12మందిని సిట్ అరెస్ట్ చేసింది.

బిజెపి అణచివేత, విభజన రాజకీయాలపై ఐక్యపోరాటం

హైదరాబాద్ పెన్ పవర్: బిజెపి అణచివేత పాలన, విభజన రాజకీయాలను వ్యతిరేకిస్తూ ఐక్యంగా పోరాడాలని సిపిఎం సీనియర్ నేత, ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ (ఎఐఆర్ఎం) ఉపాధ్యక్షులు బృందా కరత్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన భూములను "కార్పొరేట్ షార్క్‌లకు" అప్పగిస్తోందని విమర్శించారు. త్రిపుర రాజధాని అగర్తలలో గణముక్తి పరిషత్ (జిఎంపి) 23వ మహాసభ సందర్భంగా గురువారం రవీంద్ర శత వార్షికీ భవన్ ముందు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రజల జీవితాలతో, జీవనోపాధితో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని అన్నారు. "దేశంలోని గిరిజనులు చాలా కష్టకాలం ఎదుర్కొంటున్నారు. అటవీ హక్కుల చట్టం కింద వారికి కేటాయించిన భూములను, వారి జీవనోపాధిని ప్రభుత్వం పెద్ద కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించడానికి లాగేసుకుంటోంది. మనం దీనికి వ్యతిరేకంగా పోరాడాలి. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ బిజెపి ప్రభుత్వాలను ఓడించాలి" అని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం మత భావజాలాన్ని అనుసరిస్తోందని, ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాలపై వివక్ష చూపుతోందని విమర్శించారు. గణ ముక్తి పరిషత్ మహోజ్వల చరిత్రను, త్రిపుర గిరిజనుల సమస్యల పరిష్కారానికి అది చేసిన కృషిని గుర్తు చేశారు. బంగ్లాదేశ్‌లో అస్థిర పరిస్థితులు, హింసాత్మక దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి, ఎఐఆర్ఎం అధ్యక్షులు జితేంద్ర చౌదరి తదితరులు ప్రసంగించారు.

యుజిసి సమానత్వ నిబంధనలపై సుప్రీం స్టే

హైదరాబాద్ పెన్ పవర్: సమాజాన్ని విడదీసేలా లేదా సమాజంలో అలజడి సృష్టించేలా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఇటీవల విడుదల చేసిన కొత్త నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ, అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. తదుపరి విచారణ వరకూ 2012 నాటి పాత మార్గదర్శకాలే కొనసాగించాలని స్పష్టం చేసింది. 'ఈక్విటీ రెగ్యులేషన్స్' పేరుతో యుజిసి ఈ నెల 13న విడుదల చేసిన కొత్త నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ బాగ్చితో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా నిబంధనల అమలుపై స్టే విధిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. కేంద్ర ప్రభుత్వంతోపాటు యుజిసికి నోటీసులు జారీ చేసింది. తాజా నిబంధనలు స్పష్టంగా లేవని, ఇవి సమాజాన్ని విడదీసేలా, లేదా సమాజంలో అలజడి సృష్టించే ప్రమాదం ఉందని ధర్మాసనం పేర్కొంది. ప్రముఖ న్యాయ నిపుణులతో కూడిన కమిటీ నిబంధనలను పున:పరిశీలించాలని సూచించింది. '75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో మనం వర్గాలు లేని సమాజాన్ని నిర్మించామా? లేక సమాజాన్ని మళ్లీ తిరోగమనం వైపు తీసుకెళ్తున్నామా? తమ సంస్కృతిని పాటిస్తున్న దక్షిణాది వారిపై, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులపై ఇంకా ర్యాగింగ్ చేస్తున్నాం. వారిపై కామెంట్ చేస్తున్నాం. ఇంకా మీరు ప్రత్యేక హాస్టళ్ల గురించి అడుగుతున్నారు. మన దేశంలో కులాంతర వివాహాలు జరుగుతున్నాయి. హాస్టళ్లలో అందరూ కలిసే ఉంటున్నారు. అమెరికాలోలాగా నల్ల జాతీయులకు, శ్వేత జాతీయులకు వేర్వేరు పాఠశాలలున్నట్లు.. మనం విభజన కలిగిన పాఠశాలలవైపు వెళ్లడం లేదు' అని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో కొత్త రూల్స్ అమలును నిలిపేసింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు 2012 నాటి పాత మార్గదర్శకాలే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది.

అమెరికా దాడి చేస్తే..

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా కనుక తమపై దాడి చేస్తే అందుకు ప్రతిగా టెల్ అవీవ్‌పై విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ అధిపతి అలీ ఖమేనీ సలహాదారుడు, జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీషంఖనీ ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'దాడి పరిమితంగా ఉంటుందన్నది ఊహాగానమే. అమెరికా నుంచి కానీ, ఎవరి నుంచైనా కానీ, ఏ స్థాయిలో అయినా కానీ సైనిక చర్య జరిగితే యుద్ధం మొదలైందని భావిస్తాం. తక్షణమే స్పందిస్తాం. అది సమగ్రంగా ఉంటుంది. ముందు వెనుకలు ఉండవు. దురాక్రమణ దారుడే లక్ష్యంగా ఉంటుంది. టెల్ అవీవ్ పైన, దాని మద్దతుదారుల పైన విరుచుకు పడతాం' అని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికా దళాలు ఏ క్షణాన అయినా దాడి చేయవచ్చునని వార్తలు వస్తున్న నేపథ్యంలో షంఖనీ ఈ హెచ్చరికలు చేశారు. తమపై దాడి జరిగితే దాని వెనుక ఉన్న వ్యూహకర్తలు కలలో కూడా ఊహించని విధంగా వెంటనే స్పందిస్తామని ఆయన గత నెలలోనే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అమెరికా దాడికి ప్రతిగా ఇజ్రాయిల్‌పై దాడి తప్పదని ఇరాన్ ఎప్పటి నుంచో చెబుతోంది. ఇదిలా వుండగా తమ అణు కార్యక్రమంపై కొత్తగా ఒప్పందం కుదిరే అవకాశాలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తోసిపుచ్చడం లేదు. 'దాడి చేస్తే ప్రతి దాడికి సిద్ధం. సాహసోపేతులైన మా సాయుధ దళాలు ట్రిగ్గర్‌పై వేలు ఉంచి సిద్ధంగా ఉన్నాయి. మేము ఎంతగానో ప్రేమిస్తున్న భూమి, ఆకాశం, సముద్రంపై దురాక్రమణకు పాల్పడితే తక్షణమే శక్తి వంతమైన స్పందన తెలియజేస్తాం' అని ఆయన చెప్పారు. అయితే అదే సమయంలో పరస్పర ప్రయోజనకరమైన, న్యాయమైన అణు ఒప్పందాన్ని స్వాగతిస్తామని అన్నారు. ఆ ఒప్పందం శాంతియుత అణు సాంకేతిక పరిజ్ఞానం విషయంలో ఇరాన్ హక్కును గౌరవించేదిగా, అణ్వా యుధాలను విడనాడతామన్న గ్యారంటీ ఇచ్చేదిగా ఉండాలని సూచించారు.

టెహ్రాన్‌పై బలప్రయోగాన్ని యూఎస్ మానుకోవాలి

హైదరాబాద్ పెన్ పవర్: టెహ్రాన్‌పై అమెరికా బలప్రయోగానికి పాల్పడితే చాలా ప్రమాదకర పరిణామాలు తలెత్తుతాయని.. పశ్చిమాసియా అంతటా గందరగోళానికి కారణమవుతుందని రష్యా హెచ్చరించింది. అమెరికా-ఇరాన్‌లు ఇంకా చర్చించుకునే అవకాశం ఉందని రష్యా సూచించింది. ఇరాన్ చర్చలకు వచ్చి అణ్వాయుధాలపై ఒప్పందం కుదుర్చుకోవాలని లేదా అమెరికా దాడి చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులకు దిగారు. ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ స్పందించారు. ఈ సందర్భంగా దిమిత్రీ మీడియాతో మాట్లాడుతూ.. 'సమస్యల్ని పరిష్కరించడానికి అన్ని పక్షాలు సంయమనం పాటించాలి. బలప్రయోగాన్ని మానుకోవాలని మేము పిలుపునిస్తూనే ఉన్నాము. చర్చల విధానాలపైనే దృష్టి పెట్టాలి. బలవంతపు చర్యలు ఈ ప్రాంతంలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. ఈ ప్రాంతం అంతటా భద్రతా వ్యవస్థను అస్థిరపరిచే పరంగా చాలా ప్రమాదకరమైన పరిణామాలకు దారితీస్తాయి' అని ఆయన అన్నారు. కాగా, ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యా ఇరాన్‌తో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంది. జనవరి 2025లో ఇస్లామిక్ రిపబ్లిక్‌తో 20 సంవత్సరాల వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై సంతకం చేసింది.

ఒక్కసారిగా దిగొచ్చిన బంగారం ధరలు

ఇటీవల కాలంలో సామాన్యులకు బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో చోటుచేసుకున్న పరిణామాలు, ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో దేశీయంగా బులియన్ మార్కెట్‌లో ధరలు భారీగా పతనమయ్యాయి. దీంతో ఇవాళ హైదరాబాద్‌లియన్ మార్కెట్‌లో ఒక్క రోజులోనే 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారంపై రూ.8,230 తగ్గి రూ.1,70,620 వద్ద కొనసాగుతోంది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్స్ బంగారం ధరపై రూ.7,550 తగ్గుదల కనిపించింది. దీంతో 10 గ్రాముల ధర రూ.1,56,400కి చేరింది. అదేవిధంగా బంగారంతో పోటీ పడుతూ పరుగులు పెట్టిన వెండి ధర కూడా నేడు భారీగా క్షీణించింది. కిలో వెండిపై ఏకంగా రూ.10 వేల మేర తగ్గింది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ. 4,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా డాలర్ విలువలో మార్పులు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలు, అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన అమ్మకాల ఒత్తిడి కారణంగానే ఈ భారీ తగ్గుదల నమోదైనట్లుగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ ఈ ధరల తగ్గుదల మధ్యతరగతి వినియోగదారులకు, పసిడి ప్రియులకు పెద్ద ఊరటనిచ్చే అంశమే.

తిరిగి రష్యా చమురు కొనుగోలు చేయనున్న రిలయన్స్

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు శుద్ధి కాంప్లెక్స్‌ను నిర్వహిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ మళ్లీ రష్యా చమురు కొనుగోళ్లను ప్రారంభించనుంది. కంపెనీకి చెందిన జామ్‌నగర్‌లోని కాంప్లెక్స్ తిరిగి ఫిబ్రవరి నుంచి రోజుకు 1,50,000 బ్యారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేయనుందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ గురువారం తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో రష్యాలోని అతిపెద్ద చమురు కంపెనీలైన రోస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో రిలయన్స్ ఈ కంపెనీలతో ఉన్న దీర్ఘకాలిక ఒప్పందాల కింద కొనుగోలు చేయడం కష్టంగా మారింది. రిలయన్స్ ఎగుమతులు, చెల్లింపులు, గ్లోబల్ వ్యాపారంలో సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. దీంతో డిసెంబర్ తర్వాత రిలయన్స్ రష్యా చమురు కొనుగోలు చేయడం నిలిపేసింది. తాజాగా రిలయన్స్ అమెరికా ఆంక్షల కింద లేని రష్యా కంపెనీల నుంచి ముడిచమురు కొనుగోలు చేయనున్నట్టు చెబుతోంది. అయితే, దీనిపై కంపెనీ అధికారికంగా వివరాలను వెల్లడించాల్సి ఉంది. రష్యా చమురు ఇతర దేశాల చమురు కంటే చౌకగా ఉండటంతో కంపెనీ ఆంక్షలకు అనుగుణంగా అమెరికా నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న రష్యా కంపెనీల నుంచి కొనుగోళ్లు నిర్వహించనుంది. ఇక, రష్యా నుంచే కాకుండా సౌదీ అరేబియా, ఇరాక్, కెనడా దేశాల నుంచి కూడా చమురు కొంటోంది. అయితే, పెద్ద రష్యా కంపెనీలపై ఆధారపడటాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో వెనిజులా చమురును మళ్లీ కొనుగోలు చేయాలని కూడా రిలయన్స్ భావిస్తోంది. దీనికోసం అమెరికా ఆమోదం పొందడానికి కూడా ఇది ప్రయత్నిస్తోంది.

మైక్రోసాఫ్ట్ సంస్థకు రూ.36 లక్షల కోట్ల నష్టం

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ స్టాక్ మార్కెట్‌లో భారీ నష్టాలను చవిచూసింది. కొన్ని గంటల్లోనే కంపెనీ వాల్యుయేషన్‌లో 12 శాతం నష్టపోగా, దాని విలువ 400 బిలియన్ డాలర్లకు పైగా పడిపోయింది.భారతీయ కరెన్సీలో ఇది రూ.36 లక్షల కోట్లకు సమానం. స్టాక్ మార్కెట్ చరిత్రలో ఒకే రోజులో ఇది రెండో అతిపెద్ద నష్టంగా నమోదైంది. గత ఏడాది జనవరిలో ఎన్విడియా 593 బిలియన్ డాలర్లను కోల్పోయింది. వాల్యుయేషన్ పతనానికి గ్లోబల్ మార్కెట్ ఒత్తిళ్లు, పెట్టుబడిదారుల లాభాల స్వీకరణ, భవిష్యత్ ఆదాయ అంచనాలపై అనిశ్చితి వంటి అంశాలు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టెక్ రంగంపై పెరుగుతున్న పోటీ కూడా ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. ఈ ఒక్కరోజు నష్టం ఉన్నప్పటికీ, మైక్రోసాఫ్ట్ యొక్క దీర్ఘకాలిక వ్యాపార బలం పటిష్టంగానే ఉందని కొందరు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రాబోయే త్రైమాసిక ఫలితాలు కంపెనీ షేర్ దిశను నిర్ణయించే కీలక అంశంగా మారనున్నాయి.

కొత్త రికార్డులతో బంగారం, వెండి దూకుడు

పెట్టుబడిదారుల నుంచి అధిక గిరాకీకి తోడు మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి ధరలు గురువారం చారిత్రాత్మక గరిష్టాలకు చేరాయి. ఫ్యూచర్ ట్రేడింగ్‌లో కిలో వెండి 6 శాతం పెరిగి రూ. 4 లక్షల మైలురాయిని దాటగా, బంగారం ధర రూ. 1.79 లక్షలుగా నమోదైంది. కొనుగోలుదారుల డిమాండ్ కారణంగా రూ. 11 వేలకు పైగా పెరిగి, పద్ గ్రాముల బంగారం ధర రూ. 1,78,850తో కొత్త గరిష్టాలను నమోదు చేసింది. అంతర్జాతీయ మార్కెట్‌లోను బంగారం ఫ్యూచర్స్ తొలిసారి ఔన్స్‌కు 5,600 డాలర్ల కీలక మార్కును దాటి 5,627.50 డాలర్లను నమోదు చేశాయి. పారిశ్రామిక డిమాండ్ పెరగటం, అమెరికా డాలర్ బలహీనపడటమే వెండి రికార్డు ధరలకు కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం, హైదరాబాద్ మార్కెట్లో స్వచ్ఛమైన బంగారం పది గ్రాములు రూ. 11,770 పెరిగి రూ. 1,78,850కి చేరింది. ఆభరణాల తయారీలో ఉపయోగించే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 10,800 పెరిగి రూ. 1,63,950 వద్ద ఉంది. వెండి కిలో ఏకంగా రూ. 25 వేలు పెరిగి రూ. 4.25 లక్షలుగా నమోదైంది. గ్లోబల్ మార్కెట్లో వెండి ఔన్స్ ధర 120.56 డాలర్లుగా ఉంది. గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విడుదల చేసిన ఆర్థిక సర్వేలో దేశ జీడీపీ వృద్ధి 6.8-7.2 శాతంగా ఉంటుందని అంచనా వేయడంతో స్టాక్ మార్కెట్లలో ర్యాలీ కనిపించింది. దీనికి తోడు కీలక ఎల్‌అండ్‌టీ లాంటి బ్లూ-చిప్ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, గ్లోబల్ మార్కెట్లలోనూ ర్యాలీ కొనసాగడం, ఆసియా మార్కెట్ల లాభాలు కొనసాగడం వంటి అంశాల కారణంగా మన మార్కెట్లు వరుసగా మూడో రోజు సానుకూలంగా ముగిశాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 221.69 పాయింట్లు లాభపడి 82,566 వద్ద, నిఫ్టీ 76.15 పాయింట్లు పెరిగి 25,418 వద్ద ముగిశాయి. ఎల్‌అండ్‌టీతో పాటు యాక్సిస్ బ్యాంక్, ఎటర్నల్, ఎన్‌టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ కూడా లాభపడిన వాటిలో ఉన్నాయి. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి, ప్రపంచ మార్కెట్లలో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ మధ్య, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మరోసారి ఆల్-టైమ్ కనిష్ట స్థాయి రూ. 91.92 వద్దకు చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, విదేశీ నిధుల ఉపసంహరణ మధ్య రూపాయి ఆల్-టైమ్ ఇంట్రా-డే కనిష్టం రూ. 91.99ని తాకిందని ఫారెక్స్ వ్యాపారులు తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల కూడా రూపాయిపై ఒత్తిడి పెంచాయన్నారు.

పట్టణ గెలుపే రేపటి రాజకీయ దిశా నిర్దేశం

తెలంగాణాలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల నేపథ్యం రాష్ట్ర రాజకీయాలను మరో కీలక మలుపు వద్ద నిలబెడుతోంది. సాధారణంగా స్థానిక సంస్థల ఎన్నికలుగా భావించే మున్సిపల్ ఎన్నికలు ఈసారి అధికార కాంగ్రెస్ పార్టీకి, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు, అలాగే బీజేపీకి రాజకీయంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పు అనంతరం తొలిసారిగా పట్టణ స్థాయిలో ప్రజాభిప్రాయాన్ని కొలిచే అవకాశం రావడంతో ఈ ఎన్నికలు కేవలం మున్సిపాలిటీ పాలనకే పరిమితం కాకుండా, రాష్ట్ర స్థాయి రాజకీయ బలాబలాలను నిర్ణయించే పరీక్షగా మారాయి. అందువల్లే తెలంగాణాలో మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు 'మినీ అసెంబ్లీ ఎన్నికలు'గా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణాలో మున్సిపల్ పాలనకు ప్రత్యేక చరిత్ర ఉంది. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రామగుండం వంటి పట్టణ కేంద్రాలు ఆర్థికంగా, జనాభా పరంగా విస్తరించాయి. 2011 జనగణన ప్రకారం తెలంగాణాలో పట్టణ జనాభా సుమారు 38 శాతంగా ఉండగా, తాజా అంచనాల ప్రకారం ఇది 42 శాతానికి చేరువవుతోంది. అంటే రాష్ట్ర రాజకీయాల్లో పట్టణ ఓటర్ల పాత్ర రోజు రోజుకీ పెరుగుతోంది. ఈ పట్టణ ఓటర్లే మున్సిపల్ ఎన్నికల ద్వారా తమ అసంతృప్తి లేదా మద్దతును నేరుగా వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు.

గత దశాబ్దంలో తెలంగాణాలో జరిగిన మున్సిపల్ ఎన్నికలను పరిశీలిస్తే, అవి రాష్ట్ర రాజకీయాలకు సూచికలుగా ఎలా మారాయో స్పష్టంగా తెలుస్తుంది. 2019?20లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. 141 మున్సిపాలిటీల్లో 88కి పైగా చోట్ల బీఆర్ఎస్ ఆధిపత్యం కొనసాగింది. ఆ ఫలితాలు తరువాత జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ రాజకీయ వేడిని పెంచాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలు బీజేపీ ఎదుగుదలకు వేదికగా మారగా, బీఆర్ఎస్ తన పట్టును నిలుపుకుంది. ఈ పరిణామాలన్నీ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్ర రాజకీయ దిశను ఎలా ప్రభావితం చేస్తాయో అప్పుడే నిరూపించాయి.

ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలకడం తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పు. ఈ నేపథ్యంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా మారుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ప్రజల ముందుకు వెళ్లే ఈ ఎన్నికల్లో ప్రభుత్వ పనితీరు, ఇచ్చిన హామీల అమలు, పాలన శైలి నేరుగా ప్రజా తీర్పుకు లోనవుతుంది. అందుకే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి.

కాంగ్రెస్ పార్టీ దృష్టిలో మున్సిపల్ ఎన్నికలు రెండు విధాలుగా కీలకం. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల్లో పొందిన ప్రజాభిమానాన్ని పట్టణ స్థాయిలోనూ నిలబెట్టు కోవాల్సిన అవసరం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో బలంగా ఉన్న పట్టణ స్థానిక సంస్థలపై తన పట్టు సాధించాల్సిన రాజకీయ అవసరం ఉంది. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 142 మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో అధిక భాగం ఇప్పటికీ బీఆర్ఎస్ ప్రభావంలోనే ఉన్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యల పరిష్కారంలో తన సామర్థ్యాన్ని చూపించాల్సి ఉంటుంది.ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పట్టణ ప్రజల్లో ఎంత మేరకు విశ్వాసం పొందాయన్నది కూడా ఈ ఎన్నికల్లో తేలనుంది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా వంటి పథకాలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ప్రభావం చూపినప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగం, జీవన వ్యయం, ఇంధన ధరలు, అద్దె భారం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఈ అంశాలపై ప్రజల స్పందన కాంగ్రెస్‌కు కీలకంగా మారనుంది. ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు ఈ మున్సిపల్ ఎన్నికలు రాజకీయ పునరుజ్జీవనానికి అవకాశంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఎదుర్కొంటున్న అంతర్గత అసంతృప్తులు, నాయకుల వలసలు, కార్యకర్తల్లో నైరాశ్యం వంటి పరిస్థితుల్లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు బీఆర్ఎస్‌కు పరీక్షగా నిలుస్తున్నాయి. గతంలో పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు ఉన్న పార్టీగా పేరున్న బీఆర్ఎస్, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తే తన రాజకీయ స్థితిని తిరిగి బలపరుచుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలు, ఉత్తర తెలంగాణ పట్టణాల్లో బీఆర్ఎస్‌కు ఇప్పటికీ గణనీయమైన ఓటు బ్యాంకు ఉందన్న అంచనాలు ఉన్నాయి. బీఆర్ఎస్ వ్యూహం ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల చుట్టూ తిరగనుంది. అధికారంలోకి వచ్చి తక్కువ కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు కాలేదని, అభివృద్ధి పనులు నిలిచి పోయాయని, ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని ఆరోపణలు చేస్తూ పట్టణ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. మున్సిపాలిటీలకు నిధుల కొరత, పారిశుద్ధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులు వంటి అంశాలను ప్రధానంగా ప్రచారంలోకి తీసుకొచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు తన రాజకీయ ప్రాధాన్యత ఇంకా తగ్గలేదని నిరూపించుకునే వేదికగా మారాయి. మూడవ ప్రధాన పార్టీగా బీజేపీ కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో గణనీయమైన విజయాలు సాధించిన బీజేపీ, పట్టణ ఓటర్లలో తన పట్టు పెంచుకోవాలనే లక్ష్యంతో ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి, యువత, వ్యాపార వర్గాల్లో తన ప్రభావాన్ని విస్తరించేందుకు మున్సిపల్ ఎన్నికలను ఉపయోగించుకోవాలని భావిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీని ఆసరాగా చేసుకుని కొన్ని పట్టణాల్లో కీలక పాత్ర పోషించాలన్నది బీజేపీ వ్యూహంగా కనిపిస్తోంది.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధానంగా చర్చకు వచ్చే అంశాలు పట్టణ జీవనానికి నేరుగా సంబంధించినవే. తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, చెత్త నిర్వహణ, రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక లోపాలు వంటి సమస్యలు ఓటర్లను ప్రభావితం చేస్తాయి. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొన్ని పట్టణాల్లో మౌలిక వసతులు మెరుగు పడ్డాయన్న అభిప్రాయం ఉన్నప్పటికీ, అనేక చోట్ల అసమాన అభివృద్ధి జరిగిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యలను ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నది ప్రజల తీర్పులో కీలకంగా మారనుంది. గణాంకాల పరంగా చూస్తే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రాధాన్యత మరింత స్పష్టమవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపి సుమారు 3,500కు పైగా వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డులో సగటున 3,000 నుంచి 5,000 వరకు ఓటర్లు ఉంటారు. అంటే దాదాపు కోటి మంది పట్టణ ఓటర్లు నేరుగా ఈ ఎన్నికల్లో పాల్గొంటారు. ఈ స్థాయి ఓటర్ల అభిప్రాయం రాష్ట్ర రాజకీయాలకు స్పష్టమైన సంకేతాన్ని ఇస్తుంది. అంతేకాదు, ఈ ఎన్నికల ద్వారా వేలాది మంది ప్రజాప్రతినిధులు ఎంపిక అవుతారు. వీరిలో భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదిగే నాయకులు ఉండే అవకాశం ఉంది. అందువల్ల అన్ని పార్టీలు ఈ ఎన్నికలను నాయకత్వ తయారీ వేదికగా కూడా చూస్తున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు పెద్ద సవాల్‌గా మారింది. తెలంగాణలో పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణాలు, స్థానిక సమస్యలపై అవగాహన కీలకంగా ఉంటాయి. పార్టీ ఇమేజ్ ఎంత బలంగా ఉన్నా, స్థానిక అభ్యర్థిపై అసంతృప్తి ఉంటే ఫలితాలు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో అనేక చోట్ల పార్టీ కంటే అభ్యర్థి వ్యక్తిగత ప్రభావమే గెలుపును నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. అందువల్ల ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం కూడా కీలక సూచికగా మారనుంది. సాధారణంగా తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 55 నుంచి 60 శాతం మధ్యే ఉంటుంది. అయితే ఇటీవల పట్టణ ప్రజల్లో రాజకీయ చైతన్యం పెరగడం, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ కావడంతో ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉన్నాయి. అధిక ఓటింగ్ ప్రభుత్వంపై అసంతృప్తిని సూచిస్తుందా లేక ప్రజల చైతన్యాన్ని ప్రతిబింబిస్తుందా అన్నది ఫలితాల అనంతరం విశ్లేషణకు అంశంగా మారనుంది. మీడియా, సోషల్ మీడియా కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒక మున్సిపాలిటీలో జరిగిన చిన్న సంఘటన కూడా రాష్ట్రవ్యాప్తంగా చర్చకు రావడం, పార్టీల మధ్య ఆరోపణలు?ప్రత్యారోపణలు పెరగడం రాజకీయ వేడిని పెంచుతోంది. పట్టణ ఓటర్లు వార్తలు, విశ్లేషణలను తక్షణమే అందుకుంటూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే స్థితిలో ఉన్నారు. ఇది మున్సిపల్ ఎన్నికలను మరింత సున్నితంగా, ప్రతిష్టాత్మకంగా మారుస్తోంది. మొత్తంగా తెలంగాణలో ప్రస్తుత మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక సంస్థల పాలనకే పరిమితం కావడం లేదు. ఇవి కాంగ్రెస్ ప్రభుత్వానికి తొలి పెద్ద పట్టణ పరీక్షగా, బీఆర్ఎస్‌కు రాజకీయ పునరుజ్జీవన అవకాశంగా, బీజేపీకి విస్తరణ వేదికగా మారాయి. అభివృద్ధి, సంక్షేమం, పాలన సామర్థ్యం, ప్రజల విశ్వాసం అన్నీ ఈ ఎన్నికల్లో పరీక్షకు నిలుస్తున్నాయి. అందువల్ల తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తాత్కాలిక ప్రభావంతోనే కాకుండా, భవిష్యత్ రాజకీయ దిశను నిర్ణయించే కీలక ఘట్టాలుగా నిలవనున్నాయి.

తెలుగువారి హస్తభూషణం శంకర నారాయణ నిఘంటువు

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సాధనే ఏకైక లక్ష్యంగా, అఖండ భారతావనిలో అడుగిడిన శ్వేత జాతీయులు, మొదటగా ప్రారంభించింది వ్యాపారమే. అయితే ముందు వ్యాపారం చేయడానికి, అనంతరం అధికారం చెలాయించడానికి. ఇక్కడి భాషలు రావు. స్థానికులకు భాష వారికి అర్థమయ్యేది కాదు, అలాగే వారి భాష ఈ దేశస్తులకు బోధపడేది కాదు. వ్యాపారం, పరిపాలన అవసరాల దృష్ట్యా, ఆంగ్ల అధికారులు మెలమెల్లగా స్థానికుల భాషల పదాలను తమ భాషలోని తర్జుమా చేసుకోవడం ప్రారంభించారు. ఈ క్రమం లోనే తెలుగు పదాలను అర్థం చేసుకుంటూ, తర్జుమా చేసుకున్నారు. తద్వారా నిఘంటువులు తయారు చేశారు. అలా1818లో విలియం బ్రౌన్ తొలి తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు తయారు చేశాడు. జాన్ కార్నిక్ మారిస్ అనే వ్యక్తి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు తయారు చేశాడు. 1821లో క్యాంప్ బెల్ ఇలాంటిదే ఇంకో నిఘంటువు తయారు చేశాడు. తరువాత సీ.పీ. బ్రౌన్ దొర ఇంకో నిఘంటువు 1852 లో (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి సరిగ్గా అయిదేళ్ల ముందు) తయారు చేశాడు. చాలా మంది తెల్ల అధికారులు ద్విభాషలను తెలిసిన వారినే పెట్టుకున్నారు. అయితే అందరికీ రెండు భాషల్లో అంత ప్రావీణ్యం ఉండక పోవడం సహజమే. వారి అనువాదం అంత కచ్చితంగా ఉండేది కాదు. ఈ సమస్యను సాధ్యమైన రీతిలో అధిగమించడానికి ఆచార్య పాలూరి శంకరనారాయణ విశేష కృషి చేశారు. తొలి ఇంగ్లీష్, తెలుగు నిఘంటువును రూపొందించాడు. ఆచార్య పాలూరి శంకరనారాయణ భాషావేత్త, నైఘంటికుడు, సంస్కృతాంధ్ర పండితుడు, రాయల్ ఏషియాటిక్ సొసైటీ సభ్యుడు. శ్రీకాకుళంలో జన్మించి, మున్సిపల్ హైస్కూల్ లో చదివి, అక్కడే కొంతకాలం ఉపాధ్యాయునిగా పని చేశారు. తర్వాత మద్రాసులో ప్రెసిడెన్సీ కళాశాలలో గణిత శాస్త్ర ఆచార్యుని గా, మద్రాసు విశ్వవిద్యాలయంలో ప్రధాన పరీక్షల అధికారిగా కూడా పని చేశాడు. కొచ్చిన్ యువ రాజులు, యుక్తవయసులో ఉన్న పిఠాపురం రాజా వంటి వారికి విద్యాబోధన చేశాడు. శంకర నారాయణ రచించిన తెలుగు - ఇంగ్లీషు, తమిళం-ఇంగ్లీషు నిఘంటువు చాలా ప్రసిద్ధి చెందినది. శంకర నారాయణగా పేరొందిన ఆయన పూర్తిపేరు పాలూరి శంకరనారాయణ శ్రేష్ఠి. ఆయన తయారు చేసిన తొలి ఇంగ్లీషు తెలుగు నిఘంటువు పేరే శంకర నారాయణ నిఘంటువు. తన జీవిత కాలంలో ఆయన తమిళనాడు రాజధాని మద్రాసు, ఒరిస్సాలోని గంజాం, జయపురం, మన రాష్ట్రంలోని విజయనగరం, పిఠాపురం, నూజివీడు, నెల్లూరు, కేరళలోని కొచ్చి లను సందర్శించాడు. రాచబిడ్డలకు చదువులు చెబుతున్నప్పుడే ఆయన వారి సౌలభ్యం కోసం ఇంగ్లీషు పదాలు, వాటి తెలుగు అర్థాల జాబితాను తయారు చేశాడు. తరువాత దాన్నే వ్యవస్థీకరించి, ఇంగ్లీషు తెలుగు నిఘంటువుని తయారు చేశాడు. అంతే కాదు, ఆయన తమిళ - ఇంగ్లీషు, ఇంగ్లీషు - తమిళ నిఘంటువులను కూడా తయారు చేశాడు. 1900 ప్రాంతంలో తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు కూడా తయారు చేశాడు. ఆయన తయారుచేసిన తెలుగు నిఘంటువు 1897లో ప్రచురితమైంది. ఆయన బతికుండగానే అయిదు ముద్రణలకు నోచుకుంది. ప్రతి ముద్రణకీ కొత్త పదాలను కలిపారు. ఆయన 1924-25 ప్రాంతంలో చని పోయాడు. ఆ తరువాత 1927 లో గిడుగు సీతాపతి, 1951 లో చిలుకూరి నారాయణ రావు, తరువాత వేదం లక్ష్మీనారాయణ కొత్తకొత్త పదాలను జోడించారు. 1953 లో నారాయణ అయ్యర్ దీనిని పరిష్కరించారు. ఇలా 1897 నుంచి 1953 వరకూ పదకొండు సార్లు పునర్ముద్రణ పొందింది ఈ నిఘంటువు. ఇప్పటికీ ఈ నిఘంటువుయే చాలా చోట్ల ప్రామాణికం. తరతరాల విద్యార్థులకు ఇది హస్త భూషణంగా నిలిచింది. 2004 అక్టోబరులో విజయవాడకు చెందిన విక్టరీ పబ్లిషర్స్ దీన్ని మళ్లీ ముద్రించారు. ఆగస్టు 2005 నాటికి మలి ముద్రణ అవసరమైంది. మళ్లీ 2006, 2007లలో పునర్ముద్రించాల్సి వచ్చింది. కోస్తా, తమిళనాడుల్లో ఆంగ్ల భాష నేర్చు కోవడంలో ఆయన పాత్ర అనన్య సామాన్యం. ఆయన పేరుతోనే ఆయన వ్రాసిన నిఘంటువు పేరొందింది. ఇప్పటికీ శంకరనారాయణ నిఘంటువు అంటే ప్రామాణికమే. ఎస్.రామానుజం చెట్టియార్ ప్రోత్సాహంతో రూపొందిన ఈ తెలుగు - ఇంగ్లీషు నిఘంటువు మొదటి సారిగా 1900 సంవత్సరంలో మద్రాసు నుండి ప్రచురించ బడింది. తరువాతి కాలంలో అంటే 1927 వరకు చివరి సారిగా ముద్రించారు. దీనిని వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు 1953లో తిరిగి ముద్రించ తల పెట్టగా, ఎస్.నారాయణ అయ్యం గార్, వేదం లక్ష్మీ నారాయణ శాస్త్రి అశేష కృషి చేశారు. అలా సదరు సమగ్ర ప్రచురణ 31 జనవరి, 1953లో ప్రచురించ బడింది. ఇది "ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్" వారు 2003 సంవత్సరం లో మద్రాసు, న్యూఢిల్లీ నుండి ప్రచురించ బడింది.

ఈసారి జీడీపీ వృద్ధి రేటు 7.2 శాతం

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సర్వేను గురువారం పార్లమెంట్‌లో సమర్పించారు. కేంద్ర బడ్జెట్ వెలువరించేందుకు ఒకరోజు ముందు సాంప్రదాయంగా వస్తున్న ఆర్థిక సర్వే ఈసారి రెండు రోజుల ముందు సభలో ఉంచారు. ఈసారి బడ్జెట్ ప్రకటన వారాంతం వస్తుండటంతో ఆర్థిక సర్వేను ముందుగానే ప్రవేశపెట్టారు. గడిచిన ఏడాది కాలానికి సంబంధించి దేశ ఆర్థికవ్యవస్థ పనితీరు, భవిష్యత్తు కోసం కీలకమైన అంచనాలు, విధాన పరమైన సూచనలను ఈ అర్వే అందిస్తుంది. రాబోయే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఎదుర్కోవాల్సిన సవాళ్లను అంచనా వేస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఎకనమిక్ అఫైర్స్ విభాగం దీన్ని రూపొందిస్తుంది. 1950 నుంచి దీన్ని బడ్జెట్‌తో పాటే అందిస్తున్నప్పటికీ 1960 తర్వాత నుంచి బడ్జెట్ ప్రకటనకు ఒకరోజు ఉండగా సభ ముందుంచుతున్నారు. ఆర్థిక సర్వే దేశ ఆర్థికవ్యవస్థ ముందుకెళ్లేందుకు, గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన మార్పులను పరిగణలోకి తీసుకుని, సమీక్షిస్తూనే భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.8 శాతం నుంచి 7.2 శాతం పరిధిలో వృద్ధి చెందుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది.

ఇది ఇటీవల గణాంకాలు, ప

మెంతి కూర పపర్ తెలిస్తే వదలరు

ఎన్నో ఔషధ గుణాలు ఉన్న మెంతి ఆకు.. అనేక ఆరోగ్య సమస్యలను నివారించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. కాలేయ సమస్యలు, మధుమేహం నియంత్రణ, చర్మ వ్యాధుల నివారణకు తోడ్పడుతుంది. కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, ప్రోటీన్లు, ఫైబర్ సమృద్ధిగా ఉండే ఈ ఆకు, జ్ఞాపకశక్తిని పెంచి, క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధించగలదు. మెంతి కూరలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు పుష్కలంగా దాగున్నాయి.. మన భారతీయ వంటకాల్లో సర్వసాధారణంగా ఉపయోగించే ఒక అద్భుతమైన ఆకుకూర. ఇది కేవలం రుచిని పెంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. దీనిని మెంతి లేదా మెంతి కూర అని కూడా పిలుస్తారు. రుచికి చేదుగా ఉన్నప్పటికీ, ఈ ఆకు అనేక పోషక విలువలను, అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. సాధారణంగా మెంతి ఆకులో చిన్న మెంతెం, పెద్ద మెంతెం అని రెండు రకాలుంటాయి. ఈ ఆకు శరీరానికి సంబంధించిన అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతుంది. మెంతి ఆకులో కాల్షియం, ఇనుము, ఫాస్ఫరస్‌లతో పాటు ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. అంతేకాకుండా, ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. ఈ పోషకాలు శరీరానికి బలాన్ని చేకూర్చి, వివిధ వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయి. లివర్ ఆరోగ్యం, డయాబెటిస్ నియంత్రణ: మెంతి ఆకు ముఖ్యంగా కాలేయ సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా మేలు చేస్తుంది. రక్తంలో షుగర్ స్థాయిలను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. చర్మ సంరక్షణ: చర్మ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. జీర్ణక్రియ, ఇతర సమస్యలు: మెంతి ఆకు ఆకలిని పెంచుతుంది. దగ్గు, మొలలు, వాంతులు, కీళ్ల వ్యాధులు వంటి అనేక సాధారణ వ్యాధులను నివారిస్తుంది. కడుపులోని నులిపురుగులకు ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది. అయితే, పప్పు దినుసులలో దీనిని అతిగా వేయకూడదు.. లేదంటే పప్పు చేదుగా మారుతుంది. రక్తహీనత నివారణ: ఇందులో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల రక్తహీనతను దూరం చేయడంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. కంటిచూపు మెరుగుదల: మెంతికూరలో అధికంగా ఉండే ఫైబర్ కంటిచూపును మెరుగుపరుస్తుంది. దృష్టి లోపాలు ఉన్నవారు ఈ ఆకును తమ ఆహారంలో ఎక్కువగా చేర్చుకోవడం మంచిది. శరీర ఉష్ణోగ్రత నియంత్రణ: శరీర ఉష్ణోగ్రత అధికంగా ఉండేవాళ్లు మెంతికూరను తీసుకోవచ్చు. ఇది శరీరానికి చలువనిస్తుంది.. వేడి వలన వచ్చే అలర్జీలను దూరం చేస్తుంది. కఫం, పిత్త, వాతం వంటి రోగాలను దరిచేరనివ్వకుండా చేస్తుంది. జ్ఞాపకశక్తి మెరుగుదల, క్యాన్సర్ నిరోధం: మెంతి ఆకు జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సఫోన్ మ్యూకలేట్ ధాతువులు క్యాన్సర్‌ను నిరోధించడంలో సహాయపడతాయి. హృదయ ఆరోగ్యం, ఇతర ప్రయోజనాలు: విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వల్ల గుండెపోటు, అలర్జీలు, దృష్టి లోపాలు, రక్తహీనత వంటి వాటిని తొలగిస్తుంది. నరాల బలహీనతతో బాధపడేవారు కూడా మెంతి కూరను తమ ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు. ఇంకా.. మెంతి ఆకులను పేస్ట్‌లా చేసి ఫేషియల్‌గా ఉపయోగించవచ్చు. ఇది నల్లగా ఉన్నవారికి చర్మకాంతిని పెంచి, ముఖంపై నల్ల మచ్చలు, ముడతలను తగ్గిస్తుంది. మెంతులను నానబెట్టి పేస్ట్‌లా చేసి జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. మెంతి ఆకుతో లేదా మెంతులతో చేసే పప్పు ఆరోగ్యానికి మంచి పౌష్టికాహారం. మెంతి ఆకును ఎండబెట్టి పొడి చేసుకొని, అవసరమైనప్పుడు పప్పులు, కూరలలో వాడుకోవచ్చు. ఇది ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుంది. మన ఇంటి పెరడులో కూడా మెంతి ఆకును సులువుగా పెంచుకోవచ్చు.. వారానికి కనీసం రెండు లేదా మూడుసార్లు మెంతులు లేదా మెంతి ఆకును ఆహారంలో చేర్చుకోవడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఇది కేవలం ఒక ఆకుకూర మాత్రమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే ఒక దివ్య ఔషధం అంటున్నారు ఆయుర్వేద నిపుణులు.

ఈ సమయంలో అరటిపండు అస్సలు తినొద్దా

చలికాలం వచ్చిందంటే చాలు, పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే కఫం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. చలికాలం వచ్చిందంటే చాలు.. చిన్న పిల్లల తల్లులకు ఒకటే ఆందోళన. మారుతున్న వాతావరణం వల్ల పిల్లలు త్వరగా జలుబు, దగ్గు బారిన పడుతుంటారు. ఇలాంటప్పుడు వారి ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ క్రమంలో తల్లులు పిల్లలకు దూరంగా పెట్టే ప్రధానమైన ఆహారం అరటిపండు. అరటిపండు తింటే శ్లేష్మం పెరుగుతుందని, దగ్గు ఎక్కువవుతుందని చాలామంది నమ్ముతారు. కానీ ఇందులో నిజమెంత? చలికాలంలో అరటిపండు పెట్టడం సురక్షితమేనా? నిజానికి జలుబు లేదా దగ్గు అనేవి వైరస్ల ద్వారా వచ్చే ఇన్ఫెక్షన్లు. ఏ పండు కూడా నేరుగా జలుబును కలిగించదు. అరటిపండు తినడం వల్ల శరీరంలో శ్లేష్మం పెరుగుతుందని నిరూపించడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు. అరటిపండు తిన్నప్పుడు గొంతులో కొంచెం బిగుతుగా అనిపించడం సహజం. అది కేవలం ఆ పండు ఆకృతి వల్ల కలిగే అనుభూతి మాత్రమే తప్ప కఫం కాదు. పిల్లలు జలుబు, దగ్గుతో బాధపడుతున్నప్పుడు నీరసించి పోతుంటారు. ఏమీ తినడానికి ఇష్టపడరు. అలాంటి సమయంలో అరటిపండు వారికి ఒక వరంలా పనిచేస్తుంది. ఇందులో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల పిల్లలకు తక్షణ శక్తిని ఇస్తుంది. అరటిపండు మెత్తగా ఉండటం వల్ల గొంతు నొప్పి ఉన్న పిల్లలు కూడా దీనిని సులభంగా తినగలరు. ఇందులోని విటమిన్ సి, విటమిన్ ఃఓ రోగనిరోధక శక్తిని పెంచి వైరస్‌తో పోరాడటానికి సహాయపడతాయి. శరీరంలోని ఖనిజ లవణాల సమతుల్యతను కాపాడుతుంది.

పిల్లలకు అరటిపండు పెట్టినప్పుడు ఒకవేళ విరేచనాలు అవుతుంటే మాత్రం తాత్కాలికంగా ఆపేయడం మంచిది. చలికాలంలో ఏ ఆహారమైనా మితంగా ఇవ్వాలి. రోజుకు ఒకటి లేదా సగం అరటిపండును మ్యాష్ చేసి ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఫ్రిజ్‌లో పెట్టిన అరటిపండ్లను నేరుగా పిల్లలకు ఇవ్వకండి. గది ఉష్ణోగ్రత వద్ద ఉన్న పండ్లను మాత్రమే ఇవ్వండి. అరటిపండు ప్రకృతి మనకిచ్చిన ఒక అద్భుతమైన సూపర్ ఫుడ్. అనవసరమైన అపోహలతో పిల్లలకు ఈ పోషకాలను దూరం చేయకండి. జలుబు చేసినప్పుడు ఆకలిగా లేని పిల్లలకు అరటిపండు ఒక మంచి ప్రత్యామ్నాయం.

నిమ్మకాయ నీటిలో ఈ ఒక్క పదార్థం కలిపి తాగండి చాలు!

మలబద్ధకం ఈ రోజుల్లో చాలామందిని ఇబ్బంది పెడుతున్న సాధారణ సమస్య. అనియమిత ఆహారపు అలవాట్లు, తక్కువ ఫైబర్ తీసుకోవడం, నీరు సరిపడా తాగకపోవడం, ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ సమస్య వస్తోంది. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మనం తిన్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమై విసర్జించబడాలి. లేదంటే అనేక వ్యాధుల బారినపడాల్సి వస్తుంది. మారుతున్న జీవనశైలిలో భాగంగా ఎవరూ కూడా సమయానికి భోజనం చేయడం లేదు. దీంతో తిన్నది జీర్ణం కావడం లేదు. ఈ క్రమంలో చాలా మంది మలబద్ధకం సమస్యను ఎదుర్కొంటున్నారు. మలబద్ధకం అనేది మన దైనందన జీవితాన్ని చాలా ఇబ్బంది పెట్టడమే గాక.. అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. అయితే, ఈ విషయాన్ని చాలా మంది బయటకు చెప్పుకోలేక బాధపడే వాళ్లూ ఉన్నారు. అయితే సహజంగా, ఇంట్లోనే సులభంగా మలబద్ధకాన్ని తగ్గించుకునే ఒక మార్గం ఉందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీటికి ఇదొక్కటి కలపండి.. మలబద్ధకాన్ని నివారించేందుకు చాలా మంది నిమ్మకాయ నీరు తాగుతుంటారు. అయితే, ఇందులో ఒక పదార్థం చేర్చడం వల్ల మలబద్ధకం సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయ నీరు పేగులను హైడ్రేట్ చేయడంతోపాటు సిట్రిక్ యాసిడ్‌ను విడుదల చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అయితే, మీరు తాగే నిమ్మకాయ నీటిలో కేవలం ఒక స్పూన్ చియా గింజలను కలిపి 10 నిమిషాలు నానబెట్టి తీసుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు కలుగుతాయి. చియా గింజలను నిమ్మకాయ నీటికి

జోడించడం వల్ల పేగులకు, ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. చియా గింజలతో నిమ్మకాయ నీరు కలిపి తాగితే.. చియా గింజల్లో కరిగే ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అందుకే నానబెట్టినప్పుడు అవి గుజ్జు లాంటి పదార్థంగా మారుతాయి. ఫుడ్ సైన్ అండ్ న్యూట్రిషన్ అధ్యయనం ప్రకారం.. ఆ గుజ్జు జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఉదయం మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. జీర్ణవ్యవస్థ శుభ్రపర్చడం ద్వారా మలబద్ధకాన్ని నివారిస్తుంది. చియా గింజలలో ఒమేగా3 (ఆల్ఫా-లినోలెనిక్ ఆమ్లం), నిమ్మకాయ నీటితో కలిపితే ట్రైగ్లిజరైడ్స్, ఎల్డీఎల్ కొలెస్ట్రాల్, వాపును తగ్గించడంలో సహాయపడుతుంది. మంచి కొలెస్ట్రాల్ ఊఆఒ స్థాయిలను పెంచుతుంది. రెండు కలిపి తీసుకోవడం వల్ల లిపిడ్ స్థాయిలను మెరుగుపర్చి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. దీంతో గుండె జబ్బులు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. చియా గింజల్లో లభించే ఫైబర్, నిమ్మకాయ నీటితో కలిపితే కార్బోహైడ్రేట్ల శోషణను నెమ్మదిస్తుంది. ఇది గ్లూకోజ్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుంది.

అనాస పువ్వు.. పవర్ ఫుల్ మెడిసిన్..!

అనాస పువ్వు (స్టార్ పువ్వు) వంటలకు రుచినివ్వడమే కాకుండా, అద్భుత ఆరోగ్య ప్రయోజనాలనిస్తుంది. ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది, మలబద్ధకాన్ని నివారిస్తుంది. యాంటీవైరల్, యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలతో రోగనిరోధక శక్తిని పెంచి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తంలో షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది. పీరియడ్స్ సమస్యలు, చర్మ సౌందర్యానికి కూడా మేలు చేస్తుంది. అనాస పువ్వు .. ఇది ఒకరకమైన సుగంధ ద్రవ్యం.. ప్రతి వంటింట్లోనూ తప్పనిసరిగా ఉంటుంది. దీనినే స్టార్ పువ్వు అని కూడా అంటారు. ఇది వంటలకు రుచిని ఇవ్వడంతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. ముఖ్యంగా మనం తీసుకున్న ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. పేగు కండరాల కదలికలను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దరిచేరకుండా చేస్తుంది. అనాస పువ్వులో యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడతాయి. జీర్ణశక్తిని పెంపొందించడంలో అనాస పువ్వు సహాయపడుతుంది. కడుపులో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలను సమర్థవంతంగా తగ్గిస్తుంది. అనాస పువ్వు తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. రక్తాన్ని శుద్ధి చేసి గుండెకు రక్త ప్రసరణను మెరుగుపర్చడం ద్వారా హృదయ సంబంధ వ్యాధులు రాకుండా కాపాడుతుంది. రక్తంలో షుగర్ లెవెల్స్ కంట్రోల్ చేయడంలో అనాస పువ్వు ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీనివల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. మూత్రనాళ ఇన్ఫెక్షన్‌తో బాధపడేవారు అనాస పువ్వును తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లు రాకుండా నివారిస్తాయి. మహిళల్లో పీరియడ్స్ సమయంలో వచ్చే హార్మోన్ల అసమతుల్యతను తగ్గించడంలో అనాస పువ్వు ఉపయోగపడుతుంది. నెలసరి సమయంలో వచ్చే నొప్పులను కూడా తగ్గిస్తుంది. అనాస పువ్వులోని యాంటీఆక్సిడెంట్లు అనేక రకాల ఇన్ఫెక్షన్ల నుంచి చర్మాన్ని కాపాడతాయి. చర్మ సౌందర్యాన్ని రెట్టింపు చేస్తాయి.

బరువు తగ్గాలనుకుంటే ఆ పని మాత్రం అస్సలు చేయద్దు!

బరువు తగ్గడం అనేది ఒక తపస్సు లాంటిది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ తమకు తోచిన చిట్కాలు పాటిస్తుంటారు. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి 'బ్రేక్‌ఫాస్ట్ స్కిప్పింగ్'. ఉదయం పూట కడుపు ఖాళీగా ఉంచితే ఒంట్లో ఉన్న కొవ్వు కరిగిపోతుందని చాలామంది గట్టిగా నమ్ముతారు. కానీ ఇది ఎంతవరకు నిజం? అసలు ఉదయం పూట శరీరానికి అందాల్సిన ఇంధనం అందకపోతే మన అవయవాలు ఎలా స్పందిస్తాయి? పొద్దున్నే టిఫిన్ మానేయడం వల్ల మీరు నిజంగా సన్నబడతారా లేక లేనిపోని రోగాలను కొని తెచ్చుకుంటున్నారా? జపాన్ నుంచి అమెరికా వరకు జరిగిన అనేక పరిశోధనలు ఈ విషయంలో సంచలన విషయాలను వెల్లడించాయి. బరువు తగ్గడం పక్కన పెడితే.. ఈ అలవాటు వల్ల మీ మెదడు పనితీరు కూడా మందగించే ప్రమాదం ఉంది. అవును.. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. చాలా సందర్భాల్లో బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల బరువు తగ్గకపోగా.. మరింత పెరిగే అవకాశం ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. పొద్దున్నే ఏమీ తినకపోవడం వల్ల మధ్యాహ్నం సమయానికి కడుపులో ఆకలి సెగలు పుడుతుంటాయి. ఈ తీవ్రమైన ఆకలి వల్ల మధ్యాహ్నం భోజనంలో మనకు తెలియకుండానే ఎక్కువ క్యాలరీలు ఉన్న ఆహారాన్ని, జంక్ ఫుడ్‌ను ఆరగిస్తాం. ఉదయం ఆహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పడిపోతాయి. ఆ తర్వాత మధ్యాహ్నం భారీ భోజనం చేయడం వల్ల ఇన్సులిన్ అకస్మాత్తుగా పెరుగుతుంది. ఈ హెచ్చుతగ్గులు శరీరంలో కొవ్వు నిల్వలు పెరగడానికి ప్రధాన కారణమవుతాయి. రాత్రంతా నిద్రపోయిన తర్వాత మన శరీరానికి శక్తి అవసరం. అది అందకపోతే శరీరం 'సర్వైవల్ మోడ్'లోకి వెళ్తుంది. అంటే శక్తిని ఆదా చేయడం కోసం మెటబాలిజం రేటును తగ్గించేస్తుంది. ఫలితంగా మీరు ఎంత తక్కువ తిన్నా సరే క్యాలరీలు త్వరగా ఖర్చు అవ్వవు. కేవలం 'ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్' (16/8 పద్ధతి) పాటించే వారు మాత్రమే బ్రేక్‌ఫాస్ట్ మానేసి బరువు తగ్గే అవకాశం ఉంది. అంటే ఉదయం టిఫిన్ మానేసి, కేవలం మధ్యాహ్నం నుంచి రాత్రి ఎనిమిది గంటల లోపు మాత్రమే భోజనం చేస్తూ, రోజంతా తీసుకునే మొత్తం క్యాలరీలను కచ్చితంగా లెక్కిస్తే ఫలితం ఉంటుంది. అయితే ఇది అందరికీ సరిపడదు. ముఖ్యంగా గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు ఇలా చేయడం వల్ల తీవ్ర అనారోగ్య పాలయ్యే ప్రమాదం ఉంది. బ్రేక్‌ఫాస్ట్ అంటేనే రాత్రంతా మనం ఉన్న ఉపవాసాన్ని విరమించడం అని అర్థం. ఉదయం పూట పోషక విలువలూ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలు చాలా ఉన్నాయి. ఉదయం గ్లూకోజ్ అందడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయి. ఆఫీసులో లేదా చదువులో చురుగ్గా ఉండవచ్చు. సరైన ప్రోటీన్ ఉండే టిఫిన్ తీసుకుంటే రోజంతా నీరసం రాకుండా ఉంటుంది. క్రమం తప్పకుండా బ్రేక్‌ఫాస్ట్ చేసేవారిలో కొలెస్ట్రాల్, రక్తపోటు అదుపులో ఉంటాయని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉల్లిని పచ్చిపచ్చిగా తినేస్తున్నారా?

ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు లేకుండా ఏ వంటకం పూర్తి కాదు. రుచికరమైన బిర్యానీ అయినా లేదా సలాడ్ ప్లేట్ అయినా అందులో ఖచ్చితంగా ఉల్లిపాయలు ఉండాల్సిందే. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం ఆరోగ్యకరమైనదా లేదా ఉడికించిన ఉల్లిపాయలు తినడం ఆరోగ్యకరమైనదా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది.. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉల్లిపాయల ప్రయోజనాలు,హాని మనం వాటిని తినే విధానంపై ఆధారపడి ఉంటాయి. పచ్చి ఉల్లిపాయలు రుచిగా ఉన్నప్పటికీ వి అందరికీ సురక్షితం కాకపోవచ్చు. కొన్ని సందర్భాల్లో వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. ఉల్లిపాయల్లో ఫ్లేవనాయిడ్లు, టానిన్లు, ఆల్కలాయిడ్స్ వంటి భాగాలు ఉంటాయి. ఈ భాగాలు యాంటీఆక్సిడెంట్లుగా పనిచేస్తున్నప్పటికీ వాటి అధిక వినియోగం శరీరానికి హానికరం. పచ్చి ఉల్లిపాయలను ఎక్కువగా తినడం వల్ల శరీరం ఇనుము, కాల్షియంను గ్రహించే సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. ఉల్లిపాయల్లో ఈఆఒంఖలు ఎక్కువగా ఉంటాయి. ఇవి అందరికీ సులభంగా జీర్ణం కావు. దీనివల్ల గ్యాస్, ఉబ్బరం, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఉల్లిపాయలు భూమి లోపల పెరుగుతాయి. కాబట్టి అవి నేల సూక్ష్మజీవులతో కలుషితం కావచ్చు. పచ్చి ఉల్లిపాయలను సరిగ్గా కడగకుండా తింటే ఈ క్రిములు శరీరంలోకి ప్రవేశించి మెదడును ప్రభావితం చేసే సిస్టిక్ సిర్రోసిస్ వంటి తీవ్రమైన వ్యాధులను ఆహ్వానిస్తాయి. పరిశోధన ప్రకారం పచ్చి ఉల్లిపాయలు ఆరోగ్యకరమైన వ్యక్తులలో కూడా గుండెల్లో మంటను కలిగిస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉడికించిన ఉల్లిపాయలు తినడం సురక్షితం, ఆరోగ్యానికి మరింత ప్రయోజనకరం కూడా. ఉల్లిపాయలను ఉడికించడం వల్ల వాటిలోని హానికరమైన సూక్ష్మజీవులు పూర్తిగా నాశనమవుతాయి. ఉడికించిన ఉల్లిపాయలు జీర్ణం కావడానికి చాలా సులభం. ఇది కడుపు, ఛాతీ సమస్యలను నివారిస్తుంది. వంట చేయడం వల్ల ఉల్లిపాయలలోని 'యాంటీ-న్యూట్రియెంట్స్' ప్రభావం తగ్గుతుంది. శరీరం ఇతర పోషకాలు, ఖనిజాలను బాగా గ్రహించడానికి వీలు కల్పిస్తుంది. ఉల్లిపాయలు ఆరోగ్యానికి మంచివే. కానీ మీరు వీటిని తినే విధానం ముఖ్యం. మీరు పచ్చి ఉల్లిపాయలు తినవలసి వస్తే, వాటిని బాగా కడిగి, పరిమిత పరిమాణంలో తినడం మంచిది. అయితే, కడుపు నొప్పిని నివారించడానికి మెరుగైన ఆరోగ్యం కోసం నిపుణులు ఎల్లప్పుడూ వాటిని ఉడికించమనే సిఫార్సు చేస్తారు.

వరల్డ్ కప్‌కు మ్యాచ్ అధికారులని ప్రకటించిన ఐసీసీ.. లిస్ట్‌లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంపైర్లు

హైదరాబాద్ పెన్ పవర్: ఐసీసీ టీ20వరల్డ్ కప్ 2026కు ఐసీసీ మ్యాచ్ అధికారులను ప్రకటించింది. ఫిబ్రవరి 7 నుంచి ఇండియా, శ్రీలంక సంయుక్తంగా ఆతిధ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ గ్రూప్ దశలకు శుక్రవారం (జనవరి 30) మ్యాచ్ అధికారులను ఎంపిక చేసింది. ఈ లిస్ట్ లో ఇండియాతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్ అంపైర్లు కూడా ఉన్నారు. లీగ్ మ్యాచ్ లకు మొత్తం ఆరుగురు మ్యాచ్ రిఫరీలతో పాటు మొత్తం 24 మంది అంపైర్ల జాబితా లిస్ట్ వచ్చేసింది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరగుతుంది.

ప్రారంభ మ్యాచ్‌కు కుమార్ ధర్మసేన, వేన్ నైట్స్ అంపైర్లుగా వ్యవహరిస్తారు. ఫిబ్రవరి 7న మధ్యాహ్నం జరిగే మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు వెస్టిండీస్‌తో తలపడనుంది. ఆ మ్యాచ్‌కు నితిన్ మీనన్, సామ్ నోగాజ్‌స్కి ఆన్-ఫీల్డ్ అంపైర్లుగా ఉంటారు. ఫిబ్రవరి 7 సాయంత్రం ఇండియా, యూఎస్ఏ మ్యాచ్‌కు రాడ్ టక్కర్, పాల్ రీఫెల్ మైదానంలో ఉంటారు. సూపర్ 8.. నాకౌట్ మ్యాచ్ లకు అధికారులను తరువాత ప్రకటిస్తారు. గ్రూప్ దశల్లో నలుగురు భారతీయులు అధికారులుగా వ్యవహరిస్తారు. జవగల్ శ్రీనాథ్, నితిన్ మీనన్, జయరామన్ మదనగోపాల్, కెఎన్ఎ పద్మనాభన్ ఈ లిస్ట్ లో ఉన్నారు. ఆసిఫ్ యాకూబ్, అహ్సాన్ రజా అనే ఇద్దరు పాకిస్తానీ అంపైర్లు కూడా ఉన్నారు. బంగ్లాదేశ్ నుండి షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్ ఎంపికవ్వడం విశేషం. డీన్ కాస్టర్, డేవిడ్ గిల్బర్ట్, రంజన్ మడుగల్లె, ఆండ్రూ పైక్రాఫ్ట్, రిచీ రిచర్డ్‌సన్, జవగల్ శ్రీనాథ్ మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరిస్తారు. ఈసారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, స్కాట్లాండ్, అఫ్గానిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి.

రోలాండ్ బ్లాక్, క్రిస్ బ్రౌన్, కుమార్ ధర్మసేన, క్రిస్ గఫానీ, అడ్రియన్ హోల్డ్‌స్టాక్, రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, రిచర్డ్ కెటిల్‌బరో, వేన్ నైట్స్, డోనోవన్ కోచ్, జయరామన్ మదనగోపాల్, నితిన్ మీనన్, సామ్ నొగాజ్‌స్కి, కెఎన్ఎ పద్మనాభన్, అల్లావుద్దీన్ రెఫెజర్, లె పాల్ రెఫెజర్, ఎ పాల్ రీఫ్‌సన్ పాలేకర్, లాంగ్టన్ రుసెరే, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, గాజీ సోహెల్, రోడ్నీ టక్కర్, అలెక్స్ వార్ఫ్, రవీంద్ర విమలసిరి, ఆసిఫ్ యాకూబ్.

బీసీసీఐకి బవుమా సలహా.. టీమిండియా హెడ్ కోచ్‌గా అతడినే ఉంచాలంటూ కామెంట్స్

హైదరాబాద్ పెన్ పవర్: టీమిండియా హెడ్ కోచ్ గా గౌతమ్ గంభీర్ అడుగుపెట్టినప్పటి దగ్గర నుంచి భారత జట్టు ఖాతాలో ఊహించని చెత్త రికార్డులు వచ్చి చేరుతున్నాయి. టీ20 ఫార్మాట్ మినహాయిస్తే మిగిలిన వన్డే, టెస్టుల్లో భారత జట్టు స్థాయికి తగ్గ ఆట తీరును ప్రదర్శించడంలో విఫలమవుతోంది. స్టార్ ప్లేయర్స్ ఉన్నప్పటికీ జట్టు విజయాలు సాధించడంలో తడబడుతోంది. స్వదేశంలో తిరుగులేని టీమిండియా అనూహ్యంగా మన గడ్డపై విజయాలు కోసం శ్రమిస్తోంది. ముఖ్యంగా టెస్టుల్లో మన జట్టు చివరి రెండేళ్లలో సొంతగడ్డపై రెండుసార్లు క్లీన్ స్వీప్ అయ్యారు. అయితే టీమిండియా హెడ్ కోచ్ కు సౌతాఫ్రికా టెస్ట్ కెప్టెన్ టెంబా బవుమా సపోర్ట్ గా నిలిచాడు.

ఈఎస్పీయన్ క్రిక్ ఇన్ఫో తో మాట్లాడుతూ బవుమా గంభీర్ కు మద్దతుగా మాట్లాడాడు. టీమిండియా టెస్ట్ క్రికెట్ లో పరివర్తన దశలో ఉందని.. గంభీర్ కు కొంచెం సమయం కావాలని బీసీసీఐకి సూచించాడు. "వన్డేల్లో ఇండియాకు దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఉన్నారు. వీరు జట్టును ఎలా ముందుకు తీసుకెళ్తున్నారా మనకి తెలుసు. టెస్ట్ ఫార్మాట్ కు వస్తే ఈ ఇద్దరు టాప్ ప్లేయర్స్ జట్టు ఎంపికకు అందుబాటులో లేరు. ప్రస్తుతం ఇండియా రెడ్ బాల్ క్రికెట్ లో పరివర్తనం చెందుతున్న జట్టు. భారత కోచ్ గౌతమ్ గంభీర్ భుజాలపై చాలా ఒత్తిడి ఉంది. అతనికి ఇదొక ఛాలెంజ్ సిరీస్. గంభీర్ రెడ్-బాల్ ఫార్మాట్ లో ఒక కొత్త మార్గాన్ని కనుగొనాల్సి ఉంది. వన్డేల్లో కోహ్లీ, రోహిత్ సహజంగానే తమ ప్రదర్శనలతో, నాయకత్వంతో జట్టును ముందుకు తీసుకెళ్తారు. టెస్ట్ క్రికెట్ లో భారత జట్టుకు త్వరలో కష్టంగా ఉండొచ్చు. గంభీర్ స్థానం మారదని నేను భావిస్తున్నాను". అని బవుమా అన్నాడు. గౌతమ్ గంభీర్ జూలై 2024లో టీమిండియా ప్రధాన కోచ్ అయ్యాడు. ఈ 18 నెలల్లో 2025 లో ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్.. 2025లో ఆసియా కప్‌లో టైటిల్ విజయాలు తప్పితే గంభీర్ ఖాతాలో చెప్పుదగ్గ విశేషాలు ఏమీ లేవు. అయితే పరాజయాలు చాలానే ఉన్నాయి. కోచ్ పదవి చేపట్టిన తర్వాత భారత జట్టు ఈ 18 నెలల్లో 9 చెత్త రికార్డ్స్ నమోదు చేసింది. జట్టు ఓటమికి గంభీర్ ప్రయోగాలే కారణమని కొందరు అంటుంటే.. మరికొందరు ఏమో గంభీర్ వచ్చిన దగ్గర నుంచి డ్రెస్సింగ్ రూమ్ లో వాతావరణం బాగా లేదని చెబుతున్నారు. కారణాలు ఏవైనా గంభీర్ కు బ్యాడ్ లక్ మాత్రం కొనసాగుతోంది.

ప్లే ఆఫ్స్ ఆడకుండా RCB ఫైనల్‌కు.. WPL రూల్స్ ఎలా ఉన్నాయంటే..?

హైదరాబాద్ పెన్ పవర్: రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆడిన 8 మ్యాచ్ ల్లో 6 మ్యాచ్ లు గెలిచి టేబుల్ టాపర్ గా నిలిచింది. టేబుల్ టాపర్ గా నిలిచిన ఆర్సీబీ నేరుగా ఫైనల్లో అడుగుపెట్టింది. గురువారం (జనవరి 29) జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచి తుది సమరానికి అర్హత సాధించింది. మిగిలిన మ్యాచ్ లతో సంబంధం లేకుండా ఈ సీజన్ లో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్సీబీ ప్లే ఆఫ్ ఆడకుండా ఫైనల్ కు చేరుకోవడం వెనుక కారణం ఉంది. అసలు ఫౌా రూల్స్ ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం..

డబ్ల్యూపీఎల్ మొత్తం ఐదు జట్లు ఆడుతున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ జెయింట్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్ మహిళా ప్రీమియర్ లీగ్ ఆడుతున్నాయి. 2023లో ప్రారంభమైన మహిళా ఐపీఎల్..ప్రస్తుతం నాలుగో సీజన్ ముగింపు దశకు వచ్చింది. నాలుగు సీజన్ ల పాటు ఐదు జట్లు ఆడాయి. ఈ లీగ్ రూల్స్ ప్రకారం రౌండ్ రాబిన్ తరహాలో ఒక్కో జట్టు మిగిలిన జట్టుతో రెండు మ్యాచ్ లు ఆడుతుంది. టేబుల్ టాపర్ గా నిలిచిన జట్టు ఫైనల్లో అడుగు పెడుతుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్ ఆడతాయి. చివరి రెండు స్థానాల్లో ఉన్న జట్లు గ్రూప్ దశలో నిష్క్రమిస్తాయి. రూల్స్ ప్రకారం ఈ సీజన్ లో టేబుల్ టాపర్ గా నిలిచిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఫైనల్ కు అర్హత సాధించింది.ఈ మ్యాచ్ విషయానికి వస్తే ఆల్‌రౌండ్ షోతో ఆకట్టుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) డబ్ల్యూపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఛేజింగ్‌లో గ్రేస్ హారిస్ (37 బాల్స్‌లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 75), స్మృతి మంధాన (27 బాల్స్‌లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 54 నాటౌట్) దంచికొట్టడంతో గురువారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరు 8 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. టాస్ ఓడిన యూపీ 20 ఓవర్లలో 143/8 స్కోరు చేసింది. దీప్తి శర్మ (55), మెగ్ లానింగ్ (41) రాణించారు. తర్వాత బెంగళూరు 13.1 ఓవర్లలోనే 147/2 స్కోరు చేసి నెగ్గింది. ఈ ఓటమితో యూపీ ప్లే ఆఫ్ రేస్ నుంచి నిష్క్రమించింది. హారిస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ప్రభాస్ 'ఫౌజీ'.. హను ప్లాన్ ఎలా ఉంది? రిపీట్ చేస్తారా?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లైనప్ లో ప్రస్తుతం విభిన్న జోనర్ సినిమాలు ఉన్న విషయం తెలిసిందే. అందులో ఒకటి ఫౌజీ. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటున్న ఆ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 1940వ దశకంలో జరిగే కథగా.. మాతృభూమి ప్రజలకు న్యాయాన్ని అందించడానికి ఓ యోధుడు చేసే పోరాటంగా మూవీని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనలకు కొంత ఫిక్షన్ జోడించి హను రాఘవపూడి కథను సిద్ధం చేశారని టాక్. సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనుండగా.. ఆయన సరసన ఇమాన్వి నటిస్తున్నారు. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని విశాల్ చంద్రశేఖర్ అందిస్తుండగా.. పాటలను కృష్ణకాంత్ రాస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ తో కలిసి టీ సిరీస్ నిర్మిస్తున్న ఆ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. గత ఏడాది మొదలుపెట్టారు మేకర్స్. అయితే ఇప్పుడు దసరా కానుకగా సినిమాను విడుదల చేయనున్నారని కొన్ని గంటలుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇంకా అధికారికంగా ప్రకటన రాకపోయినా.. మేకర్స్ ఇప్పటికే ఫిక్స్ అయ్యారని తెలుస్తోంది. అందుకు తగ్గట్లే అటు షూటింగ్ ను.. ఇటు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను నిర్వహిస్తున్నారని సమాచారం. మరికొన్ని రోజుల్లో రిలీజ్ డేట్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేయనున్నారని వినికిడి. అదే సమయంలో ప్రభాస్ కు ఫౌజీ ఎలాంటి రిజల్ట్ ఇస్తుందనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎందుకంటే ప్రభాస్ రీసెంట్ గా ది రాజా సాబ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్ డ్ రెస్పాన్స్ అందుకున్నారు. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా.. అనుకున్న స్థాయిలో అందరినీ ఆకట్టుకోలేకపోవడంతో అనేక విమర్శలు వచ్చాయి.. వస్తున్నాయి. దీంతో ఫౌజీతో కమ్ బ్యాక్ ఇవ్వాలని అంతా కోరుకుంటున్నారు. అయితే ప్రభాస్ యాక్టింగ్ విషయంలో అదరగొడతారనే విషయం తెలిసిందే. అందుకే డైరెక్టర్ హనుపై మొత్తం ఆధారపడి ఉంది. నిజానికి ఎమోషన్, గ్రాండ్యూర్ కు పేరుపొందిన హను రాఘవపూడి, ఇప్పటికే పలు సినిమాలతో హిట్స్ అందుకున్నారు. ముఖ్యంగా సీతారామం మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. తన మేకింగ్ అంట్ టేకింగ్ తో అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకే ఇప్పుడు ఫౌజీ విషయంలో కూడా అదే రిపీట్ చేస్తారని అంతా ఆశిస్తున్నారు. కేవలం సినిమా హిట్ అయ్యేలా చూడడమే కాకుండా.. ప్రభాస్ కెరీర్ లో గుర్తుండిపోయే మూవీ తీస్తారని అంచనా వేస్తున్నారు. అయితే ప్రభాస్ ను ఆయన ఇంతకు ముందు ఎప్పుడూ చూడని పవర్ ఫుల్ అవతార్ లో చూపించబోతున్నారని సమాచారం. మరి ఫౌజీ చిత్రం ఎలాంటి హిట్ అవుతుందో.. హను ప్లాన్ ఎలా ఉంటుందో.. సక్సెస్ మోడ్ రిపీట్ చేస్తారో లేదో వేచి చూడాలి.

రుహాని శర్మ: ప్రతి ఫ్రేమ్‌లో గ్రేస్

మోడరన్ ఫైర్‌తో శాన్వి శ్రీవాస్తవ క్లాసిక్ బ్యూటీ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965